

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 296

మంగళవారం 9-7-2024


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

SIDDHARTH INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY

Remember - even Core Engineering Graduates have a multitude of opportunities..

- Entrepreneur
- Opportunities even in Space and Defence sectors..
- Skilled Technology Expert

4.5 LPA is not enough..
WE MAKE IT EASIER FOR YOU TO GET UPTO 40+ LPA SALARY



100% PLACEMENT ASSISTANCE

FEW OF OUR RECRUITERS

Infosys, tcs, IBM, wipro, ITC Infotech, TCL, HCL, Tech Mahindra, Capgemini, Milekal, sure, Prodapt, Mphasis, Mindtree, Rahwan Cybertek, Testyantra, amazon, Cognizant, accenture, Concentrix, virtusa, Innogeye, Hexaware, KPIT



WHY SIDDHARTH...?

Need a Secure & High Package JOB
Placement Training from 1st Year itself. Top notch training MOUs with Multi National Companies. Potential for 1000+ job opportunities by companies running on the campus.

Build your Own Business
Siddharth International Incubation Center nurtures the innovative ideas of the students and accommodates student STARTUP COMPANIES ₹ 7.3 Crores sanctioned by DST, Govt. of India. ₹ 10.5 Crores sanctioned under NIDHI-SSS. ₹ 2.5 Crores sanctioned under Accelerator Programme ₹ 25 Lakhs to ₹ 1 Crore through Seed Support System.

Research Centers
DYNED Lab and R&D Centre Laboratories set up by A.P. State Skill Development Centre. Research Laboratories on Cloud computing, Big Data, Automation Robotics, Cyber Security, SAP, Sales Force, Block Chain Technology, etc...

Students Achievement
2 Siddharth Students among 3 from India selected for GOOGLE I/O, California, USA. Siddharth Students attended Silicon Valley Meetup at Stanford University, California, USA. University Gold medals & "Prathibha Awards". Our Students grabbed 1st prize at National Level IoT competition, IIT Varanasi(BHU) -TECHNEX.

Best Infrastructure
A/C Computer Laboratories with 2500 High Configured systems on a single floor. Digital & Virtual Classrooms. Wi-Fi Campus, Hostel facility for Boys & Girls. 4000 seating Capacity A/C AUDITORIUM, GYM & Sports Facility.

EARN while LEARNING

A unique "Earn while Learning" scheme created by the Institute Five companies on the Campus running with the support of Final Year students.

DVG, Config USA, Champs, eSoftLabs, dnd, HICORE

COLLABORATION WITH IIT-TIRUPATI

भारतीय प्रौद्योगिकी संस्थान तिरुपति
IIT TIRUPATI

Siddharth Institutions are under active consideration of IIT Tirupati for mentoring of its academic system of advanced learning and research.

INDUSTRY ACADEMIA PARTNERSHIP (IAP)

Programme is a new generation of Professional Education system in Science and Engineering. Siddharth Institutions tied up 34 Multi - National and International companies on Techno commercial Education that can make the students aware of contemporary needs and responsibilities with best Professional ability.



CENTERS OF EXCELLENCE

virtusa, Skill AP APSSDC, intel, IBM, Dassault Systemes The 3DEXPERIENCE LAB

CMSEC
CM'S SKILL EXCELLENCE CENTER
Artificial Intelligence Machine Learning and Deep Learning Zonal Center, Civil & Mechanical Design Software Labs

SIEMENS TDS
1. DESIGN COMPUTER BASED TESTING LAB
2. HOME ELECTRONICS LAB
3. OFFICE ELECTRONICS LAB
4. HOME ELECTRICAL LAB
5. REFRIGERATION & AIR-CONDITIONING LAB
6. AUTOMOBILE TWO WHEELER LAB
7. AUTOMOBILE FOUR WHEELER LAB

OUR EMPLOYABILITY SKILLS & TRAINING FRAMEWORK


- 1st YEAR — ENGLISH COMMUNICATION SKILLS
- 2nd YEAR — SOFT SKILLS & PROGRAMMING COURSES IN JAVA & PYTHON
- 3rd YEAR — CORPORATE TECHNICAL TRAINING ON (AI, IOT, ML, CLOUD COMPUTING, SAP CYBER SECURITY, ect...) & APTITUDE
- 4th YEAR — INTERNSHIPS, PROJECT WORK & INDUSTRY READINESS

SMALL STEPS BIG LEAP!

TRAINING DELIVERED BY SOFTWARE PROFESSIONALS



ROBOTS
APSSDC-ECM CONVERGENCE TRAINING CENTER (ADVANCED ROBOTIC LAB)
aps
ARC — APPLIED ROBOT CONTROL



Dr.K.Ashok Raju
Chairman

CONTACT FOR ADMISSIONS
+91 9396904599, 9704668399 www.sietk.org

KALYANI ADS


'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల
కళ్లలో వెలుగులు చూసినపుడే
నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 296

మంగళవారం 9-7-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పతాకధారిగా సింధు
పారిస్ ఒలింపిక్స్‌లో భారత బృందాన్ని నడిపించనున్న స్టార్ షట్లర్ - 10లో



డిస్కౌంట్ల షి'కారు'
కార్ల కంపెనీల ఆఫర్ల వర్షం.. భారీగా ధరల తగ్గింపు - 11లో




సంకీర్ణమా, సంక్షోభమా?
ఫ్రాన్స్ ఎన్నికల్లో నేషనల్ ర్యాలీ పార్టీ సారథ్యంలోని కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. ఫలితాల్లో ఏ కూటమికీ మెజారిటీ రాలేదు.
వివరాలు 6లో ▸



నీట్ లీకేజీ నిజమే గానీ..
నీట్-యూజీ లీకేజీ వాస్తవమేనని తేలిందని.. దాని ప్రభావం తీవ్రంగా ఉంటే రీ టెస్ట్ తప్పదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.
వివరాలు 6లో ▸



క్షిపణులతో విరుచుకుపడ్డ రష్యా
ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 31 మంది చనిపోగా 154 మంది గాయపడ్డారు.
వివరాలు 6లో ▸



ఆ సెలవులపై పాలసీ తెండి
రుతుస్రావ సెలవులపై మోడల్ పాలసీని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది.
వివరాలు 6లో ▸

నేడు, రేపు మోస్తరు వానలు



- బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో మంగళవారం, బుధవారం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు, ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

- వివరాలు 12లో

కొనసాగుతున్న టీడీపీ దాడులు

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై రాష్ట్రవ్యాప్తంగా దౌర్జన్యాలు
- వైఎస్సార్‌సీపీ వాణిజ్యవిభాగం అధ్యక్షుడిపై హత్యాయత్నం
- శ్రీకాకుళం జిల్లాలో సర్పంచ్ ఎలక్ట్రికల్ దుకాణం దహనం
- వైఎస్సార్ జిల్లాలో ఉపసర్పంచ్ ఇంటిపై రాళ్లదాడి
- ఆగిరిపల్లిలో షామియానా దుకాణంలో సామగ్రి ధ్వంసం

5 లో

'ఉచిత' నాటకం!

ఇసుక పేరుకే ఫ్రీ.. డబ్బులు సమర్పించుకోవాల్సిందే

- కూటమి సర్కారు తాత్కాలిక కొత్త విధానంలో ప్రత్యేకత ఇదీ
- పన్నుల మోత, రవాణా చార్జీలు, నిర్వహణ ఫీజులు తడిసిమోపెడు
- ఇసుక కమిటీలపై పెత్తనమంతా పచ్చ నేతలదే.. రవాణా ముసుగులో బయటకు తరలించి సొమ్ము చేసుకునే యత్నాలు
- దాదాపు 40 లక్షల టన్నులు గత 40 రోజుల్లో మాయం
- స్టాక్ పాయింట్ల వద్ద సగం నిల్వలను కొల్లగొట్టిన టీడీపీ నేతలు
- వర్షాకాలం అవసరాలకు ముందుగా నిల్వ చేసిన గత ప్రభుత్వం
- జగన్ హయాంలో ఏటా ఖజానాకు రూ.780 కోట్ల ఆదాయం
- ఇప్పుడు ఉచితమంటూ జనం నుంచే ముక్కుపిండి వసూలు
- ఉసూరుమంటూ ఖాళీగా తిరిగి వెళ్తున్న వినియోగదారులు
- వర్షాకాలం ముగిసిన తరువాతే తాపీగా కొత్త విధానం



విశాఖ జిల్లా ఆగనంపూడి వద్ద ఇసుక ఉచితం.. కానీ టన్ను ధర రూ.1,394 అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని టీడీపీ సర్కారు చెబుతున్న మాటలు మాయ నాటకాలని తేలిపోయింది! ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం నుంచి అమల్లోకి తెస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించినా స్టాక్ యార్డుల వద్ద మాత్రం ధరల పట్టికలు పెట్టడంతో వినియోగదారులు అవాక్కయ్యారు. కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన ఉచిత ఇసుక హామీకి స్టాక్ యార్డుల వద్ద పెట్టిన ధరల పట్టికలతో సీఎం చంద్రబాబు తూట్లు పొడిచారు. వర్షాకాలంలో కొరత లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే స్టాక్ పాయింట్లలో పెద్దఎత్తున ఇసుక నిల్వలు ఉంచింది. తాజాగా టీడీపీ సర్కారు

మిగతా 3వ పేజీలో ▶

30 కి.మీ. నుంచి వచ్చా..



ఇసుక ఉచితంగా ఇస్తున్నారని టీవీలు, పేపర్లలో చూసి పూనూరు నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణించి వేటపాలెం స్టాక్ పాయింట్ వద్దకు ట్రాక్టర్‌తో వచ్చా. ఇక్కడ సచివాలయ సిబ్బంది ఇసుక ట్రాక్టర్ రూ.3,038 అని చెబుతున్నారు. అదేమని అడిగితే ప్రభుత్వం అదే ధరకు విక్రయించాలని చెప్పిందంటున్నారు. చేసేది లేక ఖాళీ ట్రాక్టర్‌తో తిరిగి వెళ్తున్నాం.

– శ్రీనివాస్‌నాయక్, పూనూరు, బాపట్ల జిల్లా



ఇడుపులపాయలో దివంగత సీఎం డా. వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విజయమ్మ, భారతి తదితరులు

వైఎస్సార్‌కు ఘన నివాళి

ఇడుపులపాయలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు

కష్టాలు కొద్దికాలమే... దేవుడి దయతో ధైర్యంగా ఎదిరిద్దాం

75వ జయంతి వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా పోటెత్తిన అభిమానులు, కార్యకర్తలు

సాక్షి కడప: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయకు జనవాహిని పోటెత్తింది. రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన అభిమానులు వైఎస్సార్ ఘాట్ వద్ద ఘన నివాళులర్పించారు. ముందుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, మేనత్త వైఎస్ విమలమ్మ, చిన్నాన్న వైఎస్ సుధీకర్‌రెడ్డి, అత్తమ్మ ఈసీ సుగుణమ్మ, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలసి

మిగతా 2వ పేజీలో ▶

సంక్షేమం.. సాధికారత

ఏపీ అభివృద్ధిపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో సగటు వార్షిక ఆదాయ వృద్ధి 12 శాతం

- రెవెన్యూ రాబడిలో 11% సంక్షేమ పథకాలకు వ్యయం
- ఏటా 47 లక్షలమంది పిల్లలకు జగనన్న విద్యా కానుక
- అమ్మ ఒడితో తల్లుల ఖాతాల్లోకి ఏటా రూ.6,450 కోట్లు
- వైఎస్సార్ చేయూతతో మహిళలకు ఏటా రూ.5,060 కోట్లు
- పొదుపు మహిళలకు సున్నా వడ్డీ కింద రూ.4,969 కోట్లు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పౌరుల ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేసిందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ప్రశంసించింది. ఏపీతో పాటు మహారాష్ట్ర, కేరళ, కర్నాటక తమ ఆదాయ రాబడుల్లో సంక్షేమ పథకాల కోసం గణనీయంగా వ్యయం చేశాయని పేర్కొంది. త్వరలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో వివిధ రాష్ట్రాల ఆదాయ వనరులు, సంక్షేమ పథకాలకు చేసిన వ్యయాలపై రీసెర్చ్ నివేదికను ఎస్‌బీఐ సోమవారం విడుదల చేసింది. దేశం సంక్షేమ రాజ్యంగా మారుతున్నట్లు

మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి



కనీసం మధ్యమధ్యలోనైనా ఏపీకి వెళ్లొస్తుంటే బావుంటుందేమో సార్!!

టెట్ వాయిదా



- ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్‌లో ప్రభుత్వం మార్పులు
- 3వ తేదీ వరకు ఫీజు చెల్లింపు, దరఖాస్తు గడువు
- సెప్టెంబర్ 22 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్.. అక్టోబర్ 3 నుంచి 20 వరకు పరీక్షలు

12 లో

ఉగ్రదాడిలో అమరులైన ఐదుగురు జవాన్లు



- జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో భద్రతా బలగాలే లక్ష్యంగా మరోసారి ఉగ్రదాడి జరిగింది. ముష్కరులు పొంచి ఉండి జరిపిన దాడిలో ఐదుగురు ఆర్మీ జవాన్లు అమరులవ్వగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.

- వివరాలు 6లో



రష్యా రాజధాని మాస్కోలో భారత సంతతి ప్రజలతో కరచాలనం చేస్తున్న ప్రధాని మోదీ

మాస్కోలో ప్రధాని మోదీ

- నేడు పుతిన్‌తో ప్రధాని మోదీ విస్తృతస్థాయి చర్చలు
- 22వ ఇండో–రష్యా వార్షిక సదస్సుకు సిద్ధమైన అగ్రనేతలు

6 లో

'మ్యూల్' ముఠా మాటేస్తోంది జాగ్రత్త..

- మ్యూల్ సిమ్, బ్యాంకు అకౌంట్లతో అంతుచిక్కని సైబర్ నేరాలు
- పోలీసు దర్యాప్తునకు దొరక్కుండా సరికొత్త ఎత్తుగడ
- సామాన్యుల పేరుతో ఉండే సిమ్‌తో ఫోన్‌చేసి చోరీలు
- వారి పేరుతో ఉండే బ్యాంకు ఖాతాల్లోకే ఆ డబ్బు బదిలీ
- అమాయకులను కేసుల్లో ఇరికిస్తున్న ముఠా
- అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ పోలీసులు



విజయవాడ స్పోర్ట్స్: మీ పేరుతో ఎన్ని సిమ్‌కార్డులు వాడుకలో ఉన్నాయో వెంటనే తెలుసుకోండి.. ఎందుకంటే మ్యూల్ ముఠా మాటువేసింది. మీ ఆధార్, మీ వేలిముద్ర సాయంతోనే మీకు తెలియకుండానే ఈ ముఠా సిమ్‌కార్డులు తీసుకోవడంతో పాటు బ్యాంకుల్లో అకౌంట్లు తెరుస్తోంది. మీ పేరుతో తీసుకున్న సిమ్‌తో ఇతరులకు ఫోన్ చేసి సైబర్ నేరాలు చేస్తూ.. మోసంతో సంపాదించిన డబ్బును మీ పేరునే ఉన్న బ్యాంకు అకౌంట్లలోకి ఆ ముఠా సభ్యులు బదిలీ చేస్తున్నారు. సైబర్ మోసానికి బలైన వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పుడు.. మీ పేరుతో ఉన్న సిమ్‌తోనే ఫోన్ సంభాషణ జరిగినట్లు తెలుసుకున్న పోలీసులు ముందుగా మిమ్మల్నే అరెస్టుచేస్తారు. అంతేకాదు.. మీ పేరుతో ఉన్న మీ బ్యాంకు ఖాతాలన్నీ సీజ్ చేస్తారు. తాజాగా వెలుగుచూసిన ఈ తరహా కేసు కథాకమామీషు ఏమిటంటే..

రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.36లక్షలు స్వాహా..
విజయవాడ సూర్యారావుపేటకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు ఇటీవలే మోసంచేసి ఆయన నుంచి రూ.36 లక్షలు కాజేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడికి వచ్చిన ఫోన్ నెంబర్ అడ్రస్‌ను ట్రేస్ చేసుకుంటూ వెళ్తే ఓ గొర్రెల కాపరి చిక్కాడు. అతనికి, ఈ కేసుకు ఎలాంటి సంబంధంలేదని తెలుసుకుని మరింత లోతుగా దర్యాప్తు చేశారు. ఆ కాపరి ప్రస్తుతం ఓ నెంబర్ వాడుతున్నాడు. ఆ నెంబర్ తీసుకునేటప్పుడు ఆధార్, వేలిముద్రలు ఎక్కడ ఇచ్చాడో తెలుసుకున్నారు. సిమ్‌లు విక్రయించే వ్యక్తిని విచారించి మ్యూల్ ముఠా గుట్టును రట్టుచేశారు. ఇదే కేసులో సైబర్ నేరగాళ్లు మోసం చేసి సంపాదించిన నగదు ఏఏ బ్యాంకు ఖాతాలకు వెళ్లిందో తెలుసుకునేందుకు మరో టీం ప్రయత్నించింది. ఆ బ్యాంకు ఖాతా కలిగిన వ్యక్తిని వెతుక్కుంటూ పంజాబ్ వెళ్లారు. అక్కడ రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకునే వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. తన బ్యాంకు ఖాతాలో తనకు తెలియకుండానే రూ. కోటికి పైగా ఉన్నాయని పోలీసుల ద్వారా ఆ కూరగాయల వ్యాపారి తెలుసుకుని అవాక్కయ్యాడు.

ఎలా చేస్తారంటే..
నిజానికి.. మనం సిమ్ తీసుకోవాలంటే ఆధార్, వేలిముద్ర, ఫొటో తప్పనిసరి. ఈ ప్రాసెస్ పూర్తయిన తరువాత మన పేరున సిమ్ ఇస్తారు. మనం అక్కడ నుంచి బయటకు వచ్చిన వెంటనే మనం ఇచ్చిన ఆధారాలతోనే మన పేరునే మరో ఈ–సిమ్ (సిమ్‌కార్డు ఉండదు) తయారుచేస్తారు. దీనిని మ్యూల్ సిమ్ అంటారు. ఈ సిమ్‌ను సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులకు, సంఘ వ్యతిరేక శక్తులకు, దేశద్రోహులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. సిమ్‌లు విక్రయించే వ్యక్తి అతను తయారుచేసిన ఈ–సిమ్‌ను మధ్యవర్తులకు రూ.5 వేల చొప్పున.. ఈ మధ్యవర్తులు నేరగాళ్లకు రూ.15 వేల చొప్పున విక్రయిస్తున్నట్లు విజయవాడ పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ తరహా నేరాలు చేస్తున్న విశాఖపట్నానికి చెందిన ఏడుగురిని ఇటీవలే అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 998 సిమ్‌లను స్వాధీనం చేసుకుని వారు అక్రమంగా సంపాదించిన రూ.1.21 కోట్లను సీజ్‌చేశారు. కంబోడియా దేశం నుంచి సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులకు ఈ ముఠా మ్యూల్ సిమ్‌లను విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేరాల్లో చిక్కుకుంటున్న అమాయకులు..
ఇటీవల విస్తృతమైన లోన్‌యాప్స్, హనీట్రాప్, జాబ్‌ఫ్రాడ్, ఓఎల్ఎక్స్, ఆన్‌లైన్ లాటరీ, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ట్రేడింగ్ ఫ్రాడ్, బెట్టింగ్, వర్క్ ఫ్రం హోం తదితర సైబర్ నేరాలకు సామాన్యుల పేరుతో ఉండే సిమ్‌లు, బ్యాంకు ఖాతాలే కారణమవుతున్నాయి. అత్యంత ప్రమాదకరమైన నేరాలకు అమాయకులను బాధ్యులను చేస్తున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో నేరంతో సంబంధంలేని వ్యక్తులే ముందు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలీకుండా మోసపోయే వారు కొందరైతే.. అత్యాశకు పోయి అన్నీ తెలిసిన వారూ కొన్ని ఘటనల్లో మోసపోతున్నారు. సైబర్ నేరగాళ్లు ఇచ్చే డబ్బులకు ఆశపడి కొందరు స్వచ్ఛందంగా సిమ్ కార్డు తీసుకుని, బ్యాంకు ఖాతాలను తెరిచి.. వాటి పూర్తి యాక్సెస్‌ను సైబర్ నేరగాళ్లకు ఇచ్చేస్తున్న ఉదంతాలూ వెలుగుచూస్తున్నాయి. నిరుద్యోగులు, గృహిణులు ఈ తరహా కార్యకలాపాలు చేస్తూ చిక్కుల్లో పడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి, లేదంటే ఇబ్బందులే..

మీ పేరుతో ఉండే సిమ్‌కార్డు ఆధారంగా జరిగే నేరాలకు మీరే ముద్దాయిగా మారతారు. మీ ప్రమేయం లేకపోయినా ఇతర రాష్ట్రాల్లో నమోదైన కేసులకు మీరే హాజరుకావాల్సి ఉంటుంది. నేరగాళ్లు మీ పేరుతో ఉండే సిమ్‌తో దేశభద్రతకు సంబంధించి దేశద్రోహ చర్యలకు పాల్పడితే జరిగే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సైబర్ నేరాలపట్ల అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలి. షాపులో సిమ్ కొనుగోలు చేసిన తరువాత ఆ షాపులోకి వ్యక్తి, ఏజెంట్ ఏ ఇతర లావాదేవీలు చేయడంలేదని నిర్ధారించుకున్న తర్వాతే అక్కడి నుంచి బయటకు రావాలి. మీరు వాడే సిమ్‌కార్డులు కాకుండా.. మీ పేరున ఎక్కడైనా సిమ్‌లు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని తరచూ తనిఖీ చేసుకోవాలి. ఒకవేళ ఏదైనా సిమ్ ఉన్నట్లుగా గుర్తిస్తే తక్షణమే సైబర్ క్రైం పోలీసుల సహాయంతో సదరు సిమ్‌ను డీ–యాక్టివేట్ చేయాలి.

– శివాజీ, సీఐ, సైబర్ క్రైం, విజయవాడ

నాన్నా.. మీ పుట్టిన రోజు మా అందరికీ పండుగ రోజు

- కోట్లాది కుటుంబాలు మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయి
- తండ్రి వైఎస్సార్‌ను గుర్తుచేసుకుంటూ వైఎస్ జగన్ పోస్ట్

సాక్షి, అమరావతి: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఘన నివాళులర్పించారు. తన తండ్రి వైఎస్సార్‌ను గుర్తుచేసుకుంటూ వైఎస్ జగన్ సోమవారం ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. 'నాన్నా మీ 75వ పుట్టిన రోజు మా అందరికీ పండుగ రోజు. కోట్లాది కుటుంబాలు ఇవాళ మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మీ పుట్టిన రోజున సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్నారు. ప్రజా శ్రేయస్సు కోసం మీరు చూపిన మార్గం మాకు శిరోధార్యం. జీవితాంతం మీరు పాటించిన క్రమశిక్షణ, చేసిన కఠోర శ్రమ, రాజకీయాల్లో మీరు చూపిన ధైర్యసాహసాలు మాకు మార్గం. మీ ఆశయాల సాధనే లక్ష్యంగా, కోట్లాది కుటుంబాల క్షేమమే ధ్యేయంగా చివరివరకూ మా కృషి కొనసాగుతుంది' అంటూ వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

వైఎస్సార్ జయంతి వేడుకలపై ఆంక్షలు



వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీకి అడ్డుపెట్టిన పోలీసు బైక్

తిరుపతి సిటీ: వైఎస్సార్ జయంతి వేడుకలను అడ్డుకునేందుకు తిరుపతిలో పోలీసులు అడుగడుగునా ప్రయత్నించారు. ఎస్వీయూ ఎదుట రోడ్డు సమీపంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పోలీసులు తమ వాహనాలను అడ్డుపెట్టి తొలగించారు. వర్సిటీలో ఎక్కడా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని నిర్వహించవద్దని హెచ్చరించారు. 20 మంది పోలీసులు బీట్ వాహనాల్లో వర్సిటీలో సంచరిస్తూ అత్యుత్సాహం ప్రదర్శించారు. వైఎస్ మానసపుత్రికగా ముద్రపడిన ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల సైతం వేయకుండా బోధన, బోధనేతర సిబ్బందికి పోలీసులు ముందస్తు హెచ్చరికలు జారీచేశారు. 2005లో వైఎస్సార్ హయాంలో పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎస్వీ వెటర్నరీ వర్సిటీని ఏర్పాటు చేశారు. అటువంటి మహనీయుడికి నివాళి అర్పించకుండా అడ్డుకోవడం హేయమని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్ జగన్, వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి, కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు



వైఎస్సార్ ఘాట్ వద్ద భావోద్వేగానికి గురైన తల్లి విజయమ్మను ఓదారుస్తున్న వైఎస్ జగన్

వైఎస్సార్‌కు ఘన నివాళి



ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్దకు తరలివచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్



చిన్నారిని ప్రేమగా ఎత్తుకుని 'విజయశ్రీ' అని నామకరణం చేసిన వైఎస్ జగన్



యువకుడి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

ఇడుపులపాయలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. వైఎస్సార్ ఘాట్‌పై పూలమాలలు ఉంచి నివాళులర్పించిన వైఎస్ జగన్ కాసేపు అక్కడే మోకాళ్లపై కూర్చొని తండ్రిని స్మరించుకున్నారు. నివాళులర్పించే సమయంలో వైఎస్ విజయమ్మ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

ప్రత్యేక ప్రార్థనలు..

సమాధి ఘాట్ వద్ద వైఎస్ జగన్, వైఎస్సార్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రానున్న కాలంలో కొన్ని సమస్యలు ఎదురైనా రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో జగన్ ధైర్యంగా ఎదుర్కొనేలా దేవుడు ఆశీర్వదించాలని మేనత్త విమలమ్మ ప్రార్థన చేశారు. కష్టాలు తాత్కాలికమేనని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా దేవుడి మీద భారం వేసి ముందుకు వెళ్లడం ద్వారా ఎదిరించే శక్తిని ప్రసాదిస్తాడని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు వైఎస్సార్, వైఎస్ జగన్ చేసిన మంచిని ప్రస్తావించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన రమేష్, హేమ దంపతులు వైఎస్ జగన్‌ను కలిసి తమ మూడు నెలల చిన్నారికి పేరు పెట్టాలని కోరగా విజయశ్రీగా నామకరణం చేశారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు..

ఇడుపులపాయలోని ఘాట్ ప్రాంగణంలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్ జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కొద్దిసేపు అక్కడే నిలబడి వైఎస్సార్‌ను స్మరించుకున్నారు. వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతిరెడ్డి, విమలమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, అరకు, తిరుపతి ఎంపీలు తనూజారాణి, గురుమూర్తి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల పార్టీల అధ్యక్షులు కె.సురేష్‌బాబు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డాక్టర్ సుధ, టి.చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, గోవిందరెడ్డి, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ శారదాదేవి, పులివెందుల మాజీ మున్సిపల్ చైర్మన్ వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్ మధురెడ్డి సతీమణి వైఎస్ మాధవి, వైఎస్సార్‌సీపీ నాయకులు యువరాజ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పురుషోత్తమరెడ్డి కుమారుడు థామస్‌రెడ్డి, స్టాన్లీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అందరికీ అభివాదం.. అభిమానులతో సెల్ఫీ

ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి ఘాట్ ప్రాంగణానికి తరలి వచ్చిన జనవాహినికి వైఎస్ జగన్ అభివాదం చేశారు. వైఎస్సార్ అమర్‌రహే, వైఎస్ జగన్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో ఘాట్ ప్రాంగణం హోరెత్తింది. పలువురి వద్దకు స్వయంగా వెళ్లి పలుకరించిన వైఎస్ జగన్ అడిగిన వారందరితో సెల్ఫీ దిగారు. భారీగా వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. మూడు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని అనంతరం అక్కడి నుంచి ఉదయం 11.10 గంటలకు గన్నవరం చేరుకున్న వైఎస్ జగన్‌కు విమానాశ్రయంలో పలువురు పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, గౌడ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాదు శివరామకృష్ణ గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చారు. గొల్లపూడి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొమ్మ కోటేశ్వరరావు(కోట్లు), జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, నిడమానూరు సర్పంచి శీలం రంగారావు, పార్టీ నాయకులు దేవభక్తుని చక్రవర్తి, అశోక్, మేచినేని బాబు, కాట్రు శేషు, రామిశెట్టి వెంకటేశ్వరరావు, సమ్మెట సాంబశివరావు, నిడమర్తి రామారావు, పలువురు విజయవాడ కార్పొరేటర్లు, కార్యకర్తలు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. వారందరినీ ఆప్యాయంగా పలకరించిన వైఎస్ జగన్ రోడ్డు మార్గంలో తాడేపల్లికి బయలుదేరారు.

సంక్షేమాభివృద్ధి సారథి వైఎస్సార్

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మహానేత 75వ జయంత్యుత్సవం

- వివిధ రాష్ట్రాలు, దేశాల్లోనూ దివంగత సీఎంకు ఘన నివాళి
- పేదలకు వస్త్ర, అన్నదానం చేసిన అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమానంగా ముందుకు తీసుకెళ్తూ పరిపాలనలో సమానత్వాన్ని చాటుకుంటూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుని పాలకుడంటే ఎలా ఉండాలో చాటిచెప్పిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని ప్రజలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు కొనియాడారు. దివంగత వైఎస్ 75వ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఘనంగా నివాళులర్పించారు. 'జోహార్ వైఎస్సార్.. వైఎస్సార్ అమర్ రహే' అంటూ వాడవాడలా నినదించారు. ఈ సందర్భంగా మహానేత అందించిన పథకాలను ప్రజలు గుర్తుచేసుకున్నారు. గ్రామ గ్రామాన, వాడవాడలా కేక్‌లు కట్‌చేసి, పేదలకు వస్త్ర, అన్నదానం చేసి మహానేతపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. రాష్ట్రంలో 26 జిల్లాలు, 175 నియోజకవర్గాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పండుగలా నిర్వహించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ సహా వివిధ రాష్ట్రాల్లో మహానేతకు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు కేక్ కట్‌చేసి వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఇడుపులపాయలో..

ఇక ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ తన తండ్రికి ఘన నివాళులర్పించారు. ఆయనతోపాటు వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి, కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని మహానేతకు నివాళులర్పించారు. అలాగే, పామర్రు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలకు భారీ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విదేశాల్లోనూ ఘనంగా..

వివిధ దేశాల్లోనూ ప్రవాసాంధ్రులు వైఎస్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, యూకే, జర్మనీ, దక్షిణాఫ్రికా, సింగపూర్, మలేసియా, ఒమన్, యూఏఈ, సౌదీ అరేబియా తదితర దేశాల్లో ప్రవాసాంధ్రులు, భారతీయులు వైఎస్సార్ సేవలను గుర్తుచేసుకున్నారు. మెల్‌బోర్న్‌లో వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా కన్వీనర్ చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు.

తెలుగు ప్రజల గుండెల్లో వైఎస్సార్: డాక్టర్ ప్రదీప్ చింతా

తెలుగుజాతి ఉన్నంత వరకు తెలుగు ప్రజల హృదయాల్లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పదిలంగా ఉంటారని వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ చింతా తెలిపారు. పేదల దేవుడు వైఎస్సార్ అని, మనసున్న మారాజు వైఎస్సార్‌కు నీరాజనం పలుకుతున్నామన్నారు. ఇక యూకే టీం ఆధ్వర్యంలో నంద్యాలలోని పరివర్తన్ లైఫ్ సెంటర్‌లోనూ వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలకు మందులు, దుస్తులు, ఫ్రిజ్, మంచాలు, బెడ్స్ పంపిణీ చేసి అన్నదానం చేశారు. అలాగే, ఆయన కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లా ముద్దనూరులోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో కేక్ కట్‌చేసి దుప్పట్లు పంపిణీ చేశారు.



ప్రకాశం జిల్లా మార్కాపురంలోని స్ఫూర్తి వెల్ఫేర్ పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



కృష్ణా జిల్లా పామర్రులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్



వైఎస్సార్‌సీపీ యూకే టీం ఆధ్వర్యాన నంద్యాలలోని పరివర్తన్ లైఫ్ సెంటర్‌లో పిల్లలకు మంచాలు, ఫ్రిడ్జ్, విలువైన వస్తువులు అందజేస్తున్న ప్రతినిధులు



తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో రక్తదానం చేస్తున్న రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



విజయనగరం జిల్లా కుమిలిలో పేదలకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేస్తున్న నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకులు



ఆస్ట్రేలియాలో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న చింతల చెరువు సూర్యనారాయణరెడ్డి తదితరులు

ప్రజల పక్షాన పోరాటానికి ఎప్పుడూ సిద్ధమే

- లోటుపాట్లు సరిచేసుకుంటూ పార్టీ బలోపేతానికి అందరం పనిచేద్దాం
- వైఎస్సార్ ఆశయ సాధన కోసం వైఎస్ జగన్ ఎంతో కృషిచేస్తున్నారు
- హామీలు నెరవేర్చటం కష్టమని అప్పుడే చంద్రబాబు సన్నాయి నొక్కులు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా వైఎస్సార్ జయంతి

సాక్షి, అమరావతి: ప్రజల పక్షాన పోరాటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టంచేశారు. సమకాలీన చరిత్రను మనం ప్రత్యక్షంగా చూశామని, ఆ సంక్షోభం, ప్రజల కష్టాల్లో నుంచి పుట్టిందే వైఎస్సార్‌సీపీ అని గుర్తుచేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద సోమవారం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. వైఎస్సార్ రక్తం పంచుకున్న బిడ్డగానే కాకుండా ఆయన ఆశయాలకు వారసుడిగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాటాల మధ్యనే ఈ పార్టీని ప్రారంభించారని గుర్తుచేశారు. ఆ రోజు నుంచి కోట్ల మందికి జగన్ ఆశాదీపం అయ్యారన్నారు. వైఎస్సార్‌కి మించి అడుగులు ముందుకు వేసే బిడ్డగా జగన్ ఈ రాష్ట్రానికి 30 ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధిని తన ఐదేళ్ల పాలనా కాలంలో అందరూ గర్వపడేలా చేసి చూపించారన్నారు. వైఎస్సార్ ఆశయ సాధన కోసం జగన్ ఎంతో కృషిచేస్తున్నారన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే...

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు..

రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేశాం. ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం. అసాధ్యమైన హామీలతో ప్రత్యర్థులు అందలమెక్కారు. హామీలిచ్చి మోసం చేయటం, ప్రజలను భ్రమల్లో ఉంచటం వైఎస్ జగన్‌కి చేతకాదు. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలతో పనిలేకుండా ఆయన పాలించారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ఇళ్ల ముంగిటకే ఆయన పరిపాలన అందించారు. ప్రజల్లో మమేకమైన పార్టీగా మన ప్రయాణం అనంతం. అది ఆగిపోదు. ఎన్నికల ఫలితాలపై అనుమానాలున్నా లోతుకుపోవటం సరైంది కాదు.

మరోసారి మోసానికి బాబు శ్రీకారం..

ఇక అధికారంలోకి వచ్చి నెల దాటిందో లేదో ఇచ్చిన హామీలు ఇప్పట్లో నెరవేర్చటం కష్టమని అప్పుడే చంద్రబాబు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా ప్రజల్ని మోసం చేసి ఎన్నికల్లో గెలిచేందుకు ఆయన అలవిగాని హామీలిచ్చారు. ఆసాధ్యమైన హామీలిచ్చి 2014లో ప్రజలను ఎలా మోసం చేశారో ఇప్పుడు ఆదే రీతిలో మరోసారి మోసానికి బాబు శ్రీకారం చుట్టారు. ఖజానా ఇంత ఖాళీ అయి ఉంటుంది అనుకోలేదని అప్పుడే చంద్రబాబు అంటున్నారు. ఖజానా బాగాలేదు కాబట్టి హామీలు నెరవేర్చటం కష్టమని ఆయన చెప్పకనే చెబుతున్నారు. ఇది అత్యంత మోసం, దగా.

రాష్ట్రం రావణకాష్టం..

అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి రాష్ట్రంలో ఎలా ఆరాచకం సృష్టిస్తున్నారో చూస్తున్నాం. రాష్ట్రాన్ని ఎలా రావణకాష్టం చేస్తున్నారో, ఎలా దాడులు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు. సామాన్యులు తిరగలేని పరిస్థితి తీసుకొచ్చారు. ఐదేళ్లలో రూపుదిద్దుకున్న ఆరోగ్య, విద్యా వ్యవస్థలకు గండికొట్టడం ప్రారంభమైంది. వైద్యంలో స్పెషలిస్టు సేవలను నిర్వీర్యం చేస్తున్నారు. రాష్ట్రాన్ని మళ్లీ పదేళ్లు వెనక్కి తీసుకెళ్లేలా చంద్రబాబు చేస్తున్నారు. మన లోటుపాట్లు సరిదిద్దుకుని ముందుకెళ్దాం. మళ్లీ రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొద్దాం. బాబు తన గొయ్యి తానే తవ్వుకుంటున్నారు. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లకుండా, ప్రజల దృష్టి మళ్లించేందుకు జగన్‌పైన, వైఎస్సార్‌సీపీపైన కూటమి నేతలు దాడిచేస్తున్నారు. తాను అమలుచేయాల్సిన హామీల నుంచి తప్పించుకోవాలని బాబు చూస్తున్నారు. అది జరగకుండా.. మనం ఎక్కడా డీలాపడకుండా కలిసికట్టుగా అడుగులు వేయాలి. ప్రజల పక్షాన నిలబడే పార్టీగా మనమంతా పునరంకితం అవుదామని శపథం చేద్దాం. ఇందుకు ఇంతకంటే మంచి రోజు, వైఎస్సార్ జయంతిని మించిన రోజులేదు. అనంతరం.. మాజీమంత్రి అంబటి రాంబాబు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో.. మాజీమంత్రి జోగి రమేష్, నాయకులు పుత్తా ప్రతాప్‌రెడ్డి, అంబటి మురళీ, మలసాని మనోహర్‌రెడ్డి, చిల్లపల్లి మోహనరావు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చల్లా మధు, కొమ్మూరి కనకారావు, ఎ.నారాయణమూర్తి, బందెల కిరణ్‌రాజ్, న్యాయవాది కొమ్మసాని శ్రీనివాస్‌రెడ్డి, మహిళా నేతలు నారమల్లి పద్మ, రజనీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'అపర భగీరథుడు వైఎస్సార్' పుస్తకాన్ని సజ్జల ఆవిష్కరించారు.



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబు తదతరులు

పార్టీ కార్యాలయంలో సేవా కార్యక్రమాలు..

ఇదిలా ఉంటే.. వైఎస్ జయంతి సందర్భంగా పుత్తా ప్రతాప్‌రెడ్డి ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను సజ్జల రామకృష్ణారెడ్డి కట్ చేశారు. పేదలకు వస్త్ర, అన్నదానం నిర్వహించారు. వికలాంగులకు, వృద్ధులకు చేతి కర్రలను పంపిణీ చేశారు. తొలుత.. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అందరూ ఘనంగా నివాళులర్పించారు.

క్లుప్తంగా...

ఆకులతో చేసిన దొన్నెల్లో ప్రసాదాలు

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వెల్లడి



సాక్షి, అమరావతి: పర్యావరణహితమైన వస్తువులనే పండుగల్లో, ఉత్సవాల్లో ఉపయోగించాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సూచించారు. ఆలయాల్లో ప్రసాదాలకు దొన్నెలు ఉపయోగించనున్నట్లు చెప్పారు. మంగళగిరిలోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో పవన్ మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకల్లో మట్టి గణపతి ప్రతిమలను పూజిస్తే పర్యావరణానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. అలాగే ఆలయాల్లో ప్రసాదాలను కవర్లలో కాకుండా చిన్నపాటి తాటాకు బుట్టలు, ఆకులతో చేసిన దొన్నెల్లో పంపిణీ చేస్తే.. వ్యర్థాల నిర్వహణ కూడా సులభమన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న ఆలయాల్లో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

అగ్నిమాపక శాఖ ఆధునికీకరణ

హోం మంత్రి వంగలపూడి అనిత



సాక్షి, అమరావతి: అగ్నిమాపక శాఖ ఆధునికీకరణకు ప్రణాళిక రూపొందించాలని హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ అధికారులతో వెలగపూడిలోని సచివాలయంలో ఆమె సోమవారం సమీక్ష నిర్వహించారు. మంత్రి అనిత మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగిస్తూ అగ్నిమాపక శాఖను ఆధునికీకరించాలన్నారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా, అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జ్ అదనపు డీజీ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు.

దేశమంతా చూసేలా పనిచేస్తా

మంత్రి నారా లోకేశ్



విద్యార్థికి ల్యాప్‌ట్యాప్ అందిస్తున్న లోకేశ్

సాక్షి, అమరావతి: దేశమంతా ఏపీ వైపు చూసేలా పనిచేస్తానని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ ఎకానమీగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు కల్పించడం ద్వారా పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యలో సంస్కరణలు తీసుకొస్తామన్నారు. జాతీయస్థాయి విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన 25 మంది దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సోమవారం ఉండవల్లిలోని లోకేశ్ నివాసానికి వచ్చి కలిశారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్లు సాధించినా సబ్జెక్టు మినహాయింపుతో సీట్లు కోల్పోయే పరిస్థితిలో ప్రభుత్వం ఇచ్చిన జీవో తమకు మేలు చేసిందని విద్యార్థులు లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లను బహూకరించారు. బటన్ నొక్కితే దివ్యాంగుల సర్టిఫికెట్లు నేరుగా వచ్చేలా ఆరు నెలల్లో చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి సమయానికి అందిస్తామన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలు చెల్లించండి

రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కె.ప్రకాష్‌రావు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. అలాగే, గతేడాది డిసెంబర్‌లో 22 రోజులు సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష సిబ్బందికి సమ్మె కాల వేతనాన్ని చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పట్టిసీమతో కృష్ణా డెల్టా సస్యశ్యామలం

మంత్రి నిమ్మల రామానాయుడు



గోదావరి, కృష్ణా జలాలకు పుష్పాభిషేకం చేస్తున్న మంత్రి రామానాయుడు

ఇబ్రహీంపట్నం: పట్టిసీమ ప్రాజెక్టు వల్ల కృష్ణా డెల్టా సస్యశ్యామలం అవుతుందని.. తాగునీరు సమృద్ధిగా లభిస్తుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద కృష్ణా నదిలో కలుస్తున్న గోదావరి జలాలకు ఎంపీ కేశినేని చిన్నితో కలసి మంత్రి పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని ఒడిసిపట్టి కృష్ణా డెల్టాకు మళ్లించడం పట్టిసీమ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. పట్టిసీమలోని 24 పంపుల్లో ప్రస్తుతం 17 పంపుల ద్వారా 6,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. ఆలమట్టి, జూరాల, శ్రీశైలం, సాగర్ నుంచి కృష్ణా డెల్టాకు నీరు చేరడానికి ఆగస్టు దాటే అవకాశముంది. ఈలోపు పట్టిసీమ ద్వారా డెల్టా ప్రాంతానికి సాగు, తాగునీరు అందించవచ్చు' అని చెప్పారు. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పవిత్ర సంగమం వద్ద హారతి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమా, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఈఎన్సీ సి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

'ఉచిత' నాటకం!

కూటమి సర్కారు తాత్కాలిక కొత్త ఇసుక విధానంలో ప్రత్యేకత ఇదీ

▶ మొదటి పేజీ తరువాయి



వేటపాలెం స్టాక్ పాయింట్‌లో గత ప్రభుత్వ నిల్వ ఉంచిన ఇసుక

దీన్ని ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పినా అన్నిచోట్లా టన్నుకి నిర్దేశిత ధర చెల్లించాలని తేల్చి చెప్పడంతో ఇసుక కోసం వచ్చిన వారు కంగు తిన్నారు. చీరాల సమీపంలోని వేటపాలెం స్టాక్‌యార్డులో టన్ను ఇసుక రూ.675గా బోర్డు పెట్టారు. దీంతో ఉచితంగా ఇసుక తీసుకెళదామని ట్రాక్టర్లతో వచ్చిన పలువురు మోసపోయామని గ్రహించి వెనుతిరిగారు. అన్ని స్టాక్ యార్డుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలకు ఎలాంటి మేలు చేయని.. ఖజానాకు ఆదాయం సమకూరని తాత్కాలిక కొత్త విధానాన్ని కూటమి ప్రభుత్వం తెచ్చింది. దీనిల్ల అటు ప్రజలు, ఇటు ఖజానాకు నష్టం వాటిల్లుతుండగా టీడీపీ నేతలు మాత్రం జేబులు నింపుకునేందుకు మార్గం సుగమం అయింది. పేరుకు ఉచిత ఇసుక అని ప్రకటించినా ప్రజలు మాత్రం డబ్బులు కట్టాల్సిందే. ఇదే ఉచిత ఇసుక విధానంలోని ప్రత్యేకత. ఉచిత ఇసుక విధానం పేరుతో గనుల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ సోమవారం జీవో ఎంఎస్ నెంబర్ 43 జారీ చేశారు. గత సర్కారు హయాంలో అమలైన విధానం స్థానంలో తాత్కాలికంగా ఉచిత విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ఇసుక విక్రయాల ద్వారా ఏటా ప్రభుత్వ ఖజానాకు రూ.780 కోట్ల ఆదాయం సమకూరగా ప్రజలకు సులభంగా, అందుబాటు ధరలో లభ్యమయ్యేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఖజానాకు ఒక్క రూపాయి ఆదాయం రాదు. మరోవైపు ప్రజలు డబ్బులిచ్చి మరీ ఉచిత ఇసుకను కొనుగోలు చేయాల్సిన ఆగత్యం దాపురించింది!

ఇదీ కొత్త విధానం..

జిల్లా స్థాయిలో కమిటీలు ఆయా రీచ్‌ల్లో ఇసుక ధరలను నిర్ణయిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఎస్పీ, జేసీ, ఆర్డీఓ తదితర అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే ఏర్పాటైన ఇసుక కమిటీలు తమ పరిధిలోని ఇసుక స్టాక్ యార్డులను స్వాధీనంలోకి తీసుకుని ధరలు నిర్ణయించాయి. సీనరేజి ఫీజు, ఇతర పన్నులు, తవ్వకం, లోడింగ్, రవాణా, ర్యాంపు నిర్వహణ, పరిపాలనాపరమైన ఖర్చులన్నీ లెక్కించి టన్ను ఇసుక ధరను నిర్ణయించారు. యార్డులకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లేదా వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను ఇన్‌ఛార్జీలుగా నియమించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వినియోగదారులు స్టాక్ పాయింట్ల వద్ద నేరుగా ఇసుక కొనుగోలు చేయవచ్చని, తరలించేందుకు వారే లారీలు తెచ్చుకోవాలని సూచించారు. స్టాక్ పాయింట్లలో నగదు లావాదేవీలు కాకుండా డిజిటల్‌గా మాత్రమే డబ్బులు స్వీకరించే ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. త్వరలో ఇసుక కొనుగోలుకు సంబంధించి ఆన్‌లైన్‌లో పర్మిట్లు జారీ చేసే విధానం రూపొందిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఇసుక ఆపరేషన్స్ పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర స్థాయిలో మైనింగ్ డైరెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహిస్తామని తెలిపారు. ఒక వ్యక్తి ఒక రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే కొనుగోలు చేసేందుకు అవకాశం ఇస్తామన్నారు.

సగం 'స్టాక్' స్వాహా

అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఇసుక స్టాక్ పాయింట్లను తమ ఆధీనంలోకి తెచ్చుకున్న టీడీపీ నేతలు ఇష్టానుసారం విక్రయించేశారు. వర్షాకాలంలో కొరత లేకుండా 80 లక్షల టన్నుల వరకూ ఇసుకను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిల్వ ఉంచింది. గత నెల 4వ తేదీ నుంచి అధికారం అండతో టీడీపీ నేతలు ఇసుక యార్డులను దౌర్జన్యంగా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఇసుక కాంట్రాక్టు సంస్థలైన జేసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా ప్రతినిధులను బెదిరించి తరిమేశారు. ఇప్పటికే చాలా వరకూ ఇసుకను అమ్మేశారు. సుమారు 40 లక్షల టన్నుల ఇసుకను విక్రయించేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 40 లక్షల టన్నుల ఇసుక మాత్రమే స్టాక్ యార్డుల్లో ఉందని గనుల శాఖ చెబుతోంది. అంటే మిగిలిన 40 లక్షల టన్నుల ఇసుకను టీడీపీ నేతలు నెలరోజుల్లోనే మింగేసినట్లు స్పష్టమవుతోంది.

ఉసూరుమంటూ..

ఉచితంగా ఇసుక దొరుకుతుందని భావించిన నిర్మాణదారులు ఉదయాన్నే ట్రాక్టర్లలో స్టాక్ పాయింట్ల వద్దకు వచ్చి బారులు తీరారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల బోర్డులు చూసి విస్తుపోయారు. ఉచితంగా ఇసుక అందిస్తామని ఊరించి టన్నుల లెక్కన డబ్బులు కట్టాలని బోర్డులు ఏర్పాటు చేయటాన్ని చూసి ఉసూరుమంటూ వెళ్లిపోయారు. కొత్త ఇసుక విధానంలో బాపట్ల జిల్లా చీరాలలో ట్రాక్టర్ ట్రక్కు ఇసుక కొనుగోలు చేయాలంటే రూ.3,034 అవుతుంది. ఒక్కో ట్రాక్టర్‌లో 4.50 టన్నులు లోడింగ్ చేయవచ్చు. దీనికి రవాణా ఛార్జీలు మరో రూ.వెయ్యి చెల్లించాల్సి వస్తుంది. మొత్తంగా ట్రక్కు ఇసుక రూ.4 వేలు సమర్పించుకుని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

తిరిగి వెళ్లిపోతున్న వినియోగదారులు..



స్టాక్ పాయింట్ వద్ద బోర్డు, విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

స్టాక్ పాయింట్ల వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్లెక్సీతో రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా ఇసుక అని పేర్కొంటూ షరతులు వర్తిస్తాయి అనే మాదిరిగా టన్ను ఇసుక రూ.675 అని బోర్డులు పెట్టారు. అక్కడకు వచ్చిన వారంతా బోర్డులు చూసి ఈ ధరలకు కొనలేమని తిరిగి వెళ్లిపోతున్నారు. వేటపాలెం స్టాక్ పాయింట్‌కి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 20 ట్రాక్టర్లు రాగా అన్నీ ఖాళీగా తిరిగి వెళ్లిపోయాయి. ఒక్కరూ కూడా ఇసుక కొనుగోలు చేసిన దాఖలాలు లేవు.

రవాణా ముసుగులో దోపిడీకి స్కెచ్!

ఇసుకపై కొత్త విధానంలో ఉచితం అనేది ఒక మాయ కాగా రవాణా అనేది మరో సరికొత్త దోపిడీకి స్కెచ్‌గా కనిపిస్తోంది. రవాణా ముసుగులో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇసుకను తామే రవాణా చేస్తామనడం వెనుక ఉద్దేశం అదేనని భావిస్తున్నారు. వర్షాకాలంలో ఇసుక కొరతను అధిగమించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన ఇసుకను అధికారం మారగానే కూటమి సర్కారు మాయం చేసింది. దాదాపు 40 లక్షల టన్నుల ఇసుకను గత 40 రోజుల్లో లెక్కాపత్రం లేకుండా ఎక్కడికక్కడ టీడీపీ నేతలు అమ్మేసుకున్నారు. అదే తరహాలో రవాణా పేరుతో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కొత్త విధానానికి రూపకల్పన చేశారు. పేరుకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని ఇసుక కమిటీలు అమ్మకాలను పర్యవేక్షిస్తాయని చెబుతున్నా స్థానిక టీడీపీ నేతలే ఇసుక వ్యవహారాలను నియంత్రించే పరిస్థితి నెలకొంది. తొలిరోజే రాష్ట్రవ్యాప్తంగా రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు హల్‌చల్ చేయడమే ఇందుకు ఉదాహరణ. ఉచితంగా ఇసుకను అందిస్తున్నామంటూ బ్యానర్లతో స్టాక్ పాయింట్లు వద్ద ర్యాలీలు నిర్వహిస్తూ హడావుడి చేశారు. దీన్నిబట్టి స్టాక్ యార్డులు ఎవరి చేతుల్లో ఉన్నాయో అర్థమవుతోంది. ఇప్పటివరకు జిల్లా ఇసుక కమిటీలు స్టాక్ పాయింట్ల వద్ద పూర్తిస్థాయిలో ఇన్‌చార్జీలను కూడా నియమించలేదు. యార్డుల్లో ఎంత ఇసుక ఉందో కచ్చితమైన సమాచారం అధికారుల వద్ద లేదు. వర్షాకాలం సీజన్ వరకు ఉచిత ఇసుక పేరుతో దోపిడీని కొనసాగించి ఆ తర్వాత పూర్తిస్థాయి విధానాన్ని తెచ్చే యోచనలో సర్కారు ఉన్నట్లు స్పష్టమవుతోంది.

మోసపోయాం..



టీవీలు, పేపర్లలో ఇసుక ఉచితంగా అందిస్తామని, కేవలం రూ.88కే అని ప్రకటించారు. ఇసుక అమ్మకాలు ప్రారంభించారని స్టాక్ పాయింట్‌కి వచ్చాం. ఇక్కడ బోర్డు పెట్టి టన్ను రూ.575, ట్రాక్టర్ ఇసుక రూ. 3,038 అని చెప్పారు. మోసపోయామని గ్రహించి కొనుగోలు చేయకుండా తిరిగి వెళ్లిపోయాం.

– నాగార్జున, వేటపాలెం

గబ్బాడ యార్డులో రూ.5 కోట్ల ఇసుక మాయం

- గెలిచిన వెంటనే ఇసుక యార్డులను హస్తగతం చేసుకున్న టీడీపీ నేతలు
- దోపిడీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు పాల్పడిన ఇసుక దోపిడీపై విచారణ చేపట్టి, దోపిడీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో భారీఎత్తున ఇసుక దోపిడీ జరిగిందని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలకు ముందు నర్సీపట్నం గబ్బాడ యార్డులో లక్ష టన్నుల ఇసుక ఉండేదన్నారు. ఫలితాలు వెలువడిన మరుసటి రోజే టీడీపీ నాయకులు యార్డును స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. లక్ష టన్నులు ఉండాల్సిన ఇసుక ప్రస్తుతం 48 వేల టన్నులే ఉందని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యార్డులోని రూ.5 కోట్లు విలువ చేసే ఇసుకను వాహనాల్లో తరలించి టీడీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారని మండిపడ్డారు. యార్డులోని 60 వేల టన్నుల ఇసుకను మాయం చేశారన్నారు. గబ్బాడ ఇసుక దోపిడీపై అధికారులు సమగ్రమైన విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయని చెప్పారు. ఉచిత ఇసుక పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను నయవంచనకు గురిచేసిందని గణేష్ దుయ్యబట్టారు. ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా తరలింపు



విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని స్టాక్‌యార్డ్ నుంచి అక్రమంగా తరలిపోతున్న ఇసుక

కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి విజయనగరం జిల్లాలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే టీడీపీ నేతలు ఇసుక స్టాక్ యార్డుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ముచేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం యార్డులో ఇసుక నిల్వల లెక్కలకు, గతంలో కాంట్రాక్టర్ నిల్వ చేసిన ఇసుకకు పొంతనలేకపోవడం దీనికి బలం చేకూర్చుతోంది. విజయనగరం జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో డెంకాడ మండలం పెదతాడివాడ, బొబ్బిలి గ్రోత్ సెంటర్, కొత్తవలస వద్ద ఇసుక స్టాక్ యార్డులను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ నుంచి ప్రభుత్వ ధరలకు ఇసుకను సరఫరా చేసేది. బొబ్బిలిలో లక్షా14వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉండగా, ఇప్పుడు అధికారుల లెక్కల ప్రకారం 72,466 మెట్రిక్ టన్నులు ఉన్నట్టు తేలింది. కొత్తవలసలో 11,805 మెట్రిక్ టన్నులు, డెంకాడలో 9,756 మెట్రిక్ టన్నులు ఉన్నట్టు అధికారులు చెబుతున్నా... ఇక్కడ నుంచి కూడా పెద్ద ఎత్తున ఇసుకను టీడీపీ నాయకులు అక్రమంగా తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి.

వందలాది వాహనాలతో..



మర్రిపాడు డంపింగ్ యార్డు నుంచి టిప్పర్లతో ఇసుక తరలింపు

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ముందు నాటికి ఎనిమిది చోట్ల ఇసుక డంపింగ్ యార్డులు ఉన్నాయి. ఒక్కొక్క డంపింగ్ యార్డులో 5 లక్షల నుంచి 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నట్లు అప్పటి యార్డుల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధానంగా మర్రిపాడు యార్డులో 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉండగా ఎన్నికల కౌంటింగ్ అయిన రాత్రి నుంచి టీడీపీ నేతలు వందలాది వాహనాలతో ఇసుకను ఖాళీ చేశారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులపాడుకు చెందిన ఓ వ్యక్తి (ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనాయణరెడ్డి అనుచరుడు) ఇసుక డంప్‌ను రూ.2 కోట్లకు కొనేసి.. చెన్నై, బెంగళూరు తదితర మహా నగరాలకు తరలించడం బహిరంగ విషయమే. నెల్లూరు జిల్లాలోని పొట్టేపాళెంలో డంపింగ్ యార్డులో 8 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు పూర్తిగా ఖాళీ చేశారు. అయితే తాజాగా జిల్లా అధికారులు ప్రకటించిన విధంగా జిల్లాలోని మూడు స్టాక్ యార్డుల్లో ప్రస్తుతం 1,75,301 మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే అందుబాటులో ఉందని చెప్పారు. మర్రిపాడు యార్డులో 1,25,211 మెట్రిక్ టన్నులు, మినగల్లులో 41,885 మెట్రిక్ టన్నులు, పల్లిపాడులో 8,205 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. కావలి, కందుకూరు, ఉదయగిరి, నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాలకు సంబంధించిన యార్డుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే నాటికి తవ్వి నిల్వ చేసిన ఇసుకను అధికారులు ప్రకటించకపోవడం గమనార్హం.

పెద్దిరెడ్డి భూమిలో నిర్మాణాలపై కఠిన చర్యలు వద్దు

- అధికారులను ఆదేశించిన హైకోర్టు
- విచారణ రేపటికి వాయిదా

సాక్షి, అమరావతి: తిరుపతి ఎంఆర్ పల్లి వార్డు నంబరు 23లో వివిధ సర్వే నంబర్లలో ఉన్న 4.82 ఎకరాల భూమితోపాటు, అందులో నిర్మాణాల విషయంలో జోక్యం చేసుకోకుండా అధికారులను నియంత్రించాలని కోరుతూ పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలత మరికొందరు కుటుంబసభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. అత్యవసరంగా లంచ్ మోషన్ రూపంలో దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై సోమవారం జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ల భూమిలో ఉన్న రోడ్డు, గేటు, ఇతర నిర్మాణాల విషయంలో కఠిన చర్యలేవీ తీసుకోవద్దని అధికారులను ఆదేశించారు. విచారణను రేపటికి (బుధవారానికి) వాయిదా వేశారు. అంతకుముందు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి, న్యాయవాది వర్ధిసీడి సాయికిరణ్ వాదనలు వినిపిస్తూ.. తమ భూములు ప్రైవేటు భూములని, వాటిని ఇతరుల నుంచి కొనుగోలు చేశామని చెప్పారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో భద్రత కారణాలరీత్యా ఆ భూముల్లోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా మున్సిపల్ అధికారులు వారి స్వీయ ఖర్చులతో రోడ్డు వేశారని తెలిపారు. ఆ రోడ్డుకు అయిన ఖర్చును చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులకు లిఖిత పూర్వకంగా కూడా తెలిపామన్నారు. తాము నిర్మించుకున్న గేటును తొలగించి ఇతరులు వచ్చేందుకు వీలుగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తమ రోడ్డులో ఇతరులు రాకపోకలు సాగించడం వల్ల పిటిషనర్లకు ప్రాణహాని కలిగే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. ఈ వ్యాజ్యం మొదటిసారి విచారణకు వస్తోందని, పూర్తి వివరాలను కోర్టు ముందుంచేందుకు కొంతగడువు కావాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ పిటిషనర్ల స్థలంలో గేటు, ఇతర నిర్మాణాల విషయంలో కఠిన చర్యలేవీ తీసుకోవద్దని అధికారులను ఆదేశించారు.

కొడాలి నానికి 41ఏ నోటీసులు ఇవ్వండి

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: మాజీ మంత్రి కొడాలి నానికి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ ప్రకారం నోటీసులిచ్చి చట్ట ప్రకారం నడుచుకోవాలని హైకోర్టు సోమవారం గుడివాడ పోలీసులను ఆదేశించింది. ఆర్నేష్ కుమార్‌సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలంది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ ప్రతివాదులకు నోటీసులిచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు తమ చేత కొడాలి నాని బలవంతంగా రాజీనామాలు చేయించారంటూ పలువురు వలంటీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా గుడివాడ పోలీసులు నానిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఈ కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ కృపాసాగర్ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జి.రామకృష్ణ వాదనలు వినిపిస్తూ కొడాలి నానిపై నమోదైన కేసు ఏడేళ్ల లోపు శిక్ష పడేదన్నారు. ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం 41ఏ నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి.. పిటిషనర్ నానికి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసు ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు. విచారణను వాయిదా వేశారు.

జనసేన ఎమ్మెల్సీగా హరిప్రసాద్

రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణపత్రం స్వీకరణ



సాక్షి, అమరావతి: ఎమ్మెల్యేల కోటాలో జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పి.హరిప్రసాద్ సోమవారం అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణపత్రాన్ని స్వీకరించారు. అనంతరం హరిప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ 'ఎమ్మెల్సీగా ఎన్నికవడం సంతోషంగా ఉంది. నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన, టీడీపీ నాయకులకు ధన్యవాదాలు' అన్నారు.

సచివాలయ వ్యవస్థపై అధ్యయనం చేస్తాం

మంత్రి బాలవీరాంజనేయస్వామి

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నూతన విధివిధానాలు రూపొందిస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వెల్లడించారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. వృద్ధులు విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ ప్రతినిధులు, రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయం అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు.

పెద్దిరెడ్డికి భద్రత కల్పించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ప్రాణహాని నేపథ్యంలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి 2+2 భద్రత కల్పించాలని హైకోర్టు సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ఉత్తర్వులు జారీచేశారు. మంత్రిగా ఉన్నప్పుడు తనకు 5+5 భద్రత ఉండేదని, ఇప్పుడు 2+2 భద్రత సిబ్బందిని కూడా పంపడం లేదని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ పెద్దిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై జస్టిస్ చక్రవర్తి సోమవారం మరోసారి విచారించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి న్యాయవాది గుడిసేవ నరసింహారావు వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా గతంలో ఉన్న భద్రతను 1+1కు కుదిరించారని తెలిపారు. పిటిషనర్‌కు ఉన్న ప్రాణహానిని పరిగణనలోకి తీసుకోలేదన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు ఉన్న 5+5 భద్రతను కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పెద్దిరెడ్డికి ఎలాంటి ప్రాణహాని లేదని చెప్పారు. ఎస్పీ నివేదికలో సైతం ఇదే విషయాన్ని చెప్పారని తెలిపారు. ఎమ్మెల్యేగా ఆయన 1+1 భద్రతకు మాత్రమే అర్హుడని, అందువల్ల అదే భద్రతను ఇస్తున్నామని చెప్పారు. భద్రత కోసం పెద్దిరెడ్డి పెట్టుకున్న దరఖాస్తు భద్రత రివ్యూ కమిటీ (ఎస్ఆర్‌సీ) ముందు పెండింగ్‌లో ఉందన్నారు. ఎస్ఆర్‌సీ నిర్ణయం లేకుండా అదనపు భద్రతకు ఆదేశాలు ఇవ్వరాదని చెప్పారు. అలా చేస్తే మరింతమంది ఇదేరీతిలో అదనపు భద్రత కోసం పిటిషన్లు దాఖలు చేస్తారని తెలిపారు.

ప్రాణహాని నేపథ్యంలో ప్రత్యేక కేసుగా పరిగణిస్తున్నాం

ఈ సమయంలో జస్టిస్ చక్రవర్తి స్పందిస్తూ.. ప్రాణహాని నేపథ్యంలో దీన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా రాజ్యాంగబద్ధమైన పోస్టులో పెద్దిరెడ్డి కొనసాగుతున్నారని గుర్తుచేశారు. అందువల్ల మూడువారాల పాటు ఆయనకు 2+2 భద్రత కల్పించాలని ఆదేశించారు. ఈ సమయంలో దమ్మాలపాటి స్పందిస్తూ.. ఎస్ఆర్‌సీ నివేదిక వచ్చేవరకు ఈ భద్రతను కల్పిస్తామని చెప్పారు. అలా అయితే మూడువారాలు లేదా ఎస్ఆర్‌సీ నివేదిక వచ్చే వరకు 2+2 భద్రత కల్పించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. విచారణను రెండువారాలకు వాయిదా వేశారు. అనంతరం 4+4 భద్రతను కొనసాగించాలంటూ ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యం కూడా విచారణకు వచ్చింది. ఏజీ దమ్మాలపాటి స్పందిస్తూ.. ఎంపీగా ఆయన 2+2కి అర్హుడని, ఆయనకు అదే కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను రెండువారాలకు వాయిదా వేశారు.

వికసిత్, ఆత్మనిర్భర్ భారత్‌లకు ప్రజల పట్టం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పురందేశ్వరి

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక ఎన్నికల్లో వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్‌లకు ప్రజలు పట్టం కట్టారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్లో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ పాలనలో ప్రపంచంలోనే ఐదో ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగిందని, అందువల్లే దేశ అభివృద్ధి సాధ్యమైందన్నారు. దేశాభివృద్ధే ప్రధాని మోదీ ఆశయమని, దానికోసమే నిరంతరం తపన పడుతుంటారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిందని విమర్శించారు. ఎన్డీఏ పాలనలో ప్రజలు ఆశించిన స్థాయిలో సంక్షేమం, అభివృద్ధిని చేసి చూపిస్తామన్నారు. కేంద్ర సమాచార శాఖ మంత్రి ఎల్.మురుగన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో ఆంధ్రాలోని పోర్టులు, రహదారులు అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్‌కు రాజ్యాంగం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు.

బీసీ హాస్టళ్ల నిర్మాణం పూర్తికి మంత్రి ఆదేశం

సాక్షి, అమరావతి: నిర్మాణంలో ఉన్న బీసీ వసతిగృహాలను వేగంగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత–జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ అధికారులతో మంత్రి సవిత సోమవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న హాస్టళ్ల పరిస్థితిని అధికారులు వివరించారు. కొంత నిధులు కేటాయిస్తే తక్షణం పూర్తయ్యే భవనాలను గుర్తించి తొలి ప్రాధాన్యతగా వాటిని అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సూచించారు. డీఎస్సీకి ఉచిత శిక్షణ కోసం బీసీ స్టడీ సర్కిల్స్ సిద్ధం చేయాలని ఆదేశించారు.



జీవితం చాలా సరళమైనది. కానీ మనమే దానిని సంక్లిష్టంగా మార్చుకుంటాం.

– కన్‌ఫ్యూషియస్

సాక్షి

మంగళవారం, 9 జూలై 2024

ఫ్రాన్స్‌ గమ్యం ఎటు?

అన్ని అంచనాలనూ తలకిందులు చేస్తూ ఆదివారం రెండో రౌండ్‌ ఎన్నికల్లో వోటర్లు ఇచ్చిన తీర్పు పర్యవసానంగా ఫ్రాన్స్‌లో సందిగ్ధత నెలకొంది. తొలి రౌండులో స్పష్టంగా మితవాదం వైపు మొగ్గినట్టు కనిపించిన వోటర్లు హఠాత్తుగా దారి మార్చి ఇతర పక్షాలను తలకెత్తుకున్న వైనం బహుశా దేశ చరిత్రలో కనీవినీ ఎరుగనిది. 577 మంది సభ్యులుండే దిగువసభ 'అసెంబ్లీ నేషనల్‌'లో ప్రభుత్వం ఏర్పాటుచేసే పక్షానికి కనీసం 289 స్థానాలు రావాలి. కానీ తాజా ఫలితాల తర్వాత వామపక్ష న్యూ పాపులర్‌ ఫ్రంట్‌ 182 (తొలి రౌండ్‌లో రెండో స్థానం) సీట్లతో అగ్రభాగాన ఉండగా అధ్యక్షుడు ఇమ్మానియెల్‌ మేక్రాన్‌కు చెందిన ఎన్‌సెంబుల్‌కు 168 (తొలి రౌండ్‌లో మూడోస్థానం) వచ్చాయి. తొలి రౌండ్‌లో 32 శాతం వోట్లు సాధించుకుని అధికార పీఠానికి చేరువగా వెళ్లినట్టు కనబడిన తీవ్ర మితవాద పక్షం నేషనల్‌ ర్యాలీ (ఆర్‌ఎన్‌) రెండో రౌండ్‌లో సీట్లపరంగా 143తో మూడో స్థానానికి పరిమితమైంది. ఆర్‌ఎన్‌ పార్టీ తొలి రౌండ్‌లో అగ్రభాగాన ఉండటంతో ఇతర పక్షాల వోటర్లు అప్రమత్తమయ్యారు. మితవాద పక్షానికి పాలనాపగ్గాలు దక్కనీయరాదన్న కృతనిశ్చయంతో అటు మధ్యేవాద పక్షానికీ, ఇటు వామపక్షానికీ వోటేశారు. తొలి దశలో 65 శాతం, రెండో దశలో 63 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1981 తర్వాత ఈ స్థాయి వోటింగ్‌ ఎప్పుడూ లేదు. ఆర్‌ఎన్‌ గెలుపు ఖాయమని తేలినచోట్ల వామపక్ష కూటమి, మధ్యేవాద కూటమి అభ్యర్థులు స్వచ్ఛందంగా పోటీ నుంచి వైదొలగి ముఖాముఖి పోటీకి మార్గం సుగమం చేశారు. కనీసం 200 స్థానాల్లో బహుముఖ పోటీ బెడద తప్పింది. దీని ప్రభావం ఎంతగా ఉందంటే... ఫ్రాన్స్‌ పశ్చిమ ప్రాంతం లా సార్థ్‌లోని అయిదు స్థానాల్లో ఆర్‌ఎన్‌ తొలి రౌండ్‌లో నాలుగు స్థానాల్లో ముందంజలో ఉంది. తీరా ముఖాముఖి పోటీలో ఆ పార్టీకి ఒక్కటీ దక్కలేదు.

రాజకీయ అస్థిరత ఫ్రాన్స్‌కు కొత్తగాదు. 1946–'58 మధ్య పన్నెండేళ్లలో ఆ దేశం 22 ప్రభుత్వాలను చూసింది. అయితే అది రెండో ప్రపంచ యుద్ధం ముగిసి ప్రచ్ఛన్న యుద్ధ దశ మొదలైన తొలినాళ్ల కాలం. భవిష్యత్తులో మరెప్పుడూ దేశం సంకీర్ణాల జోలికి పోకుండా నాటి ఫ్రాన్స్‌ అధ్యక్షుడు చార్లెస్‌ డీగాల్‌ నూతన రాజ్యాంగాన్ని రూపొందించారు. ఇప్పటికీ అదే అమల్లోవుంది. ఎన్నికల్లో భిన్నపక్షాలు కూటమిగా పోటీ చేయటం, నెగ్గితే కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేయటం ఫ్రాన్స్‌లో సాధారణమే. కానీ కూటమిలో అధిక స్థానాలొచ్చిన పార్టీయే తన విధానాలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని నడుపుతుంది. ఇప్పుడు ఏర్పడిన పరిస్థితి భిన్నమైనది. ఒక పార్టీగా అత్యధిక స్థానాలు గెల్చుకున్నది ఆర్‌ఎన్‌ ఒక్కటే. చిత్రమేమంటే అటు ఆర్‌ఎన్‌లోనూ, ఇటు న్యూ పాపులర్‌ ఫ్రంట్‌లోనూ మేక్రాన్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయలేని స్థితిలో పాలనలో పాలుపంచుకోవటం వృథా అని ఇరుపక్షాల నేతలూ భావిస్తున్నారు. ఫ్రాన్స్‌ ప్రజల్లో మేక్రాన్‌ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ఆయన పార్టీతో కలిస్తే ఆ చీడ తమకూ అంటుతుందన్న భయాందోళనలు ఇరుపక్షాల్లోనూ ఉన్నాయి. అందుకే విస్తృత మధ్యేవాద కూటమిని ఏర్పాటు చేయాలన్న మేక్రాన్‌ ప్రయత్నం ఫలించకపోవచ్చన్నది విశ్లేషకుల మాట.

ఈనెల 26న ప్యారిస్‌ ప్రధాన వేదికగా ప్రపంచ క్రీడా సంరంభం ఒలింపిక్స్‌ ఘట్టం ప్రారంభం కాబోతోంది. 16 నగరాల్లో ఆగస్టు 11 వరకూ వివిధ ఈవెంట్లు జరగబోతున్నాయి. ఈ దశలో దేశంలో రాజకీయ అస్థిరత అలుముకుంటే ఎలాగన్న ఆందోళన అన్ని పక్షాల్లోనూ ఉంది. తమ కూటమికి అత్యధిక స్థానాలొచ్చాయి గనుక ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే వామపక్ష అన్‌బౌడ్‌ నేత జీన్‌ లక్‌ మెలింకోన్‌ కోరుతున్నారు. మితవాద ఆర్‌ఎన్‌ పార్టీని రానీయకూడదన్న పట్టుదలతో సోషలిస్టులు, వివిధ వామపక్షాలూ కలిసి కూటమిగా ఏర్పడ్డాయి తప్ప వాటి మధ్య లుకలుకలు తక్కువేమీ కాదు. అన్‌బౌడ్‌ పార్టీ భావసారూప్య పక్షాలన్నిటినీ ఒక గొడుగు కిందకు తెచ్చిందన్న మాటేగానీ ఆ పార్టీకి తలొగ్గి ఇతర పక్షాలు పనిచేస్తాయా అన్నది సందేహమే. సుస్థిర ప్రభుత్వాన్ని అందించలేకపోతే మళ్లీ ఎన్నికలకు వెళ్లకతప్పదు. అదే జరిగితే వామపక్ష కూటమికి ఇప్పుడు దక్కిన ఆదరణ ఆవిరయ్యే ప్రమాదం, ఆర్‌ఎన్‌ మరింత పుంజుకునే అవకాశం ఉంటాయి. మెలింకోన్‌ తీరుపై సొంత పార్టీలోనే వ్యతిరేకత ఉంది. ఆయన దుందుడుకు విధానాలు ఇంటా బయటా సమస్యాత్మకం కావొచ్చని, ముఖ్యంగా యూరప్‌ యూనియన్‌ (ఈయూ)తో పేచీలు తేవచ్చునని భయాందోళనలున్నాయి. ఈయూలో జర్మనీ తర్వాత రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ ఫ్రాన్స్‌దే. నాజీల దురాక్రమణతో సంక్షోభాన్నెదుర్కొన్న ఫ్రాన్స్‌లో మితవాదపక్షానికి ఆది నుంచీ ఆదరణ లేదు. కానీ ఆర్‌ఎన్‌ అధినేత మెరిన్‌ లీ పెన్‌ తెలివిగా జాత్యహంకారం, యూదు వ్యతిరేకత వంటి అంశాల్లో పార్టీ విధానాలను సవరించుకున్నారు. విద్వేష ప్రసంగాలతో తరచు జైలుపాలైన తన తండ్రి మెరీ లీపెన్‌ను పార్టీ నుంచి సాగనంపారు. గాజాలో ఇజ్రాయెల్‌ దురాక్రమణ యుద్ధాన్ని కూడా వెనకేసుకొచ్చారు. ఫ్రాన్స్‌ రాజ్యాంగంలోని 12వ అధికరణం కింద కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు నిర్దిష్ట వ్యవధంటూ లేదు. అలాగని దీర్ఘకాలం ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని కొనసాగనిస్తే అది మేక్రాన్‌కు రాజకీయంగా తీవ్ర నష్టం తీసుకొస్తుంది. మొత్తానికి మూడు పక్షాల్లోనూ ఎవరూ మరొకరితో కలవడానికి ఇష్టపడని వర్తమాన పరిస్థితుల్లో మేక్రాన్‌ ఏం చేస్తారన్న ఉత్కంఠ అందరిలోనూ ఉంది. ఏ ప్రభుత్వం ఏర్పడినా అవిశ్వాస తీర్మాన గండం తప్పదు. మెడపై మితవాద బెడద వేలాడుతున్న తరుణంలో చివరకు ఫ్రాన్స్‌ గమ్యం ఏమిటన్నది మిలియన్‌ యూరోల ప్రశ్న!

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం; **తిథి:** శు.చవితి(పూర్తి 24 గంటలు)
నక్షత్రం: ఆశ్లేష ఉ.7.51 వరకు, తదుపరి మఖ; **వర్జ్యం:** రా.8.50 నుండి 10.34 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8.10 నుండి 9.02 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.42 వరకు; **అమృత ఘడియలు:** లేవు

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

పరమ యోగి

రాలిపడిన పూవుల గాయాల
రహస్యాలను శోధించే
తోటమాలివి నీవు...

దుర్గంధంతో జ్వలించే
కీకారణ్యాన్ని జయించి
చావు తావులను పసిగట్టే
సత్యాన్వేషివి నీవు...

పార్థివ దేహ గర్భగుడిలో సంచరించి
మృత్యువు మూలతత్వాన్ని
అపర నారాయణులకు
ప్రవచించే పరమ యోగి నీవు...

కరకు కత్తులు చేసిన రక్త సంతకాలతో
నిర్జీవ గాత్రం నిండా ఘనీభవించిన గాయాలను,
కామ తృష్ణ పరమ హింసలో
ఛిద్రమైన శుక్ల ఖండాలను,
ఆచూకీ తెలియని
ఉక్కు పాదాలకింద నలిగిన
అనాథ కళేబరాలను
వేయి చూపులతో దర్శించి
మరణమూల్యాంకనం చేస్తావు

కుష్ఠురోగిని ఇష్ట దైవంగా కొలిచిన మహాతల్లి లా
కుళ్లిన శవాలను ప్రాణమిత్రుల వలె
పరామర్శిస్తావు...

శవాల మీద విసిరిన చిల్లరను
మూటగట్టుకోవడం
చాలా సులభం!
కానీ మూటగట్టిన శవాల్లోకి
నిర్భయంగా తొంగి చూడటమే కష్టం!

వస్తువులతో కాపురం చేసే ప్రబుద్ధులు
బతికి ఉన్న మనుషులను శవాలుగా చూస్తుంటే,
శవాలను కూడా మనుషులుగా ప్రేమించే
కరుణా జలపాతం నీవు

మూర్తీభవించిన సాహసం నీవు
స్ఫూర్తీభవించిన దివ్య సేవానిరతి నీవు.

కన్నీటి ఎడారుల సాక్షిగా
మార్చురీ మైదానంలో నిర్విరామంగా
మహా యజ్ఞం నిర్వహించిన
మేరే ప్యారే సలీం భాయ్‌!
పవిత్రమైన నీ చేతులను
నాకిప్పుడు ముద్దాడాలనిపిస్తోంది!

– కోయి కోటేశ్వరరావు । 9440480274

(గాంధీ ఆస్పత్రి మార్చురీలో 42 ఏళ్ల సర్వీసులో 60 వేల శవపరీక్షలకు టెక్నీషియన్‌గా దాక్టర్లకు సహకరించిన సలీం కోసం...)

కొరత సృష్టించిన అగ్నిపథ్‌!

విశ్లేషణ



జి.జి. ద్వివేది

అయిదేళ్ల కాల పరిమితి తర్వాత కూడా సైన్యంలో కొనసాగడానికి అర్హత సాధించాలనే ప్రయత్నంలో అగ్నివీర్‌ల మధ్య అనారోగ్యకరమైన పోటీ, వారిపై స్పష్టమైన ఒత్తిడి ఉండటం కనిపిస్తోంది. అంతేకాదు, అగ్నిపథ్‌ పథకం... సైన్యంలో తీవ్రమైన కొరతకు కూడా దారి తీసింది. సైన్యంలోంచి ఏటా పదవీ విరమణ చేసేవారి సంఖ్యలో సగాని కంటే కాస్త మాత్రమే ఎక్కువగా అగ్నివీర్‌లను తీసుకున్నారు. వీరిలో 25 శాతం మందిని మాత్రమే నిలుపుకొంటారు కనుక ఈ లోటు మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో అగ్నిపథ్‌ పథకాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది. అయితే ఈ పథకం తీవ్రమైన లోపాలతో ఉన్నందున, చిన్న చిన్న మార్పులు విలువైన ప్రయోజనాన్ని అందించలేవనే భావన కూడా సర్వత్రా వ్యక్తం అవుతోంది.

లోపాలను సరిదిద్దడానికి 'ఫలితానంతర' చర్యలపై ఆధారపడే వ్యవస్థీకృత మార్పు ఏదైనా సరే అంతర్గతంగా లోపభూయిష్ఠంగా ఉంటుంది. అగ్నిపథ్‌ పథకం అలాంటి ఉదాహరణగా నిలుస్తుంది. రెండేళ్ల క్రితం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆఫీసర్‌ ర్యాంకుకు కిందిస్థాయిలో ఉన్న సైనికుల నియామక ప్రక్రియను మార్చడానికి అంటూ దీన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. పెరిగిపోతున్న రిటైర్డ్‌ సైనికుల పెన్షన్‌ బిల్లును తగ్గించడానికి కూడా దీన్ని తీసుకొచ్చారు. సాయుధ దళాలలోని ఇతర ర్యాంకులు యువతతో నిండి వుండేలా ఇది దోహదపడుతుంది. అయితే ఈ పథకం సాయుధ దళాలలో చేరడానికి ఆసక్తి ఉన్న యువత నుండి ప్రతిఘటనను ఎదుర్కొంది. దీనిపై సమగ్ర సమీక్ష చేయాలంటూ రాజకీయవర్గాలు బలంగా డిమాండ్‌ చేస్తున్నాయి.



సైనిక ఎంపిక పరీక్షలో అభ్యర్థులు

అగ్నిపథ్‌ ఆలోచన 'టూర్‌ ఆఫ్‌ డ్యూటీ' (నిర్దిష్ట ప్రాంతంలో నిర్దిష్ట సైనిక సేవలు) అనే భావన నుండి తీసుకోవటం జరిగింది. ఇది సైనిక సేవ కోసం ఎంపిక చేసేవారి కొరతను అధిగమించడానికి పాశ్చాత్య దేశ సైన్యాల్లో విస్తృతంగా ఆచరణలో ఉంది. అప్పటి డిఫెన్స్‌ స్టాఫ్‌ చీఫ్‌ జనరల్‌ బిపిన్‌ రావత్‌ మన సాయుధ దళాలలో ఈ 'టూర్‌ ఆఫ్‌ డ్యూటీ'ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. సైనికులను చిన్న సంఖ్యలలో రిక్రూట్‌ చేయడం ద్వారా ఈ ప్రతిపాదనను పరీక్షించడం అసలు ఉద్దేశం. అయితే, ఈ పథకం ఏకపక్షంగా ముందుకు సాగినట్లు తెలుస్తోంది. మాజీ ఆర్మీ స్టాఫ్‌ జనరల్‌ ఎమ్‌ఎమ్‌ నరవణే రాసిన 'ఫోర్‌ స్టార్స్‌ ఆఫ్‌ డెస్టినీ' పుస్తకంలో నివేదించిన అంశాలు దీన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ పథకాన్ని సైనిక విభాగాలకు 'పిడుగుపాటు'గా ఆయన ఈ పుస్తకంలో అభివర్ణించారు.

ప్రస్తుతం ఈ పథకం కింద 17.5 నుండి 21 సంవత్సరాల వయస్సు ఉండి 12వ తరగతి విద్యార్హత కలిగిన అభ్యర్థులకు 'అగ్నివీర్‌'లుగా ఆరు నెలల శిక్షణ ఇచ్చిన తర్వాత నాలుగు సంవత్సరాల కాలానికి నియమించారు. వారిలో 25 శాతం మంది మాత్రమే పింఛను, పదవీ విరమణ అనంతర ప్రయోజనాలతో మరో 15 సంవత్సరాల కాలం కొనసాగేందుకు అర్హులు అవుతారు. దీనికోసం వారిని తిరిగి నమోదు చేసుకుంటారు. ఇక సైన్యం నుంచి విడుదలైన మిగతా 75 శాతం మందికి పరిహారంగా 'సేవా నిధి' కింద రూ.10 లక్షల ప్యాకేజీ ఇస్తారు.

ప్రస్తుతం మొత్తం రక్షణ శాఖ పెన్షనర్ల సంఖ్య దాదాపు 24.62 లక్షలు. వీరిలో సాయుధ దళాల సీనియర్లు దాదాపు 19 లక్షలు కాగా, పౌర విభాగ సిబ్బంది 5.62 లక్షల మంది ఉన్నారు. 2022 గణాంకాల ప్రకారం అగ్నిపథ్‌ పథకాన్ని ప్రవేశపెట్టినప్పుడు రక్షణ బడ్జెట్‌ రూ. 5,25,166 కోట్లు. ఇందులో పింఛను ఖర్చు రూ.2,07,132 కోట్లు. రక్షణ సిబ్బంది వాటా రూ. 1,19,696 కోట్లు కాగా, పౌర విభాగం వాటా రూ. 87,436 కోట్లు. ఈ రెండో మొత్తం పెన్షనరీ బడ్జెట్‌లో 40 శాతం వాటాను కలిగి ఉంది.

కుటుంబ సంప్రదాయాలకు అనుగుణంగా సాయుధ దళాలలో గౌరవప్రదమైన వృత్తిని కోరుకునే వ్యక్తులు ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఆర్‌పీఎఫ్‌) అగ్ర ఎంపికగా ఉండటం వలన ఈ పథకంపై ప్రతికూల ప్రభావం స్పష్టంగా ఉంది. నేను ఈ ధోరణిని నా సొంత రాష్ట్రమైన పంజాబ్‌లో చూశాను. సైన్యం నుంచి విడుదలైన అగ్నివీరులలో తాము విస్మరించబడ్డామనే అపకీర్తిని మోస్తున్నట్లు, గర్వించదగిన అనుభవజ్ఞులుగా తమను చూడరనే సాధారణ భావన కూడా వారిలో ఉన్నట్లు నేను గ్రహించాను.

ఇటీవల, అగ్నివీరులు కార్యాచరణ ప్రాంతాల్లో మోహరించినప్పుడు వారు అత్యున్నత త్యాగం చేసిన రెండు సందర్భాలు ఉన్నాయి. అయితే పూర్తి పెన్షన్‌కు అర్హులైన సాధారణ సైనికులకు భిన్నంగా వారి బంధువులు ఏకమొత్తంలో మాత్రమే పరిహారం పొందేందుకు అర్హులు. ఈ వివక్ష తీవ్రమైన క్రమరాహిత్యంగా నిలుస్తోంది. ఈ రోజు సైనిక విభాగాల్లో రెగ్యులర్‌ సైనికులు, అగ్నివీరులు అనే రెండు వర్గాలు ఉన్నాయి. అయిదేళ్ల తర్వాత కూడా సైన్యంలో కొనసాగడానికి అర్హత సాధించాలనే వారి ప్రయత్నంలో అగ్నివీర్‌ల మధ్య అనారోగ్యకరమైన పోటీ, స్పష్టమైన ఒత్తిడి కనిపిస్తోంది. నిజానికి ఇది స్నేహబంధం, సైనికుల మధ్య పరస్పర సహకారం, యూనిట్‌ కల్చర్‌, రెజిమెంట్‌ పునాది వంటివాటికి హానికరమైనది. మెరుగైన ఆయుధాలతో సన్నద్ధమైన ప్రత్యర్థులకు వ్యతిరేకంగా మన సాయుధ దళాల అత్యాధునిక సామర్థ్యానికి ఇది చేటు కలిగిస్తుంది. వియత్నాం, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికన్లు; గాజాలో ఇజ్రాయెలీలు; రష్యా–ఉక్రెయిన్‌ యుద్ధంలో రెండు వైపుల సైనికులు – 'టూర్‌ ఆఫ్‌ డ్యూటీ'ని నిష్ప్రయోజనమైనదిగా గుర్తించారు. మన విషయానికి వస్తే, నేటికీ కొనసాగుతున్న ద్వైపాక్షిక ప్రతిష్టంభన సమయంలో లద్దాఖ్‌లో చైనా సైన్యం కూడా పేలవంగా పని చేసింది.

అగ్నిపథ్‌ పథకం సైనిక బలగంలో తీవ్రమైన కొరతకు కూడా దారితీసింది. సైన్యంలోంచి ఏటా పదవీ విరమణ చేసే వారి సంఖ్య 70,000 అయితే, కేవలం 42,000 మంది అగ్నివీర్‌లను మాత్రమే తీసుకున్నారు. వీరిలో 25 శాతం మందిని మాత్రమే నిలుపుకోవడంతో ఈ లోటు మరింత పెరగనుంది. 39 గూర్ఖా బెటాలియన్‌లలోని 60 శాతం సైనికులు 'నేపాల్‌ స్థానిక గూర్ఖా'ల నుండి వచ్చినందున గూర్ఖాల నియామకం గరిష్ఠంగా దెబ్బతింది. నేపాల్‌ ప్రభుత్వం అగ్నిపథ్‌ను తిరస్కరించడం వల్ల తీవ్రమైన చిక్కులు ఎదురవుతున్నాయి. అదే సమయంలో గూర్ఖాలను రిక్రూట్‌ చేయడానికి చైనీస్‌ సైన్యం చేసిన ప్రకటనలను తోసిపుచ్చలేము. భారతీయ యువత విదేశీ సైన్యంలో చేరడం ఆందోళన కలిగించే ధోరణి. రష్యా సైన్యంలో చేరేందుకు ఆకర్షితులవుతున్న కొంతమంది వ్యక్తుల గురించి వెలువడిన ఇటీవలి నివేదికలు దీనికి ఉదాహరణ.

అగ్నిపథ్‌ పథకాన్ని పునస్సమీక్షిస్తున్నారనే నివేదికలు వస్తున్నాయి. వాటిని బట్టి అగ్నివీరులను నిలబెట్టుకోవడంతో పాటుగా, సేవా సంవత్సరాల పొడిగింపు శాతం కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ పథకం తీవ్రమైన లోపాలతో ఉన్నందున, చిన్న చిన్న మార్పులు విలువైన ప్రయోజనాన్ని అందించవు. రిక్రూట్‌మెంట్‌ ప్రక్రియ మరింత శాస్త్రీయంగా, కఠినంగా ఉండేలా మునుపటి వ్యవస్థను చక్కగా తీర్చిదిద్దడం ముఖ్యం. ఫిట్‌నెస్‌ శారీరక, మానసిక ఆరోగ్యం రెండింటినీ కలిగి ఉంటుంది కాబట్టి వయఃపరిమితిని 32 నుండి 26కి తగ్గించడంతో ఫలితం ఉండదు. సైనికుడిని సర్వతోముఖంగా తయారు చేయడానికి ఆరు నుంచి ఏడు సంవత్సరాలు పడుతుంది; వ్యక్తిగత దారుఢ్యం 20ల చివరలో, 30ల ప్రారంభంలో గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. అయితే వివాదాస్పద సరిహద్దులను 42 ఏళ్లు పైబడిన మధ్యస్థ వయస్సుతో కాపు కాస్తున్న సీఆర్‌పీఎఫ్‌ సిబ్బంది ఫిట్‌నెస్‌ ఎప్పుడూ ప్రశ్నార్థకం కాకపోవడం గమనార్హం.

సాయుధ దళాలు, రక్షణ విభాగంలోని పౌర సంస్థల సంఖ్యను సరైన పరిమాణంలోకి తీసుకురావడం ద్వారా పెన్షన్‌ బిల్లును గణనీయంగా తగ్గించవచ్చు. ఉదాహరణకు, డిఫెన్స్‌ రీసెర్చ్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఆర్గనైజేషన్‌ (డీఆర్‌డీఓ) 10,000 మంది కాంట్రాక్టు కార్మికులను, సుమారు 50 పరిశోధన శాలలతో పాటు దాదాపు 30,000 మంది సిబ్బందిని కలిగి ఉంది. డీఆర్‌డీఓని పునర్నిర్మించడం, కుదించటం కోసం విజయ్‌ రాఘవన్‌ కమిటీ ఇటీవలి సిఫార్సులు సరైన దిశలో ఒక అడుగు. దాదాపు 80,000 మంది కార్మికులు పనిచేస్తున్న 41 ఆర్డినెన్స్‌ కర్మాగారాలకు ఇదే విధమైన కసరత్తు అవసరం.

ఒక వ్యవస్థ స్థితిస్థాపకత... తప్పును సరి చేయగల దాని సామర్థ్యంలో ఉంటుంది. సైనిక విభాగం పెద్దలు అన్ని ఇతర పరిగణనలను పక్కన పెట్టి భారీ సంస్థాగత ప్రయోజనార్థం అగ్నిపథ్‌ పథకాన్ని రద్దు చేస్తారని ఆశిస్తున్నాను.

వ్యాసకర్త రిటైర్డ్‌ మేజర్‌ జనరల్‌

సోషల్‌ మీడియా

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్‌, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

యువ కిరణాలు



మౌంట్‌ అబూ పరిశోధనశాలలో ఫిజికల్‌ రిసెర్చ్‌ లేబరేటరీ (గుజరాత్‌) యువ శాస్త్రవేత్తలు సౌరవ్యవస్థ వెలుపల ఇతర నక్షత్రాల చుట్టూ తిరుగుతున్న గ్రహాలను గురించి మొట్టమొదటి ఆవిష్కరణలను చేశారు. ఆకట్టుకునే విధంగా దేశీయంగా అభివృద్ధి చేసిన టెలిస్కోప్‌లు, వారే స్వయంగా రూపొందించిన ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన శాస్త్ర పరికరాలను ఇందుకు ఉపయోగించారు. ఇది దేశం గర్వించదగిన విశేషం.

– సంధ్యా రమేశ్‌, జర్నలిస్ట్‌

వేరే దారి లేక..!



థానేలోని లేబర్‌ కోర్టు ఆవరణలో పార్క్‌ చేసి ఉన్న నా కారు వెనుక వైపు కూర్చొని, పచ్చి మిరపకాయతో చపాతీ తింటున్న మనిషిని చూసి నా మనసు చివుక్కుమంది. దాని గురించి నేను అతనిని అడిగినప్పుడు... మండుతున్న ధరల కారణంగా కూరగాయలు కొనలేకపోతున్నామని చెప్పాడు!

– సందీప్‌ మనుధానే, విద్యావేత్త

నిర్మాణాత్మక సమస్యలు



బ్రిటన్‌లో లేబర్‌ పార్టీ విజయాన్ని ఉత్సవం జరుపుకొంటున్నవారిని చూస్తే జాలేస్తోంది. బ్రిటన్‌ సమస్యలు నిర్మాణాత్మకమైనవనీ, పన్ను రేట్లను సవరించడం – టోరీల కంటే తామెంత శ్రామిక వర్గమో చెప్పడం వల్ల అవి పరిష్కారం కావనీ అర్థం చేసుకోవడానికి కొన్ని నెలలు చాలు!

– కాన్‌స్టంటిన్‌ కిసిన్‌, సెటైరిస్ట్‌

చర్చలకు సిద్ధం



భౌగోళిక రాజకీయాల కన్నా ఆర్థికాంశాలకు ఇరానియన్‌ ఓటర్లు ప్రాధాన్యమిచ్చారు. ఒక్కమాటలో చెప్పాలంటే, పెజెష్కియాన్‌ విజయాన్ని అలాగే చూడాల్సి ఉంటుంది. అంటే, అమెరికాతో తిరిగి చర్చలు జరపాలని తెహ్రాన్‌ కోరుకుంటోంది. దీనివల్ల ఏ విధమైన నష్టం లేని బైడెన్‌ ఒక చారిత్రక అధ్యక్ష వారసత్వాన్ని విడిచిపెట్టేలా స్పందించాలి.

– ఎం.కె.భద్రకుమార్‌, మాజీ రాయబారి

పని చేస్తోందా? పట్టు తప్పుతోందా?!

కామెంట్‌



కరణ్‌ థాపర్‌

ఇప్పుడిక మనం 18వ లోక్‌సభను ఎన్నుకున్నందున ప్రాథమికమైన రెండు ప్రశ్నలను లేవనెత్తాల్సిన సమయం ఆసన్నమయింది. మొదటిది– లోక్‌సభ మన ఆశలకు అనుగుణంగానే పని చేస్తోందా? రెండవది – కేవలం పాలక పక్షాలు చెప్పింది వినడం వరకే కాక, భారత ప్రజల గొంతును కూడా వినిపించేందుకు తగినంతగా సమయాన్ని సాధించేలా ప్రతిపక్షాన్ని ఒప్పించటానికి ఎలాంటి మార్పులు అవసరం?

17వ లోక్‌సభ కేవలం 1,354 గంటలు మాత్రమే పని చేసిందని పీఆర్‌ఎస్‌ (పాలసీ రీసెర్చ్‌ స్టడీస్‌) లెజిస్లేటివ్‌ రీసెర్చ్‌ ప్రచురించిన వాస్తవాలు తెలియజేస్తున్నాయి. మొత్తం అన్ని పూర్తి–కాల లోక్‌సభల పని గంటల సగటు కంటే నలభై శాతం తక్కువగా 1,615 గంటలు మాత్రమే పని చేసిన 16వ లోక్‌సభ కన్నా కూడా ఇది తక్కువ. నిజానికి 17వ లోక్‌సభ 15 సమావేశాలలో 11 సమావేశాలు నిర్దిష్ట సమయానికి ముందే వాయిదా పడ్డాయి. మొత్తం అన్ని పూర్తి–కాల లోక్‌సభలలో ఒక్క 17వ లోక్‌సభ మాత్రమే అతి తక్కువగా కేవలం 274 సార్లు మాత్రమే సమావేశం అయింది.

ఏడాదికి 135 రోజులు సమావేశం అయిన తొలి లోక్‌సభతో పోల్చి చూస్తే 17వ లోక్‌సభ ఏడాదికి కేవలం 55 రోజులు మాత్రమే సమావేశమైంది. ఇది చట్ట నిర్వహణ విధానంపై స్పష్టమైన ప్రభావం చూపింది. బిల్లులు చాలావరకు వాటిని ప్రవేశపెట్టిన రెండు వారాల లోపే ఆమోదం పొందాయి. 35 శాతం బిల్లులు గంట కంటే తక్కువ చర్చతోనే చట్టరూపం దాల్చాయి. పార్లమెంటరీ కమిటీల పరిశీలన కోసం కేవలం 16 శాతం మాత్రమే వెళ్లాయి. ఆ ముందరి మూడు లోక్‌సభలలో పరిశీలనకు వెళ్లినవాటి కంటే ఇది తక్కువ.

అంటే, లోక్‌సభ పని గంటలు తగ్గిపోతుండటమే కాకుండా, అందులోనూ మళ్లీ... బిల్లుల నిశిత పరిశీలన, బిల్లులపై జరగవలసిన అర్థవంతమైన చర్చల విషయంలో లోక్‌సభ సామర్థ్యం క్షీణించిపోతోంది! లోక్‌సభ అతి ముఖ్యమైన విధులలో ఈ బిల్లుల చర్చ–పరిశీలన ఒకటి కనుక అది మన అంచనాలకు తగ్గట్లుగా లేదని మనం నిస్సంకోచంగా అనుకోవచ్చు. దీనికి పరిష్కారం సరళమైనది, స్పష్టమైనది. అదేమిటంటే, లోక్‌సభలు ప్రతి సంవత్సరం కనీసం ఇన్ని రోజులని నిర్దిష్టంగా సమావేశం అవ్వాలి. బిల్లులు ఆమోదం పొందటానికి ముందు సవివరమైన పరిశీలన కోసం వాటిని పార్లమెంటరీ కమిటీలకు పంపాలి.

మరొకటి – ఎంతో క్లిష్టమైనదీ – లోక్‌సభ పనితీరుకు ప్రభుత్వం బాధ్యత వహించేలా చేయటం! ఇక్కడే పాలకపక్షం తమ గొంతును వినటం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించవలసిన అవసరం ఉంది. అలా చేస్తే తప్ప



ప్రభుత్వాన్ని అర్థవంతంగా ప్రశ్నించటం, సవాలు చేయటం కుదరదు. మరి దీన్నెలా మనం సాధించాలి?

దీనికొక కుదురైన పరిష్కారం హౌస్‌ ఆఫ్‌ కామన్స్‌ పాటించే విధానాన్ని స్వీకరించటం! ప్రతి సమావేశాలలోనూ కొన్నిరోజులు ప్రతిపక్షాలే అజెండాను నిర్ణయించేలా చేయటం. బ్రిటన్‌లో వాటిని 'ప్రతిపక్షాల రోజులు' అంటారు. ప్రతి పార్లమెంటు సమావేశంలో అవి 20 ఉంటాయి. ప్రధాన ప్రతిపక్షానికి 17, రెండవ అతిపెద్ద ప్రతిపక్షానికి 3 రోజులు.

మనం అనుసరించదగిన బ్రిటిష్‌ పార్లమెంటరీ విధానాలలో రెండవది... పీఎంక్యూస్‌ (ప్రైమ్‌ మినిస్టర్స్‌ క్వశ్చన్స్‌). సమావేశాలు జరుగుతున్న కాలంలో ప్రతివారం ఒక నిర్ణీత రోజున పూర్తిగా ఒక అరగంట పాటు ప్రతిపక్షాల ప్రశ్నలకు ప్రధానే నేరుగా సమాధానం చెబుతారు. వాటిల్లో కనీసం ఆరు ప్రశ్నలను ప్రతిపక్ష నేత అడుగుతారు.

పీఎంక్యూస్‌ అని బ్రిటన్‌లో వాడుకలో ఉన్న ఈ ప్రశ్నా సమయం అమితమైన ప్రజాసక్తిని కలిగి ఉంది. పీఎం, ప్రతిపక్ష నేతల బలాలను, బలహీనతలను బహిర్గతపరిచే ఉత్తేజభరితమైన క్షణాలు అవి. వారి సమాచార లేమి, సామర్థ్య లోపం ఇట్టే తెలిసిపోతాయి. పీఎంక్యూస్‌ బ్రిటన్‌కొక గవాక్షం వంటిది కూడా! తమ నాయకుడు ఎంతటి ఘనుడో ప్రజలు చూస్తారు. ఒక అంచనాకు వస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రజాస్వామ్యం పని చేస్తోందా, లేక పట్టుతప్పుతోందా అనేదానికి పీఎంక్యూస్‌ ఒక రుజువు.

ఈ సంప్రదాయాలను మనం స్వీకరించినట్లయితే, ప్రజాస్వామ్యం పట్ల అవి మన విశ్వాసాన్ని పెంపొందింపజేస్తాయి. తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలన్న ప్రతిపక్షాల ప్రయత్నానికి అవి మద్దతును ఇస్తాయి. భిన్నమైన అభిప్రాయాలు, వాదనలకు చర్చావేదిక దొరికిందన్న నమ్మకాన్ని భారత ప్రజలకు కల్పిస్తాయి.

చివరిగా, కోల్పోయిన విశ్వాసాన్ని నిజంగా పాదుకొల్పడానికి మనం స్పీకర్‌ స్థానం విషయమై కూడా మార్పులు చేసుకోవలసిన అవసరం ఉంది. స్పీకర్‌గా ఎంపికైన వారు వెంటనే తమ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాలి. అప్పుడు మాత్రమే ఆ వ్యక్తి నిష్పక్షపాతంగా, పార్టీలకు అతీతంగా ఉండగలరని నమ్మగలం. ఆమె లేదా అతడు తర్వాతి లోక్‌సభకు కూడా కొనసాగాలని అనుకుంటే వారి ఎన్నిక పోటీ లేకుండానే జరగాలి. అదంతా కూడా ఎలాగూ వారి స్వభావం, ప్రవర్తన మీద ఆధారపడి ఉన్నప్పటికీ వార్ధక్య వైకల్యాలు లేకుండాలి.

ఇవి స్పష్టమైన పరిష్కారాలే కానీ ప్రభుత్వం ఆమోదించినప్పుడు మాత్రమే సంభవమౌతాయి. కాంగ్రెస్‌ పార్టీ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతిపక్షమే స్వయంగా ఈ మార్పులను సిఫారసు చేయవచ్చు. అందుకు బీజేపీ కనుక నిరాకరిస్తే భారత దేశం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిది అని చెప్పుకోవటాన్ని ఆ పార్టీ కొనసాగించగలదా? అప్పుడు తల్లి అని కాకుండా సవతి తల్లి అని చెప్పుకోవటమే సరిగ్గా ఉంటుందా?

వ్యాసకర్త సీనియర్‌ జర్నలిస్ట్‌

క్లుప్తంగా...

కేంద్రంలో ఎప్పుడైనా అధికార మార్పు

- గొప్ప పాలన అందించిన ఘనత వైఎస్సార్‌దే
- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

మడకశిర: కేంద్రంలో ఎప్పుడైనా అధికార



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రఘువీరారెడ్డి

మార్పు జరగొచ్చని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీకి పూర్తిస్థాయిలో మెజార్టీ లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చే అవకాశం లేకపోలేదని చెప్పారు. సోమవారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ గొప్ప పాలన అందించారని, ఆయనతో విభేదించిన వారు సైతం ఈరోజు పాలనలో వైఎస్సార్ విధానాలనే అనుసరిస్తున్నారని తెలిపారు. బీజేపీకి మద్దతిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దాడిలో గాయపడిన నలుగురికి ఆర్థిక సాయం



చెక్కులు అందజేస్తున్న మందపాటి, రజిని, ఏసురత్నం, మోదుగుల తదితరులు

నెహ్రూనగర్ (గుంటూరు): కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు స్పష్టం చేశారు. స్థానిక ముత్యాలరెడ్డి నగర్, సుగాలీ కాలనీ, బృందావన్ గార్డెన్స్ ప్రాంతాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాకేష్‌నాయక్, ఆర్.అంజిబాబు, వి.శకుంతలబాబు, ప్రకాష్‌రెడ్డిలపై టీడీపీ శ్రేణులు గాయపర్చిన విషయం విదితమే. వీరిని వైఎస్సార్‌సీపీ బృందం సోమవారం పరామర్శించింది. పార్టీ అధినేత వైఎస్ జగన్ తరపున ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రూ.2 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు.

చెరువు గట్టును ఆక్రమించిన టీడీపీ వర్గీయులు

- గ్రామస్తుల ఫిర్యాదు

ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరంలో గ్రామ పంచాయతీకి చెందిన రంగమ్మ చెరువు గట్టును టీడీపీ వర్గీయులు ఆక్రమించారని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు గట్టును చదును చేసి అక్రమ నిర్మాణాలకు పనులు మొదలుపెట్టారని తెలిపారు. ఉంగుటూరులో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వారు ఎమ్మార్వోకి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రశ్నించిన వారిపై దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేశారని తెలిపారు. ఉప సర్పంచ్ మురళి గ్రామ కార్యదర్శికి ఫోన్‌చేసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు.

పోలీసులు గతంలో దాడి చేశారంటూ చంద్రదండు అధ్యక్షుడి ఫిర్యాదు

వైఎస్సార్‌సీపీ నేత సజ్జల, పోలీసులపై కేసు నమోదు చేయాలన్న ప్రకాశ్‌నాయుడు

పెదపూడి : తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో గతేడాది ఫిబ్రవరి 23న చంద్రబాబు నిర్వహించిన 'ఇదేం ఖర్మ' కార్యక్రమం సందర్భంగా తమపై అప్పటి డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అప్పారావు దాడి చేశారంటూ చంద్రదండు వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రకాశ్ నాయుడు సోమవారం అనపర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాడు వైఎస్సార్‌సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు బలభద్రపురంలో పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో జరిగిన సంఘటనలో పోలీసులు తనపై దాడికి పాల్పడ్డారని, తెలిపారు. నాడు పోలీసులు కేసు నమోదు చేయలేదని, ఇప్పుడు మళ్లీ సజ్జల, పోలీసు అధికారులపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్టు వివరించారు.

'నా వద్దే డీజిల్ కొనాలి'

మత్స్యకారుడికి టీడీపీ నేత బెదిరింపు

నరసాపురం: చిన్నపాటి మోటారు బోటుపై గోదావరి నదిలోకి వెళ్లి చేపల వేట సాగించుకునే మత్స్యకారుడిపై తెలుగు యువత అధ్యక్షుడు బర్రె మురళి బెదిరింపులకు పాల్పడిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పట్టణంలోని శ్రీహరిపేటకు చెందిన బాధితుడు వనమాడి రాంబాబు ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్‌కు ఫిర్యాదు చేశాడు. రాంబాబు చిన్నపాటి మోటారు బోటుపై వశిష్ఠ గోదావరి నదిలోకి వెళ్లి చేపల వేట సాగిస్తున్నాడు. ఆ బోటుకు ఉపయోగించే డీజిల్ తనవద్దే కొనాలని, లేదంటే బోటు తాళ్లు విప్పేసి గోదావరిలో వదిలేస్తానని పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు బర్రె మురళి బెదిరిస్తున్నాడు. దీనిపై విచారణ చేయిస్తానని ఆర్డీవో బాధితుడికి హామీ ఇచ్చారు.

సీఎంల భేటీపై ఎందుకంత గోప్యం?

సమావేశంలో చర్చించిన అంశాలను బహిర్గతం చేయాలి

- టీటీడీ, పోర్టుల్లో తెలంగాణ వాటా అడిగిందన్న వార్తలపై మౌనమెందుకు?
- పోలవరం ముంపు గ్రామాల విలీనాన్ని తెలంగాణ అడిగిందన్న దానిపై వివరణ ఇవ్వాలి
- మరోసారి రాష్ట్రానికి చంద్రబాబు ద్రోహం చేస్తున్నారు
- హామీలను అమలుచేయకపోతే సామాన్యుడి గొంతుకై వైఎస్ జగన్ విజృంభిస్తారు
- సీఎం చంద్రబాబుకు మాజీమంత్రి అంబటి రాంబాబు హెచ్చరిక

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి మధ్య ఇటీవల జరిగిన చర్చల అంశాలపై ఎందుకంత రహస్యమని మాజీమంత్రి అంబటి రాంబాబు చంద్రబాబును ప్రశ్నించారు. తక్షణమే చర్చల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టులో ఏడు ముంపు మండలాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలన్న ప్రతిపాదనతోపాటు.. టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) ఆదాయంలో,



పోర్టుల్లో వాటా, కృష్ణా జలాల్లో అదనపు వాటా కావాలంటూ తెలంగాణ ప్రభుత్వం అడిగిందంటూ మీడియాలో వచ్చిన వార్తలపై చంద్రబాబు స్పందించకపోవడంతో అందరికీ అనుమానాలు వస్తున్నాయన్నారు. దీంతో సీఎం చంద్రబాబు మరోసారి ఏపీకి తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమయ్యారని అర్థమవుతోందని అంబటి మండిపడ్డారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

తెలంగాణలో పార్టీని బతికించుకునేందుకు ఏపీకి ద్రోహమా!?

తెలంగాణ, ఏపీ రెండూ తనకు రెండు కళ్లు లాంటివని చంద్రబాబు అన్నారంటే.. దాని అర్థం సమానంగా చేసుకుంటాననే కదా.. అయితే, తెలంగాణలో టీడీపీని బతికించుకోవడం కోసం ఆ రాష్ట్రం కోరే అసంబద్ధ కోర్కెలకు అంగీకరిస్తారా బాబూ? పార్టీ పరంగా రెండు రాష్ట్రాలూ ముఖ్యమని చెప్పుకుంటే తప్పులేదు.. కానీ, సీఎంగా ఉండి తెలంగాణ కూడా నాకు సమానమంటే ఏపీకి ఏదో ద్రోహాన్ని తలపెట్టే ప్రమాదం కనిపిస్తోంది.

ఏపీ ఆస్తుల్లో తెలంగాణ వాటా అడగడంపై మౌనమెందుకు?

ఇక ఏపీకి సుమారు వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. ఇందులో తమకు వాటా కావాలని తెలంగాణ ప్రభుత్వం అడిగినట్లు అన్ని పత్రికల్లో, మీడియాలో వార్తలొచ్చాయి. టీటీడీ ఆదాయంలో 48 శాతం వాటా, అన్ని పోర్టుల్లోనూ వాటా, కృష్ణా జలాల్లోనూ వాటా కావాలని తెలంగాణ అడిగిందని వార్తలు వచ్చాయి. అంతేకాక.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి విభజన చట్టం ప్రకారం ఏడు మండలాలను ఏపీలో కలిపారని, వాటిని వెనక్కు ఇచ్చేయాలని అడిగినట్లు కూడా వార్తలొచ్చాయి. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, తెలంగాణ డిప్యూటీ సీఎం, మంత్రులెవరూ దీనిపై స్పందించలేదు. సమాధానం చెప్పకుండా వెళ్లారంటే ఇవన్నీ నిజమేనని అనుకోవాల్సి వస్తోంది. సీఎంల సమావేశానంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

పోలవరానికి చంద్రబాబు ద్రోహం..

పోలవరం విషయానికి సంబంధించి చట్టంలో ఏపీకి, ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు, తెలంగాణకు కొన్ని సమస్యలున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశాతో ఉన్న వివాదాలు వైఎస్ జగన్ చొరవవల్ల దాదాపు పరిష్కార దశకు వచ్చాయి. పోలవరంవల్ల ఒడిశాకు, ఛత్తీస్‌గఢ్‌కు ముప్పు సమస్య ఉత్పన్నం కాదని కోర్టులో సీడబ్ల్యూసీ అఫిడవిట్ కూడా ఇచ్చింది. కానీ, ఇవాళ చంద్రబాబు తెలంగాణతో కొత్త సమస్య తీసుకొచ్చారు. ఏడు మండలాలను ఏపీలోకి విలీనం చేయడం చట్టంలో ఉంది. కానీ, తెలంగాణ అడిగిందని ఇవాళ మళ్లీ వాటిని ఇచ్చేసేలా పరిస్థితులు వచ్చాయి. పోలవరానికి ద్రోహం చేసే కార్యక్రమం చంద్రబాబు చేస్తున్నారు. ఒకే అబద్ధాన్ని పదేపదే చెబితే నిజమవుతుందని నమ్మే చంద్రబాబు.. పోలవరం సంక్షోభంలోకి రావడానికి కారణం వైఎస్ జగన్ చేపట్టిన రివర్స్ టెండరింగ్ వల్లేనని తరచూ ఆరోపణలు చేస్తున్నారు. నిజానికి.. కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లనో, రివర్స్ టెండరింగ్ వల్లనో పోలవరం ప్రాజెక్టుకు నష్టం జరగలేదు. నష్టం జరిగిందల్లా చంద్రబాబు తెలివితక్కువతనం వల్లే. నదీ ప్రవాహాన్ని మళ్లించేలా పనులు పూర్తిచేయకుండా.. డయాఫ్రం వాల్ వేసి కాఫర్ డ్యామ్ నిర్మాణం ప్రారంభించడంవల్లే విధ్వంసం చోటుచేసుకుంది. ఆ తప్పును కప్పి పుచ్చుకునేందుకు రివర్స్ టెండరింగ్ నిర్వహించి కాంట్రాక్టర్‌ను మార్చారు. దీనివల్లే విధ్వంసం జరిగిందని చంద్రబాబు తరచూ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. అసలు పోలవరంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు. దానిపై వచ్చే డబ్బులపైనే ఆయనకు ధ్యాస ఉందని సాక్షాత్తూ ప్రధాని మోదీనే అన్నారు. చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోతే సామాన్యుడి గొంతుకై వైఎస్ జగన్ విజృంభిస్తారు. ఇక మహానేత వైఎస్ జయంతిని ఎవరైనా చేసుకోవచ్చు.

ఉమ్మడి రాజధాని నుంచి పారిపోయి ఎందుకొచ్చారు?

రాష్ట్రం విడిపోయి పదేళ్లయింది. విభజన సమస్యలు అనేకం అపరిష్కృతంగా మిగిలిపోయాయి. దానివల్ల రాష్ట్రానికి తీవ్రంగా నష్టం జరుగుతోందని అనేకసార్లు చంద్రబాబు వ్యాఖ్యానించారు. విభజనానంతరం ఏపీని చంద్రబాబు అయిదేళ్లు పాలించారు. హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉండే వెసులుబాటును సద్వినియోగం చేసుకోకుండా ఎందుకు పారిపోయి వచ్చారో చంద్రబాబు చెప్పాలి? ఓటుకు కోట్లు కేసులో తప్పుచేయడంతో చంద్రబాబును మెడపట్టి గెంటేశారు. ఆ కేసులో పీకల్లోతు కూరుకుపోయి భయంతో హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చి, రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేశారు. అలాగే, 9, 10వ షెడ్యూల్, విభజన చట్టంలో ఉన్న ఆస్తుల పంపకం చేసుకోకుండా, బేరసారాలు ఆడకుండా, చర్చలు జరపకుండా పారిపోయి వచ్చి కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రథమ ద్రోహం చేసిన వ్యక్తి చంద్రబాబే. హైదరాబాద్‌లో అన్ని ఆఫీసులను ఉన్నపళంగా ఖాళీచేసి.. ఇక్కడ తాత్కాలిక సెక్రటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు కట్టారు. అసలు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌కు పదేళ్ల సమయం ఉంటే ఎందుకు తాత్కాలిక కట్టడాలు కట్టారన్నది చంద్రబాబు చెప్పాలి. ఇప్పుడు మళ్లీ సీఎం అయి మరో అన్యాయం చేయడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు.

విభజన సమస్యలపై మాట్లాడారా?

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కొన్ని సమస్యలున్నాయి. చర్చల ద్వారా వాటిని పరిష్కరించుకోవాలి. కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వం ద్వారా లేదా న్యాయస్థానాల ద్వారా పరిష్కరించుకోవాలి. 9, 10వ షెడ్యూళ్లలో ఉన్న బిల్డింగులు, ఆస్తులు మనకు రావాల్సినవి ఉన్నాయి. రూ.7 వేల కోట్ల విద్యుత్ బకాయిలూ రావాలి. వాళ్లు ఇవ్వకపోతే మేం కేంద్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించాం. కేంద్రం ఆదేశించినా తెలంగాణ ఇవ్వలేదు. ఈ అంశం న్యాయస్థానాల్లో ఉంది. దాని గురించి చంద్రబాబు ఇప్పుడు మాట్లాడటంలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు రెండూ సరిహద్దుల్లో ఉన్నాయి. వాటికి సంబంధించిన సమస్యలపై చంద్రబాబు మాట్లాడారా? పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీళ్లు వెళ్లాలంటే 881 అడుగుల స్థాయిలో ఉంటే తప్ప వెళ్లవు. అక్కడిదాకా తెలంగాణ వాళ్లు నీళ్లను రానిస్తున్నారా? విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. శ్రీశైలంలో నీటిని తోడేస్తూ 881 అడుగుల స్థాయికి నీటిమట్టం రాకుండా చేస్తున్నారు. దీనివల్ల రాయలసీమ నష్టపోతోంది. ఈ సమస్య గురించి మాట్లాడారా చంద్రబాబూ? అలాగే, సాగర్‌లో కుడి కాలువకు నీళ్లు ఇవ్వాలంటే తెలంగాణ అనుమతి కావాలి. తాళాలు వాళ్ల దగ్గర ఉన్నాయి. మన ప్రాంతం కూడా వాళ్ల స్వాధీనంలోకి వెళ్లింది. చంద్రబాబు అసమర్థతవల్లే ఇలా వెళ్లింది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీస్ యాక్షన్ ద్వారా మనం స్వాధీనం చేసుకున్నాం. ఈ సమయంలో కేంద్ర హోం శాఖ జోక్యం చేసుకుని తొందరపడొద్దు.. మేం పరిష్కరిస్తాం అని హామీఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు అప్పగించింది. దీని గురించి ఏమైనా చంద్రబాబు మాట్లాడారా? ఇక పోలవరంలో 45.72 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వచేస్తే భద్రాచలం మునిగిపోతుందని ఇంతకుముందు తెలంగాణ మంత్రులు మాట్లాడారు. ఇది కరెక్టు కాదు. దీని గురించి ఏమైనా చర్చించారా? డ్రగ్స్ గురించి మాట్లాడటానికి ఇంతమంది వెళ్లాలా చంద్రబాబూ? ఏదీ దొరక్క ఆ అంశాన్ని తెరపైకి తెచ్చారా? విభజన చట్టంలో పొందుపర్చిన ప్రత్యేక హోదా కోసం నల్ల దుస్తులు వేసుకుని అసెంబ్లీలో హడావుడి చేశారే.. ఇప్పుడు మీ మీద ఆధారపడేలా కేంద్ర ప్రభుత్వం వచ్చినా హోదా అడిగేందుకు ఎందుకు భయపడుతున్నారు బాబూ?

టీడీపీ నేతల బరితెగింపు

- పచ్చ నేతల చేతుల్లోకి 30 రేషన్ షాపులు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలూ వారికే
- డ్వాక్రా యానిమేటర్లను కూడా తొలగించాలని ఒత్తిడి
- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో అరాచకం

ప్రొద్దుటూరు: అధికారమే అండగా టీడీపీ నేతలు బరితెగిస్తున్నారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో రేషన్ షాపులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, వాచ్‌మెన్‌లు, మహిళా సంఘాల్లో యానిమేటర్ల తొలగింపు ఇలా అన్నిటిలోనూ జోక్యం చేసుకుంటున్నారు. పట్టణంలో డీలర్ ఎరికలరెడ్డి సుమారు 40 ఏళ్లకుపైగా ఏ పార్టీతో సంబంధం లేకుండా రేషన్ షాపు నిర్వహిస్తున్నారు. ఈ రేషన్ షాపు తమకు అప్పగించాలని ఆయనకు హుకుం జారీ చేశారు. అలాగే చౌడూరుకు చెందిన డీలర్ పులి వెంకటసుబ్బారెడ్డికి 33 ఏళ్లుగా రేషన్ షాపు ఉంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఈయన షాపుపై కూడా కన్నేశారు. తమకు అప్పగించాలని డిమాండ్ చేసినా డీలర్ అంగీకరించలేదు. దీంతో అధికారులను పంపి ఆయన షాపులో తనిఖీలు చేయించారు. అయితే ఏ తప్పూ ఈ తనిఖీల్లో బయటపడలేదు. గోపవరంకు చెందిన మరో డీలర్ పరిస్థితి కూడా అచ్చం ఇలాగే ఉంది. టీడీపీ నేతల ఆదేశాలతో రెవెన్యూ అధికారులు డీలర్లను హెచ్చరిస్తున్నారు. టీడీపీ ముఖ్య నాయకుడి నుంచి ఫోన్ వచ్చిందని, మీరంతకు మీరే ఈ పాస్ మిషన్, కాటా ఇచ్చి వెళతారా.. లేకుంటే తాము వచ్చి కేసు నమోదు చేయాలా అని బెదిరిస్తున్నారు. ఉప్పాగుకు చెందిన మహిళా డీలర్‌ను ఇదే విధంగా బెదిరించారు. ఇప్పటివరకు ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సుమారు 30 రేషన్ షాపులను నిర్వాహకులకు తెలియకుండానే టీడీపీ కార్యకర్తలకు అధికారులు కట్టబెట్టేశారు. టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి కుడి, ఎడమ భుజాలుగా పనిచేసిన ముఖ్య నేతలు రెండేసి రేషన్ షాపులు దక్కించుకున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్చేశారు..

టీడీపీ నేతలు కేవలం రేషన్ షాపులనే కాదు.. ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్, వైఎమ్‌ఆర్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీలను కూడా బలవంతంగా దక్కించుకున్నారు. ఇప్పటికే వాటిని నిర్వహిస్తున్నవారిని బెదిరించి తరిమేశారు. మరికొన్నింటిని కూడా దక్కించుకునే పనిలో ఉన్నారు. అలాగే కల్లూరులో మధ్యాహ్న భోజన ఏజెన్సీ పరిధిలో పనిచేస్తున్న ఆయాను తొలగించారు. మిగతా గ్రామాల్లోనూ తమ దౌర్జన్యాలను కొనసాగిస్తున్నారు.

యానిమేటర్ల తొలగింపునకు రంగం సిద్ధం

టీడీపీ నేతల ఒత్తిడితో డ్వాక్రా సంఘాలకు సంబంధించి ఇప్పటికే అధికారులు ఇద్దరు యానిమేటర్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. వీటిని టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా అధికారులు సమావేశాలు నిర్వహించి తీర్మానం ద్వారా ఉన్న వారిని తొలగించడం, కొత్తవారిని తీసుకోవడం చేయాల్సి ఉంటుంది. అయితే అధికారం అండతో టీడీపీ నేతలు పేట్రేగిపోతుంటే.. అధికారులు వారికి జీహుజూర్ అంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్సార్ ఓ చెరగని ముద్ర



మాట్లాడుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, వేదికపై నేతలు

- వైఎస్సార్ జయంతి వేడుకల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- సోనియా లేఖ ద్వారా, రాహుల్ వీడియో ద్వారా సందేశాలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సంక్షేమ, అభివృద్ధికర పాలనతో ప్రజల్లో చెరగని ముద్ర వేశారని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అప్పట్లో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా సభలో ఆయన వ్యవహరించిన తీరు తమకు ఆదర్శంగా ఉండేదని తెలిపారు. కొత్త సభ్యులు మాట్లాడుతున్నప్పుడు సభలో వైఎస్ కూర్చొనే వారని, అదే నిజమైన నాయకుడి లక్షణమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలో జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంక్షేమ పథకాల సృష్టికర్త వైఎస్సార్ జ్ఞాపకాలు పేదవాళ్ళ గుండెల్లో రోజురోజుకు బలపడుతున్నాయని తెలిపారు. ఏపీలో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని అన్నారు. ఈరోజు తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్నానంటే వైఎస్సార్ చలవేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. జలయజ్ఞం కోసమే తన జీవితం అని వైఎస్సార్ అనేవారని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో వైఎస్‌కు స్మృతివనం కట్టాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఆ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాకూర్, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, ఉండవల్లి అరుణ్‌కుమార్, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ పాదయాత్రే స్ఫూర్తి : రాహుల్

కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ లేఖ ద్వారా సందేశం పంపగా, రాహుల్ గాంధీ వీడియో సందేశం పంపారు. తన జోడో యాత్రకు వైఎస్ పాదయాత్రే స్ఫూర్తి అని రాహుల్ తెలిపారు. వైఎస్ వారసత్వాన్ని ఆయన కుమార్తె షర్మిల ముందుకు తీసుకెళతారని సోనియా అన్నారు.

వైఎస్సార్‌సీపీ ఉపసర్పంచ్ ఇంటిపై రాళ్లదాడి

పెండ్లిమర్రి: వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం వెల్లటూరు పంచాయితీ శవాస్కన్‌పల్లెలో ఆదివారం రాత్రి కోలాటం వద్ద మైక్ సౌండ్ తగ్గించమన్న వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ వారు దాడిచేశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ముగ్గురు గాయపడ్డారు. అనంతరం టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ ఉప సర్పంచ్ నాగార్జునరెడ్డి ఇంటిపై రాళ్లదాడి చేశారు. రాళ్లు విసిరి ఇంటి ముందుభాగంలో ఉన్న అద్దాలు, పైపులు, రెండు బైక్‌లను ధ్వంసం చేశారు. గాయపడినవారిని కడప రిమ్స్‌కు తరలించారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

టీడీపీ, జనసేన దాడులపై ఎస్పీకి ఫిర్యాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు బాలరాజు, సునీల్‌కుమార్ తదితరులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమపాలన ఎలా అందించాలో చూసుకోవాలని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ నేత కారుమూరి సునీల్‌కుమార్ హితవు పలికారు. మేనిఫెస్టోలోని హామీలను పక్కాగా అమలు చేయటం చేతగాని నాయకులు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. కొంతకాలంగా ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ, జనసేన దాడులు చేయటంపై వారు సోమవారం ఎస్పీ డి.మేరీ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరులో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ క్యాడర్‌పై దాడులకు పాల్పడిన టీడీపీ, జనసేన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చర్యకు ప్రతిచర్య ఉంటుందనే విషయాన్ని టీడీపీ నేతలు మర్చిపోవద్దని హెచ్చరించారు.

పిఠాపురంలో దుకాణాల కూల్చివేత

- మునిసిపల్ అధికారుల అత్యుత్సాహం



దుకాణాన్ని కూల్చేస్తున్న పొక్లెయిన్

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో అధికారులు సోమవారం అత్యుత్సాహం ప్రదర్శించారు. ముందస్తు నోటీసులు, ఎలాంటి హెచ్చరికలు చేయకుండా హడావుడిగా దుకాణాలను కూల్చివేశారు. కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆధ్వర్యంలో పిఠాపురంలో సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పంట కాలువలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని వెంటనే తొలగించాలంటూ కొంతమంది రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన పిఠాపురం మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సాయంత్రానికే హుటాహుటిన ఆక్రమణలను తొలగించేశారు. వాస్తవానికి అక్కడ చిన్నచిన్న బడ్డీ కొట్లు పెట్టుకుని సుమారు 15 మంది నిరుపేదలు జీవనం సాగిస్తున్నారు. కూల్చేయడంపై దుకాణదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

ఆగిరిపల్లిలో వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ దాడి



షామియానా దుకాణంలో టీడీపీ కార్యకర్తలు విరగ్గొట్టిన కుర్చీలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో ఆదివారం రాత్రి టీడీపీ నేతలు రెచ్చిపోయారు. ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపి, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావుపై దాడిచేశారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా సాదం గోపి, చిమట శ్రీనివాసరావు స్థానిక పొగడచెట్ల మండపం వద్ద ఆదివారం రాత్రి బ్యానర్లు కడుతున్నారు. టీడీపీ నాయకులు కాజా కిషోర్, రాణిమేకల మల్లేశ్వరరావు 40 మందితో కలిసి అక్కడికి చేరుకుని బ్యానర్ కట్టడానికి వీల్లేదని వాటిని చించేసి వారిపై దాడిచేశారు. తరువాత శ్రీనివాసరావు షామియానా దుకాణంపై దాడిచేసి సామగ్రి ధ్వంసం చేశారు. గాయపడిన ఎంపీటీసీ సభ్యుడు గోపి, చిమట శ్రీనివాసరావు నూజివీడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

గుంటూరు డిప్యూటీ మేయర్ కార్యాలయం ధ్వంసం



గుంటూరు ఈస్ట్ : గుంటూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు కార్యాలయంపై టీడీపీకి చెందిన దుండగులు సోమవారం సాయంత్రం దాడి చేసి, ధ్వంసం చేశారు. ఈమేరకు బాలవజ్రబాబు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంటూరు డొంకరోడ్డుకు చెందిన రౌడీషీటర్ పోలినేని మధు, నరేష్ తన కార్యాలయంపై దాడి చేసినట్లు సీసీ టీవీల్లో కనిపించిందని బాలవజ్రబాబు ఫిర్యాదులో తెలిపారు. గుంటూరు మల్లికార్జునపేట 5వ లైనులో ఉన్న తన కార్యాలయానికి వారిద్దరూ ద్విచక్రవాహనంపై వచ్చారన్నారు. మెయిన్ గేటు తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించారని, మెయిన్ డోర్ తాళాలను రాళ్లతో పగులగొట్టి లోపలకు ప్రవేశించారని తెలిపారు. కార్యాలయం కిటికీ అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఆ సమయంలో మధు ఎవరికో ఫోన్ చేసి ధ్వంసం చేసిన విషయాన్ని చెప్పాడని తెలిపారు. పోలీసులు మధు కాల్‌డేటాను పరిశీలించి ఎవరి ప్రోద్బలంతో తన కార్యాలయాన్ని ధ్వంసం చేశారో తెలుసుకోవాలని బాలవజ్రబాబు ఫిర్యాదులో కోరారు. ఈ ఘటనకు పాల్పడిన ఇరువురిని, వెనుక ఉన్న వ్యక్తుల్ని కఠినంగా శిక్షించాలని కోరారు.

సిమెంట్ కర్మాగారం ముట్టడి

- ట్రాక్టర్‌తో గేట్‌ను ఢీకొట్టి లోపలికి ప్రవేశించిన గ్రామస్తులు
- అడ్మినిస్ట్రేషన్ భవనంలో సామగ్రి ధ్వంసం
- పోలీసుల లాఠీచార్జ్ ఐదుగురికి గాయాలు
- బాధితులు, గ్రామస్తులతో కలెక్టర్ చర్చలు
- మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల చెక్కు అందజేత



సిమెంట్ కర్మాగారం లోపలికి వెళ్లిన గ్రామస్తులు

బూదవాడ (జగ్గయ్యపేట) : ఎన్టీఆర్ జిల్లా బూదవాడ గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో ఆదివారం జరిగిన బాయిలర్ పేలుడు ప్రమాద ఘటనలో గ్రామానికి చెందిన ఆవుల వెంకటేష్ మృతితో పాటు మరికొందరు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా యాజమాన్యం కనీసం స్పందించకపోవడంపై గ్రామస్తులు తీవ్ర స్థాయిలో స్పందించారు. రెండోరోజైన సోమవారం గ్రామస్తులు.. బాధితుల కుటుంబ సభ్యులు మెయిన్ గేట్‌వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అక్కడ పోలీసులు నిలువరించినప్పటికీ ట్రాక్టర్లతో మెయిన్ గేట్‌ను ఢీకొట్టి లోపలికి దూసుకెళ్లారు. అడ్మినిస్ట్రేషన్ భవనం వైపునకు వెళ్లి కర్రలు, రాళ్లు, ఇనుప రాడ్లతో సామగ్రిని ధ్వంసం చేసి కంప్యూటర్లను పగలగొట్టారు. కార్యాలయంలోని విలువైన రికార్డులను చించేశారు. దీంతో పోలీసులు వారిని కట్టడి చేసేందుకు లాఠీచార్జి చేయడంతో వారంతా శాంతించారు. ఈ సందర్భంగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

కర్మాగారంలో కలెక్టర్ చర్చలు..

గ్రామస్తులు కర్మాగారాన్ని ముట్టడించడంతో సమాచారం అందుకున్న కలెక్టర్ సృజన తెలంగాణ గేటులో నుంచి లోపలికి వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న గ్రామస్తులు, ఆదివారం రాత్రి మృతిచెందిన వెంకటేష్ కుటుంబ సభ్యులతో ఆమె చర్చలు జరిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఘటన జరిగిందని మూడు నెలలుగా బాయిలర్ మరమ్మతులు చేపట్టాలని చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. అలాగే, ప్రమాదం



గ్రామస్తులు ధ్వంసం చేసిన అడ్మినిస్ట్రేషన్ భవనంలోని సామగ్రి

జరిగి రెండు గంటలైనా యాజమాన్యం స్పందించకపోవడంతో తామే క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించామని తెలిపారు. వైద్య శిబిరం కూడా ఏర్పాటుచేయటంలేదని సీఎస్ఆర్ ఫండ్‌తో గ్రామాన్ని అభివృద్ధిచేయాలని.. మృతుని కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని.. క్షతగాత్రులకు రూ.25 లక్షల ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ.. ఈ ప్రమాదంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబానికి కంపెనీ యాజమాన్యం రూ.50 లక్షలు నష్టపరిహారం అందిస్తుందని.. చికిత్స పొందుతున్న వారికి రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.ఐదు లక్షలు నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. మృతుని కుటుంబంలోని ఒకరిని కంపెనీలో ఉద్యోగంతో పాటు పిల్లలను కంపెనీ పాఠశాలలో చదివించనున్నట్లు చెప్పారు. అనంతరం.. యాజమాన్యం నుంచి ప్లాంట్ హెడ్ సతీష్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ చేతుల మీదుగా కలెక్టర్ రూ.50 లక్షల చెక్కును మృతుని భార్య త్రివేణికి అందించారు. ఈ కార్యక్రమంలో జేసీ సంపత్‌కుమార్, ఆర్డీఓ రవీంద్ర, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి రాఘవేంద్ర నాయక్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగానే క్షతగాత్రుల పరిస్థితి..

ఇదిలా ఉంటే.. పేలుడు ధాటికి గాయపడిన దారావత్ శివనారాయణ, గుగులోతు గోపి నాయక్, పరిటాల అర్జున్, బాణావత్ స్వామిల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. 90 శాతం శరీరం కాలిపోవటంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



పాపులర్ ఫ్రంట్ నేత జీన్ లుక్

సంకీర్ణమా... సంక్షోభమా?

ఫ్రాన్స్ ఎన్నికల్లో హంగ్



- రైటిస్ట్ కూటమికి ఎదురుదెబ్బ.. 143 సీట్లతో మూడో స్థానం
- లెఫ్ట్ కూటమికి 193, అధికార కూటమికి 164
- సంకీర్ణం ఏర్పాటుపై ప్రస్తుతానికి అస్పష్టతే
- 10 రోజుల్లోగా స్పష్టత వచ్చే అవకాశం

పారిస్: ఫ్రాన్స్ ముందస్తు ఎన్నికల్లో నేషనల్ ర్యాలీ పార్టీ సారథ్యంలోని అతివాద కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. పార్లమెంటు దిగువ సభ నేషనల్ అసెంబ్లీకి జూన్ 30న జరిగిన తొలి రౌండ్ ఎన్నికల్లో గెలిచిన ఆ కూటమి ఆదివారం కీలకమైన రెండో రౌండ్ పోలింగ్‌లో చేతులెత్తేసింది. 577 స్థానాలకు గాను 143 సీట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. సోమవారం వెలువడ్డ ఫలితాల్లో ఏ కూటమికీ మెజారిటీ రాలేదు. తొలి రౌండ్ పరాజయం నేపథ్యంలో వామపక్ష న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)తో అవగాహనకు రావడం అధికార సెంట్రిస్ట్ కూటమికి కలిసొచ్చింది. మెజారిటీ స్థానాల్లో అవి ఒకే అభ్యర్థిని నిలపడంతో నేషనల్ ర్యాలీ కూటమి జోరుకు కళ్లెం పడింది. ముఖ్యంగా మెరీన్ లీ పెన్ సారథ్యంలోని నేషనల్ ర్యాలీ కూటమి ఫాసిస్టు ఎజెండాకు ప్రత్యామ్నాయంగా సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ తదితరాలతో ముందుకొచ్చిన ఎన్‌పీఎఫ్ అతి పెద్ద కూటమిగా అవతరించింది. దానికి 193 సీట్లు రాగా సెంట్రిస్ట్ కూటమి 164 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. ఎవరికీ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 289 సీట్లు రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. దాంతో ఎన్‌పీఎఫ్‌తో కలిసి మాక్రాన్ కూటమి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదా, లేక పరిస్థితి రాజకీయ సంక్షోభం దిశగా వెళ్తుందా అన్నది ఆసక్తిగా మారింది. ప్రధాని పదవి కోసం ఎన్‌పీఎఫ్ పట్టుబడుతుండటం, ఆ కూటమిలోని అతివాద పార్టీలతో అధికారం పంచుకునేందుకు మాక్రాన్ సుముఖంగా లేకపోవడం వంటివి కారణం. దీనికి తోడు ఎన్‌పీఎఫ్‌లోనూ కీచులాటలున్నాయి. ఫ్రాన్స్ లో దశాబ్దాలుగా ఏక పార్టీ పాలనే సాగుతూ వస్తోంది. నేషనల్ ర్యాలీకి ఆశించిన ఫలితాలు రాకపోయినా 2022 ఎన్నికల్లో కేవలం 89 సీట్లు సాధించిన కూటమి బలం ఈసారి గణనీయంగా పెరిగింది. ఫలితాలు తమకు ఎదురుదెబ్బ కాదని, తమ విజయం వాయిదా మాత్రమే పడిందని లీ పెన్ అన్నారు.



పాలక సెంట్రిస్ట్ కూటమి చీఫ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

అప్పుడే కీచులాటలు


ఫలితాల నేపథ్యంలో ప్రధాని గేబ్రియెల్ అటల్ సోమవారం రాజీనామా చేశారు. దాన్ని మాక్రాన్ తిరస్కరించారు. ఫ్రాన్స్ ఆతిథ్యమిస్తున్న ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌కు మూడు వారాలే ఉండటంతో తాత్కాలికంగా పదవిలో కొనసాగాలని కోరారు. అందుకు అటల్ సిద్ధంగా ఉన్నా ఎన్‌పీఎఫ్ మాత్రం అధికారం చేతులు మారాల్సిందేనని పట్టుబడుతోంది. ప్రజాభీష్టాన్ని గౌరవించి తమనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని, ప్రధాని పదవి తమకే చెందాలని వామపక్ష నేత జీన్ లూక్ మెలెన్‌చోన్ డిమాండ్ చేశారు. అదే జరిగితే అధ్యక్షుడు, ప్రధాని వేర్వేరు పార్టీల నుంచి ఉండటం ఫ్రాన్స్‌లో 22 ఏళ్లలో ఇదే తొలిసారి అవుతుంది. పలు అధికారాలను కూడా ప్రధానితో మాక్రాన్ పంచుకోవాల్సి ఉంటుంది. దీన్ని కో హాబిటేషన్‌గా పిలుస్తారు. దేశ చరిత్రలో ఇలాంటి సందర్భాలు ఇప్పటికి మూడుసార్లు వచ్చాయి. పలు మాక్రాన్ సంస్కరణలకు చరమగీతం పాడతామని, అత్యంత వ్యయ ప్రయాసలతో కూడిన ప్రజా వ్యయ పథకాన్ని తెస్తామని, ఇజ్రాయెల్‌పై కఠిన వైఖరి అవలంబిస్తామని ఎన్‌పీఎఫ్ ఇప్పటికే స్పష్టం చేయడంతో సంకీర్ణం ఏర్పాటు, మనుగడపై సందేహాలు తలెత్తుతున్నాయి. దీనికి తోడు ఎన్‌పీఎఫ్ భాగస్వాముల్లో అతివాద వామపక్షమైన ఫ్రాన్స్ అన్‌బౌడ్‌తో కలిసి పని చేయబోమని మాక్రాన్ ఇప్పటికే ప్రకటించారు. సోషలిస్టులు, గ్రీన్స్‌తో భాగస్వామ్యానికి మొగ్గుతున్నారు. కానీ కొన్ని పక్షాలను పక్కన పెట్టేందుకు ఎన్‌పీఎఫ్ కూటమి అంగీకరించకపోవచ్చంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా నూతన జాతీయ అసెంబ్లీని జూలై 18న సమావేశపరుస్తానని మాక్రాన్ ప్రకటించారు. నాటో భేటీ కోసం బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఆయన అమెరికాలో పర్యటించనున్నారు. తిరిగొచ్చాక సంకీర్ణ ఏర్పాటుపై ఎన్‌పీఎఫ్‌తో చర్చలుంటాయని భావిస్తున్నారు. హంగ్ ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ పడిపోయింది. యూరో విలువ కూడా 0.2 శాతం పడిపోయింది.

ప్రధానీ పవర్‌ఫుల్లే...

ఫ్రాన్స్‌లో 1958 నుంచి సెమీ ప్రెసిడెన్షియల్ పాలన వ్యవస్థ అమల్లో ఉంది. దీన్ని ఫిఫ్త్ రిపబ్లిక్‌గా పిలుస్తారు. ఇందులో అధ్యక్షునితో పాటు పార్లమెంటుకూ విశేషాధికారాలు ఉంటాయి. 1962 నుంచి అధ్యక్షుడిని ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా నేరుగా ఎన్నుకుంటున్నారు. ఆయనే దేశాధిపతిగా, సాయుధ దళాల కమాండర్‌గా వ్యవహరిస్తారు. విదేశాంగ విధానం, రక్షణ విషయాలపై సర్వాధికారాలు ఆయనవే. ప్రధాని సిఫార్సు మేరకు కేబినెట్‌ను నియమిస్తారు. దేశీయ నిర్ణయాలన్నీ ప్రధాని నేతృత్వంలోని పార్లమెంటు తీసుకుంటుంది. ఆయనను అధ్యక్షుడు తొలగించలేరు. రాజీనామాను అభ్యర్థించవచ్చు. రాజ్యాంగాన్ని, చట్టాలను ఉల్లంఘిస్తే మూడింట రెండొంతుల మెజారిటీతో అధ్యక్షున్ని పార్లమెంటు అభిశంసించవచ్చు.



అతివాద నేషనల్ ర్యాలీ కూటమి సారథి మెరీన్ లీ పెన్



ఫలించని ముందస్తు...

నేషనల్ అసెంబ్లీ పదవీకాలం 2027 దాకా ఉంది. కానీ జూన్ 9న యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో నేషనల్ ర్యాలీ చేతుల్లో మాక్రాన్ కూటమి ఘోర పరాజయం చవిచూసింది. దీనికితోడు ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న నేరాలు తదితరాలతో మాక్రాన్ నాయకత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. వీటన్నింటి నేపథ్యంలో మాక్రాన్ ముందస్తుకు వెళ్లారు. ఎన్నికల తేదీలు ప్రకటించగానే, సోషలిస్టులు, ఎకాలజిస్టులు, కమ్యూనిస్టులు, ఫ్రాన్స్‌అన్‌బౌడ్ వంటివి కలిసి కలిసి ఎన్‌పీఎఫ్‌గా ఏర్పడ్డాయి. నేషనల్ ర్యాలీ కూటమిని ఓడించడమే లక్ష్యంగా చాలాచోట్ల ఎన్‌పీఎఫ్, సెంట్రిస్ట్ అభ్యర్థుల్లో ఎవరో ఒకరు తప్పుకుని ఓట్ల చీలికను నివారించారు. ఫలితంగా నేషనల్ ర్యాలీని నిలువరించినా మాక్రాన్ కూటమికి ఆయన ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదు.

దేశవ్యాప్త హింస...

ఎన్నికల్లో ఆధిక్యం నేపథ్యంలో ఎన్‌పీఎఫ్ మద్దతుదారులు వీధుల్లోకొచ్చి సంబరాలు చేసుకున్నారు. పారిస్‌లోని ప్లేస్ డి లా రిపబ్లిక్ వద్ద వేలాదిగా గుమిగూడారు. ఈ క్రమంలో వారికి, నేషనల్ ర్యాలీ అభిమానులకు ఘర్షణ చోటుచేసుకుంది. దాంతో పారిస్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు నగరాల్లో హింస చెలరేగింది. మాస్కులు ధరించిన నిరసనకారులు పారిస్ వీధుల్లో పరుగులు తీశారు. కొన్నిచోట్ల ఆస్తులను తగలబెట్టారు. రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఒలింపిక్స్‌పై ప్రభావమెంత?

హంగ్ ఫలితాలతో ఫ్రాన్స్‌లో రాజకీయ అస్థిరత నెలకొనడంతో జూలై 26 నుంచి జరగాల్సిన పారిస్ ఒలింపిక్స్‌పై దాని ప్రభావం ఎలా ఉంటుందన్న చర్చ జోరందుకుంది. అవి పూర్తయేదాకా పదవిలో కొనసాగేందుకు ప్రధాని అటల్ సుముఖంగా ఉన్నా ఆలోపే కొత్త ప్రధాని రావాల్సిందేనని అత్యధిక స్థానాలు సాధించిన లెఫ్ట్ కూటమి పట్టుబడుతోంది. ఒలింపిక్స్ భద్రత వ్యవహారాలు చూసుకునే కీలకమైన అంతర్గత భద్రత శాఖ మంత్రి గెలాల్డ్ డ్రమానియన్ కొనసాగడంపైనా సందిగ్ధతే కొనసాగుతోంది. ఒలింపిక్స్‌ను ఫ్రాన్స్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఏడేళ్లుగా భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. తాత్కాలిక స్టేడియాలు, మౌలిక సదుపాయాలు తదితరాలపై ఇప్పటికే 260 కోట్ల డాలర్లకు పైగా వెచ్చించింది. ఏర్పాట్లన్నీ దాదాపుగా పూర్తయినట్టేనని, ఒలింపిక్స్ నిర్వహణకు ఇబ్బందేమీ ఉండబోదని మాక్రాన్ ప్రభుత్వం చెబుతోంది. వాటి పర్యవేక్షణకు ఇబ్బంది ఉండకూడదనే అటల్ రాజీనామాను మాక్రాన్ ఆమోదించలేదని సమాచారం.

ఏం జరగవచ్చు?

సంకీర్ణ ఏర్పాటు సాధ్యపడని పక్షంలో రోజువారీ వ్యవహారాలను నడిపేందుకు ఏ పార్టీలకు చెందని నిపుణులతో కూడిన ప్రభుత్వాన్ని మాక్రాన్ ఏర్పాటు చేసే వీలుంది. అయితే దేనికైనా పార్లమెంటు అనుమతి తప్పనిసరి. అధ్యక్షునిగా మాక్రాన్ పదవీకాలం 2027 దాకా ఉంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ఆలోపు తప్పుకోబోనని ఆయన ఇప్పటికే ప్రకటించారు.

మాస్కోలో మోదీ



మోదీ, పుతిన్ ఆత్మీయ ఆలింగనం

- నేడు పుతిన్‌తో మోదీ చర్చలు
- 22వ ఇండో–రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సుకు సిద్ధమైన అగ్రనేతలు

మాస్కో/న్యూఢిల్లీ: భారత్, రష్యాల మైత్రీ బంధాన్ని నూతన సమున్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా ప్రధాని మోదీ రెండ్రోజుల రష్యా పర్యటన ఆరంభమైంది. 22వ ఇండో–రష్యా శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు మోదీ సోమవారం రష్యాకు విచ్చేశారు. మంగళవారం ఉదయం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధాని మోదీ అల్పాహారం అనంతరం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. విస్తృతస్థాయి చర్చలు జరపనున్నారు. తర్వాత దౌత్య, అధికారిక బృందాలతో కలిసి వార్షిక శిఖరాగ్ర సదస్సులో ఇరుదేశాల మధ్య పటిష్ఠ మైత్రి, సహకార బంధంపై సమగ్ర, లోతైన చర్చలు జరపనున్నారు. ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించిన అంశం చర్చకొచ్చే అవకాశముంది. రష్యా సైన్యంలో సహాయక సిబ్బందిగా భారతీయులను రిక్రూట్ చేసుకుని ఉక్రెయిన్ యుద్ధక్షేత్రాలకు తరలించిన ఉదంతాలు చర్చకొచ్చే అవకాశముంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక మోదీ రష్యాకు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

మోదీకి పుతిన్ విందు...

మాస్కో శివారులోని నోవో–ఒగార్యోవో అధికార నివాసంలో మోదీని పుతిన్ సాదరంగా ఆహ్వానించారు. ఆప్యాయంగా ఇరునేతలూ హత్తుకున్నారు. ఈ సందర్భంగా రాత్రి మోదీకి పుతిన్ ప్రత్యేక విందు ఇచ్చారు. మోదీ పాలనలో భారత్ సాధించిన అభివృద్ధిని పుతిన్ ఈ సందర్భంగా కొనియాడారు. అంతకుముందు మాస్కో విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి రష్యా మొదటి ఉపప్రధాని డెనిస్ మాన్‌ట్సురోవ్ సాదర స్వాగతం పలికారు. అక్కడే మోదీ రష్యా సైనికుల సైనికవందనం స్వీకరించారు. ది కార్ల్‌టన్ హోటల్‌లో మోదీకి పెద్దసంఖ్యలో భారత సంతతి ప్రజలు స్వాగతం పలికారు. హిందీ పాటలకు భారతీయులు, రష్యా కళాకారులు నృత్యంచేస్తూ మోదీని ఆనందంలో ముంచెత్తారు. 'ఇప్పుడే మాస్కో నేలపై అడుగుపెట్టా. మిత్రుడు పుతిన్‌తో భేటీకి ఎదురుచూస్తున్నా. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోబోతున్నా. ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతల స్థాపనకు ఇరువురం మా వంతు కృషిచేస్తాం'' అని మోదీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.



మణిపూర్ రాష్ట్రం చురాచంద్‌పూర్‌లోని శిబిరంలో బాలలతో రాహుల్ గాంధీ

మోదీజీ.. మణిపూర్‌కు రండి

- ఇక్కడి వారి కష్టాలను స్వయంగా వినండి
- ప్రధానికి రాహుల్ విజ్ఞప్తి
- బాధితులను ఓదార్చిన విపక్షనేత

ఇంఫాల్: జాతుల మధ్య వైరంతో కొన్ని నెలల క్రితం రావణకాష్టంగా రగిలిపోయిన మణిపూర్‌కు ప్రధాని మోదీ ఒక్కసారి సందర్శించి ఇక్కడి వారి కష్టాలను అర్థంచేసుకోవాలని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ విజ్ఞప్తిచేశారు. సోమవారం మణిపూర్‌లోని జిరిబామ్, చురాచాంద్‌పూర్ జిల్లాల్లో ఘర్షణల్లో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను రాహుల్ పరామర్శించారు. బీజేపీపాలిత రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో పలు శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న వారిని ఓదార్చారు. వారి బాగోగులను అడిగి తెల్సుకున్నారు. '' సోదరుడిగా ఇక్కడికొచ్చా. మీ బాధలు, కష్టాలు వింటా. ఇక్కడ శాంతి నెలకొనాల్సిన సమయం వచ్చింది. హింస ప్రతి ఒక్కరినీ బాధిస్తోంది. వేల కుటుంబాలు కష్టాలబారిన పడ్డాయి. ఆస్తుల విధ్వంసం కొనసాగింది. అమాయక జనం తమ కుటుంబసభ్యులను కోల్పోయారు. దేశంలో మరెక్కడా ఇంతటి దారుణాలు చోటుచేసుకోలేదు. మణిపూర్‌లో మళ్లీ శాంతియుత వాతావరణం నెలకొనేందుకు, మీకు బాసటగా నిలిచేందుకు, మీ సోదరుడిగా వచ్చా'' అని బాధిత కుటుంబాలతో రాహుల్ అన్నారు. బాధితులను కలిశాక పత్రికా సమావేశంలో మాట్లాడారు. '' మణిపూర్‌లో ఏం జరుగుతోందో ప్రధాని మోదీకి తెలియాలి. అందుకోసం ఇక్కడికి రండి. ఇక్కడ ఏం జరుగుతోందో తెల్సుకోండి. ప్రజల కష్టాలు వినండి'' అని పరోక్షంగా మోదీకి విజ్ఞప్తి చేశారు.

గవర్నర్‌తో భేటీ

రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉయికేను సైతం రాహుల్ కలిశారు. రాష్ట్రంలో పరిస్థితి ఇంకా సద్దుమణకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.

క్షిపణులతో విరుచుకుపడ్డ రష్యా

- కీవ్‌లోని పిల్లల ఆస్పత్రిపైనా దాడి
- 31 మంది మృతి.. 154 మందికి గాయాలు

కీవ్: దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. సోమవారం ఉదయం నుంచి పలు నగరాల్లోని మౌలిక వనరులు, విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా వివిధ రకాలైన 40 వరకు క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో కనీసం 31 మంది చనిపోగా మరో 154 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. కీవ్‌లోని చిన్నారుల ఆస్పత్రి సహా పలు నివాస ప్రాంతాలపై క్షిపణులు పడటంతో భారీగా పేలుళ్లు సంభవించాయి. పలు చోట్ల మంటలు వ్యాపించాయి. రాజధాని కీవ్‌లోని 10 జిల్లాలకు గాను ఏడు జిల్లాల్లో జరిగిన దాడుల్లో 14 మంది చనిపోగా పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. మూడంతస్తుల నివాస భవనం పూర్తిగా ధ్వంసమైంది. మరో నగరం క్రివ్యీ రిహ్‌లో 10 మంది ప్రాణాలు కోల్పోగా మరో 47 మంది గాయపడ్డారు. కీవ్‌లోని రెండంతస్తుల చిన్నారుల ఆస్పత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ఆపరేషన్ థియేటర్, ఆంకాలజీ విభాగం దెబ్బతిన్నాయి. ఆస్పత్రిలోని పదంతస్తుల ప్రధాన భవనం కిటికీలు, తలుపులు ధ్వంసమయ్యాయి. ఘటన నేపథ్యంలో ఆస్పత్రిలో వారందరినీ ఖాళీ చేయిస్తున్నారు. ఆస్పత్రిపై దాడిలో ఏడుగురు చిన్నారులు సహా 16 మంది గాయపడినట్లు మేయర్ విటాలి క్రిట్స్‌కో చెప్పారు. ప్రాణ నష్టం వివరాలు తెలియాల్సి ఉందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా ప్రయోగించిన క్షిపణుల్లో ధ్వని కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణించగల హైపర్‌సోనిక్ కింఝాల్ మిస్సైళ్లు కూడా ఉన్నాయని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. మొత్తం 40 క్షిపణుల్లో 30 వరకు కూల్చివేశామని, వీటిలో కింఝాల్ రకానివి 11 ఉన్నాయని పేర్కొంది. ఉక్రెయిన్‌కు మరింత సాయం అందించేందుకు గల అవకాశాల్ని పరిశీలించేందుకు వాషింగ్టన్‌లో నాటో దేశాలు మంగళవారం భేటీ అవుతున్న వేళ రష్యా భారీ దాడులకు పూనుకుందని పరిశీలకులు చెబుతున్నారు. కాగా, ఆస్పత్రిపై దాడిని జర్మనీ, చెక్ రిపబ్లిక్ తీవ్రంగా ఖండించాయి. అయితే, తాము ఉక్రెయిన్ రక్షణ, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు జరిపామని రష్యా ఆర్మీ పేర్కొంది. ఉక్రెయిన్ క్షిపణి రక్షణ వ్యవస్థల వల్లే ఆస్పత్రికి నష్టం వాటిల్లినట్లు తెలిపింది.



రష్యా క్షిపణి దాడిలో ధ్వంసమైన కీవ్‌లోని ఆస్పత్రి భవనం

ఉగ్రదాడిలో అమరులైన ఐదుగురు జవాన్లు

- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- కశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఘటన

కథువా/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో భద్రతా బలగాలే లక్ష్యంగా మరోసారి ఉగ్రదాడి జరిగింది. ముష్కరులు పొంచి ఉండి జరిపిన దాడిలో ఐదుగురు ఆర్మీ జవాన్లు అమరులు కాగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మారుమూల మచేడి ప్రాంతంలోని బడ్నోటా గ్రామ సమీపంలో మచేడి–కిండ్లి–మల్హర్ రహదారిపై మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. ఆర్మీ గస్తీ వాహనాలపై ఉగ్రవాదులు మొదటగా గ్రనేడ్లు విసిరి, ఆపై యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డారు. జవాన్లు తిరిగి కాల్పులు జరపగానే సమీప అటవీ ప్రాంతంలోకి ముష్కరులు జారుకున్నారు. ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. ఇటీవల పాక్ నుంచి దొంగచాటుగా ప్రవేశించింది వీరేనని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటన నేపథ్యంలో అదనపు బలగాలు ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. కథువా జిల్లాలో ఇటీవల వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

నీట్ లీకేజీ నిజమే గానీ...

- ప్రభావం తీవ్రంగా ఉంటేనే రీ టెస్ట్: సుప్రీంకోర్టు
- కేంద్రం, ఎన్టీఏకు పలు ప్రశ్నలు
- సీబీఐ నివేదికకు ఆదేశాలు

"నీట్–యూజీ పేపర్ లీకైందన్నది స్పష్టమవుతోంది. దాని విస్తృతి ఎంతనేది అసలు ప్రశ్న. ధాన్యం నుంచి బియ్యం ఏరాల్సిన పరిస్థితి ఏర్పడింది. లీకేజీ ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉంటే రీ టెస్ట్ తప్పనిసరి. అయితే అది చివరి ఆప్షన్ మాత్రమే"

- సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన నీట్–యూజీ, 2024 లీకేజీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''పరీక్ష పవిత్రతే దెబ్బతిన్నది. లీకేజీ వాస్తవమేనని తేలింది. దాని ప్రభావం తాలూకు విస్తృతి ఎంతన్నది తేలాలి. ప్రశ్నపత్రం సోషల్ మీడియా ద్వారా అంతటా లీకై పరీక్ష తాలూకు సమగ్రతే పూర్తిగా దెబ్బతిని ఉంటే రీ టెస్ట్ తప్పదు. అలాకాకుండా లీకేజీ కొన్ని ప్రాంతాలకే పరిమితమై, దాని లబ్ధిదారులైన విద్యార్థులతో పాటు దోషులను స్పష్టంగా గుర్తించడం సాధ్యపడే పక్షంలో పరీక్షను తిరిగి నిర్వహించడం సబబు కాబోదు. ఇది 23 లక్షల పై చిలుకు అభ్యర్థులు హాజరైన భారీ స్థాయి పరీక్ష అని గుర్తుంచుకోవాలి'' అని అభిప్రాయపడింది. అందుకే సరైన ఆదేశాలిచ్చేందుకు వీలుగా లీకేజీకి సంబంధించి పలు అంశాలపై తమకు స్పష్టత ఇవ్వాలని కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లను, దర్యాప్తుపై తాజా నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. విచారణ గురువారానికి వాయిదా వేసింది. నీట్ పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లను సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారించింది. టెలిగ్రాం యాప్ ద్వారా ప్రశ్నపత్రం లీక్ చేసిన వారిని బిహార్ పోలీసులు అరెస్టు చేశారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. పేపర్ లీకేజీపై ఎన్టీఏ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తోందని ఆరోపించారు. పేపర్ లీకైందని అంగీకరిస్తున్నారా అని కేంద్రాన్ని సీజేఐ ప్రశ్నించారు. బిహార్‌లో అక్రమాలకు పాల్పడిన అభ్యర్థులను గుర్తించి వారి ఫలితాలు నిలిపేసినట్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిచ్చారు.

రుతుస్రావ సెలవులపై మోడల్ పాలసీ

- రాష్ట్రాలు, భాగస్వామ్యపక్షాలతో సంప్రదించండి
- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: నెలసరివేళ ఇబ్బందిపడే ఉద్యోగినులకు రుతుస్రావ సెలవులపై మోడల్ పాలసీని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈ విషయంలో సంబంధిత వర్గాలు, రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన విధానానికి రూపకల్పన చేయాలని సోమవారం కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. అయితే విధాన నిర్ణేతల పరిధిలోని ఈ అంశాల్లో కోర్టులు జోక్యం చేసుకోబోవని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా విద్యార్థినులు, ఉద్యోగినులకు ప్రతినెలా నెలసరి సెలవులు ఇవ్వాలంటూ లాయర్ శైలేంద్రమణి త్రిపాఠి వేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ కోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. ''రుతుస్రావ సెలవుపై కోర్టు నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగినుల ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముంది. అసౌకర్యంవేళ సెలవు దొరుకుతుందని భావిస్తే ఎక్కువ మంది ఉద్యోగాలు చేసేందుకు మొగ్గుచూపుతారు. అయితే ఉద్యోగినులకు ఇలాంటి సెలవు ఇవ్వడం ఇష్టంలేని సంస్థలు, యాజమాన్యాలు మహిళలకు ఉద్యోగం ఇచ్చేందుకు విముఖత చూపే ప్రమాదం కూడా ఉంది. ఉన్న ఉద్యోగినులను కూడా తగ్గించుకునే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి విపరిణామాలకు మేం అవకాశం ఇవ్వదల్చుకోలేదు. వాస్తవానికి ఇది ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం. ఇందులో కోర్టు జోక్యం ఉండకూడదు'' అని కోర్టు వ్యాఖ్యానించింది. చైనా, బ్రిటన్, జపాన్, ఇండోనేసియా, స్పెయిన్, జాంబియా, దక్షిణకొరియాలో ఏదో ఒక కేటగిరీ కింద ఇలాంటి సెలవులు ఇస్తున్నాయంటూ లాయర్ చేసిన వాదనలను కోర్టు తోసిపుచ్చింది. ''ఈ సెలవులు ఇవ్వాలని గత ఏడాది మే నెలలోనే పిటిషనర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం నుంచి ఇంతవరకు స్పందన లేదు. విధానపర నిర్ణయమైన ఇలాంటి అంశంలో కోర్టులు జోక్యం చేసుకోలేవు' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

విశ్వాస పరీక్ష నెగ్గిన సోరెన్ ప్రభుత్వం

రాంచీ: జార్ఖండ్‌లో జేఎంఎం సారథ్యంలోని హేమంత్ సోరెన్ సంకీర్ణ ప్రభుత్వం సోమవారం శాసనసభ విశ్వాసం పొందింది. మొత్తం 81 మంది ఎమ్మెల్యేలకు గాను 75 మంది ఈ సమావేశానికి హాజరయ్యారు. వీరిలో నామినేటెడ్ సభ్యుడు గ్లెన్ జోసెఫ్ సహా జేఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జేడీలకు చెందిన 45 మంది విశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేశారు. అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్..మాజీ సీఎం చంపయి సోరెన్ సహా 11 మందితో మంత్రులుగా ప్రమాణం చేయించారు.

ఎవరిని కాపాడాలనుకుంటున్నారు?

న్యూఢిల్లీ: ఎవరినో రక్షించేందుకు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడమేంటని సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సందేశ్‌ఖాలీ ప్రాంతంలో మహిళలపై నేరాలు, భూ ఆక్రమణలపై సీబీఐ విచారణకు ఆదేశిస్తూ కలకత్తా హైకోర్టు ఏప్రిల్ 10వ తేదీన ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేసిన బెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఈ సందర్భంగా తప్పుబట్టింది. హైకోర్టు ఆదేశాలను నిలువరించడం కుదరదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 9 : జూలై : 2024

బాలింతలను కాపాడుకోవాలి



తుమకూరు: బాలింతలను, శిశువులను కులాచారం పేరుతో ఊరిబయట ఒంటరిగా గుడిసెలలో ఉంచరాదు, ఇటువంటి చెడు సంప్రదాయానికి స్వస్తి పలకాలని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి చౌదరి అన్నారు. సోమవారం తుమకూరు జిల్లా కొరటిగెరె తాలూకాలో బిసాడిహట్టి గ్రామంలో ఊరిబయట ఉన్న బాలింత, ఆమె బిడ్డను ఇంటికి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ బాలింతలను ఇలా ఊరిబయట వదిలివేయడం మంచిది కాదన్నారు.

న్యూస్‌రీల్

గున్న ఏనుగు జననం



అమ్మానాన్నతో గున్న ఏనుగు

బొమ్మనహళ్లి: బెంగళూరు శివార్లలోని బన్నేరు ఘట్ట అభయారణ్యంలోకి కొత్త అతిథి వచ్చింది. రీటా అనే ఆడ ఏనుగు మగ గున్నకు జన్మనిచ్చినట్లు జూ అధికారులు తెలిపారు. బుజ్జి ఏనుగును తల్లితో పాటు ఇతర ఏనుగులు ఎంతో శ్రద్ధగా చూసుకుంటున్నాయి. దీంతో జూలో ఇప్పుడు 12 మగ ఎనుగులు, 15 ఆడ ఏనుగులు కలిపి మొత్తం 27కు చేరాయి.

ఎమ్మెల్యే కారు డ్రైవర్ నిర్బంధం

- రేణుకాస్వామి హత్య కేసు...



పవిత్రగౌడతో సమత (ఫైల్)

యశవంతపుర: చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో పోలీసులు కార్తీక్ పురోహిత్ అనే మరో నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని సోమవారం విచారించారు. గత శనివారం కూడా నాలుగైదు గంటల పాటు ప్రశ్నించినట్లు తెలిసింది. ఓ ఎమ్మెల్యే కారు డ్రైవర్‌గా పని చేస్తున్న కార్తీక్ పురోహిత్, రేణుకాస్వామి మృతదేహాన్ని పారేసిన తరువాత నిందితుడు ప్రదోశ్‌ను అక్కడ నుంచి తీసుకెళ్లినట్లు విచారణలో బయట పడింది. తన కారులోనే ప్రదోశ్‌ను గిరినగరకు తీసుకెళ్లాడు. ఆ రోజు ఏమి జరిగిందనేది కార్తీక్ నుంచి పోలీసులు వివరాలను సేకరించారు.

పవిత్ర స్నేహితురాలు సమత విచారణ

పవిత్రగౌడ ఆప్త స్నేహితురాలు సమతను ఈ కేసులో పోలీసులు విచారించారు. నిందితుడు ధనరాజ్‌కు ఆమె రూ. 3 వేలు పంపిన ఆధారాలను సేకరించారు. ఈ డబ్బులతో ధనరాజ్ ఎలక్ట్రిక్ షాక్ పరికరాన్ని కొన్నట్లు అనుమానిస్తున్నారు. బసవేశ్వరనగర ఠాణాలో సమతను ప్రశ్నించారు. మరోవైపు దర్శన్, పవిత్రతో పాటు 17 మంది నిందితులు జైళ్లలో కస్టడీలో ఉన్నారు. దర్శన్ బెయిలు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు.

కూరగాయల వ్యాన్ బోల్తా



పల్టీ పడిన వాహనం

చింతామణి: చిక్కబళ్లాపుర నుంచి తిరుపతి మార్కెట్‌కు కూరగాయలతో వెళ్తున్న గూడ్స్ వ్యాన్ బోల్తా పడింది. మంజునాథ్ అనే వ్యక్తి కూరగాయలను తరలిస్తుండగా చింతామణి పట్టణ శివార్లలోని తిమ్మసంద్ర గ్రామం దగ్గర సోమవారం అదుపుతప్పి పల్టీలు కొట్టింది. వాహనంలో ముగ్గురు ఉండగా సురక్షితంగా బయటపడ్డారు. కూరగాయల బస్తాలు చెల్లాచెదరుగా పడిపోవడంతో ఎంతో నష్టం జరిగిందని వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నకిలీ పత్రాలు సృష్టించి కటకటాలు



నిందితుడు గణేశ్, పురాతన కట్టడం

యశవంతపుర: నకిలీ పత్రాలు సృష్టించి పురాతన కాలం నాటి కట్టడ స్థలాన్ని ఆక్రమించడానికి యత్నించిన వ్యక్తిని బెంగళూరు బాగలూరు పోలీసులు అరెస్ట్ చేశారు. కెంగేరిలో నివాసం ఉంటున్న గణేశ్ (47)ను పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరు విచారణ కోసం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి నకిలీ పత్రాలు, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. కెంగేరి వల్లగెరెహళ్లి అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో గణేశ్ నివాసం ఉంటున్నాడు. బెంగళూరు నగరంలో ఖాళీ స్థలాలపై ఆన్‌లైన్‌లో గుర్తించి వాటికి నకిలీ పత్రాలను గణేశ్ సృష్టించేవాడు. ఆ స్థలానికి సంబంధించి పత్రాలను సమాచార చట్టం కింద సేకరించేవాడు. ఆ విధంగా కణ్ణూరులోని చరిత్ర కలిగిన సర్వేపాయింట్‌పై గణేశ్ కన్నేశాడు. పురావస్తుశాఖ అధికారులను ఆర్టీఐ ద్వారా అడిగారు. ఆ స్థలం తమ పరిధిలో చెప్పడంతో ఎలాగైన దక్కించుకోవాలని ఆ స్థలానికి నకిలీ పత్రాలను తయారు చేశాడు. ఇక్కడ అతి పురాతన కట్టడం ఉన్నట్లు 2021లో ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ సంస్థ గుర్తించింది. పర్యవేక్షించకపోవటంతో పాడుబడింది. అదే స్థలంలో ఏడు గుంటల భూమిని స్వాధీనం చేసుకోవడానికి పథకం వేసి నకిలీ పత్రాలను సృష్టించి కూల్చివేతకు సిద్ధం కావడంతో పోలీసులు గణేశ్‌ను అరెస్ట్ చేశారు.



వర్షాల నేపథ్యంలో సోమవారం బాగల్‌కోట జిల్లాలో నిండుగా ఘటప్రభ నది ప్రవాహం



ఉడుపిలో ఓ లోతట్టు ప్రాంతంలో వాననీరు

వరుణ ప్రతాపం.. జల తాండవం

- కోస్తా, ఉత్తర ప్రాంతాల్లో భారీ వర్షాలు
- ఉడుపిలో లోతట్టు జలమయం
- నదులు, జలాశయాలు కళకళ


యశవంతపుర: కన్నడనాట ఒకవైపు వరుణ ప్రతాపం కొనసాగుతోంది. వచ్చే ఆరురోజుల పాటు కోస్తాతో పాటు 10 జిల్లాల పరిధిలో భారీ వానలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. దక్షిణ కన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి, బెళగావి, బీదర్, కలబురగి, యాదగిరి, చిక్కమగళూరు జిల్లాల్లో కుండపోత కురవవచ్చు. ఇక బళ్లారి, బెంగళూరు గ్రామాంతర, బెంగళూరు నగర, చిత్రదుర్గ, దావణగెరె, హాసన, కొడగు, మండ్య తదితర జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు వానలు పడ్డాయి.

జనజీవనం అస్తవ్యస్తం

కరావళి, ఉత్తర కన్నడ జిల్లాలో వానలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మంగళూరు తాలూకాలో భారీవానల కారణంగా రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. పీయూసీ కాలేజీలకు సెలవు ప్రకటించారు. కుండపోత వల్ల నదులు, విద్యుత్‌స్తంభాల వద్దకు వెళ్లవద్దని ప్రజలకు అధికారులు హెచ్చరించారు. బెళ్తంగడి తాలూకాలో కల్మంజ గ్రామంలోని ప్రసిద్ధ సంగమక్షేత్ర సదాశివేశ్వర దేవస్థానం ముందున్న పురాతన రాగి చెట్టు కూలిపోయింది. ఉడుపి జిల్లా అంతటా భారీ వానలు కురుస్తున్నాయి. ఉడుపి నగరంలో తగ్గు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సోమవారం ఉదయం నుంచి వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అనేక కాలనీలు మోకాలిలోతు నీటిలో మునిగాయి. అనేక చోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రసిద్ధ కృష్ణ ఆలయ పరిసరాల్లో సందడి తగ్గింది. నీటిలో చిక్కుకున్న జంతువులను ఫైర్ సిబ్బంది రక్షించారు. లోతట్టు ప్రాంతాలలో ఇళ్లు, షాపుల్లోకి నీరు చేరడంతో బాధితులు లబోదిబోమన్నారు. పొరుగునే మంగళూరు, ఉళ్లాలలో వానలతో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఎవరూ నీటిలోకి వెళ్లరాదని అధికారులు తెలిపారు. జిల్లాలో రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు.



కొడగు జిల్లాలో హారంగి డ్యాం నుంచి నీటి విడుదల




ఉత్తర కన్నడ జిల్లాలో కద్రా డ్యాం గేట్ల ఎత్తివేతతో నీరు పరవళ్లు

చార్మాడి ఘాట్ అతలాకుతలం

చిక్కమగళూరు జిల్లా వ్యాప్తంగా భారీ వానలు పడుతున్నాయి. మూడిగెరె తాలూకా పరిధిలోని చార్మాడి ఘాట్ మార్గంలో కొండ రాళ్లు పడడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కొండరాళ్ల నుంచి కొందరు వాహనదారులు తృటిలో తప్పించుకున్నారు. అలెఖానా వద్ద కొద్ది రోజుల క్రితం నిర్మించిన రక్షణ గోడ పగుళ్లు ఇచ్చింది. ఆదివారం రాత్రి వానలతో అది పూర్తిగా కూలిపోయింది. ఈసారి మొదటి దఫా వానలకే చార్మాడి ఘాట్ అతలాకుతలం అవుతోంది.

జలాశయాలకు జీవం

తాజా వర్షాలతో రాష్ట్రంలో కోస్తా, ఉత్తర ప్రాంతాలలో నదులు జలకళ సంతరించుకున్నాయి. దీంతో వాటి మీదున్న జలాశయాలు నిండుగ మారాయి. బాగల్‌కోట జిల్లాలో ఘటప్రభ నది సోమవారం నిండుగా దర్శనమిచ్చింది. ఉత్తర కన్నడ జిల్లాలో కాళీ నదికి వరద పోటెత్తింది. దీంతో కద్రా డ్యాం గేట్లను ఎత్తేశారు. కొడగు జిల్లాలో హారంగి నది కూడా పరుగులు పెడుతోంది. దీంతో హారంగి డ్యాం గేట్లను ఎత్తివేయడంతో గంగమ్మ కనువిందు చేస్తోంది.



హారంగి జలాశయం



ఉడుపిలో వర్షం వల్ల శ్రీకృష్ణ ఆలయం వద్ద తగ్గిన రద్దీ

పేదరికం కొంత, రేషన్ కార్డులు కొండంత

- సీఎం సిద్దు విస్మయం
- కార్డులను ఏరివేయాలని ఆదేశం

శివాజీనగర: రాష్ట్రంలో 80 శాతం మంది బీపీఎల్ కార్డులను కలిగి ఉన్నారు. తమిళనాడులో ఇది 40 శాతమేనని సీఎం సిద్ధరామయ్య అన్నారు. సోమవారం విధానసౌధలో కలెక్టర్లు, జడ్పీ సీఈఓలతో సమావేశం నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ నీతి ఆయోగ్ ప్రకారం మన రాష్ట్రంలో 5.67 శాతం మంది పేదరికంలో ఉండాలి. అయితే 1.27 కోట్ల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. అనర్హులకు ఉన్న కార్డులను రద్దు చేసి అర్హత కలిగినవారికి ఇవ్వాలని సూచించారు.

రైతు ఆత్మహత్యల్లో ఉదారంగా పరిహారం

రైతుల ఆత్మహత్య కేసుల్లో పరిహారం అందజేయడంలో జాప్యం తగదు. రైతుల ఆత్మహత్య కేసుల్లో చట్ట ప్రకారం, ఉదార స్వభావంతో ప్రవర్తించి కుటుంబాలకు పరిహారం అందించాలని తెలిపారు.



సమావేశంలో సీఎం, డీసీఎంలు

చిన్న చిన్న కారణాలతో పరిహార దరఖాస్తులను తిరస్కరించవద్దని అన్నారు. రాబోయే ఎస్ఎస్ఎల్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తగ్గరాదన్నారు.

డెంగీని అరికట్టాలి

జిల్లాల్లో కలుషితమైన నీరు తాగి పలువురు మృతి చెందారు. ఇటువంటివి పునరావృతమైతే సీనియర్ అధికారులపై చర్యలు తీసుకొంటామన్నారు. డెంగీ జ్వరాల అడ్డుకట్టకు శ్రమించాలన్నారు. ఈ సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు పాల్గొన్నారు.

ఒక్కరోజులో 159 డెంగీ కేసులు

- మంత్రి గుండూరావ్ వెల్లడి

బనశంకరి: రాష్ట్రంలో డెంగీ కేసులు పెరుగుతున్నందున 3.18 కోట్ల పారసిటమాల్ మాత్రలను సేకరించినట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు. సోమవారం నగరంలో విలేకరులతో మంత్రి మాట్లాడారు. గత 24 గంటలలో 954 మందికి పరీక్షలు నిర్వహించగా 159 మందికి డెంగీ ధృవీకరణ అయ్యిందన్నారు. బెంగళూరులో అత్యధికంగా 80 కేసులు నమోదయ్యాయి. నగరంలో మొత్తం డెంగీ కేసులు సంఖ్య 1,988కి చేరుకుంది, 130 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తరువాత చిక్కమగళూరు జిల్లాలో 25 మంది, చిక్కబళ్లాపురలో 8, తుమకూరు 12, దావణగెరె 10, గదగ 5, యాదగిరి 2, బీదర్ 13, కొప్పళ 1, హాసన 3 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఈ ఏడాది నమోదైన మొత్తం డెంగీ కేసులు 7,165 కు చేరాయన్నారు. దోమల నియంత్రణకు మందులు పిచికారి చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల కోసం పారాసిటమాల్ సిరప్ బాటిళ్లను 8 లక్షలకు పైగా నిల్వ చేశామన్నారు.

డెంగీతో నలుగురు బాలల మృతి

హుబ్లీ: రాష్ట్రంలో రోజురోజుకు డెంగీ పంజా విసురుతోంది. ఎంతో మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఉత్తర కర్ణాటకలో తీవ్రస్థాయిలో పీడిస్తోంది. నలుగురు బాలలు డెంగీతో మృతి చెందినట్లు కిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్ కుమార్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ కిమ్స్‌లోని పిల్లల వార్డులో డెంగీతో చికిత్స పొందుతూ నలుగురు మరణించారు. కానీ మెడిసిన్ వార్డులో ఎలాంటి మరణాలు సంభవించలేదన్నారు. మృతుల్లో ధార్వాడ జిల్లా వాసులు ఎవరూ లేరని, మృతులు ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారని ఆయన తెలిపారు.

జనం గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్



బెంగళూరు యలహంక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ ఐటీవింగ్ టీమ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి



వైఎస్సార్ ఫౌండేషన్ నేతృత్వంలో మహానేత జయంతి వేడుకలు

- బెంగళూరులో ఐటీ వింగ్ ఆధ్వర్యంలో మహానేత జయంతి
- విద్యార్థులకు పుస్తక సామగ్రి పంపిణీ

బనశంకరి: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మరిచిపోలేని మహనీయుడు డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కుమార్ పులివెందుల తెలిపారు. పేదల పెన్నిధి, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని సోమవారం బెంగళూరు వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యలహంక ఓల్డ్‌టౌన్ శ్రీ చౌడేశ్వరి దేవస్థానం సమీపంలో గల నీలకంఠేశ్వర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, నోటుపుస్తకాలు, స్టేషనరి సామగ్రిని కుమార్ పులివెందుల అందజేసి మాట్లాడారు. రైతుల రుణ మాఫీ, డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలు, లక్షలాది మంది విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంట్, జలయజ్ఞం లాంటి పథకాలను ప్రవేశపెట్టిన మహోన్నత వ్యక్తి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య, 108 పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, దేశంలోని పలు రాష్ట్రాలు 108 పథకాన్ని అమలు చేశాని తెలిపారు. వైఎస్సార్ పార్టీలకు అతీతంగా తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా దివంగత ఐటీ వింగ్ నేతలైన శ్యామ్ కలకడ, హర్కిష్ణ యాదవ్‌ల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి బాలలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బెంగళూరు వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, పూల ప్రవీణ్, రామ్‌సుదేశ్‌రెడ్డి, విజయరాఘవరెడ్డి, మహేశ్, ప్రవీణ్, రవికిరణ్, రమేశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, మారుతి, యలహంక నేతలు రామిరెడ్డి, మబ్బురామేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి తో పాటు హెచ్‌ఎం రెడ్డి రాణి, ఉపాధ్యాయులు శ్రీరంగయ్య, గ్రేస్ వందన, తబుసం కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత నేత వైఎస్సార్

కర్ణాటక డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. నగరంలోని కెంటికి హోటల్‌లో డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి ఫౌండేషన్ అధ్యక్షుడు కే.భక్తవత్సలరెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మహోన్నత నేత వైఎస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చేసిన సేవలు మరవలేమన్నారు. జలయజ్ఞం, ఫీజు రీఇంబర్స్‌మెంట్, ఆరోగ్య పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట కృష్ణారెడ్డి, కొండా దామోదర్‌రెడ్డి, గీతారామ్, రేణుకా హరిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వసంత కవితారెడ్డి, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.



యలహంక పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసే సామగ్రితో ఐటీ వింగ్ సభ్యులు

దైవనామంతో బాధలు దూరం



మహా మృత్యుంజయ హోమం దృశ్యం

మైసూరు: ఎల్లప్పుడు భగవంతున్ని ధ్యానం, జపం, తపం చేయడం ద్వారా మన జీవితం సార్థకం అవుతుందని అదమారు మఠాధిపతి విద్యాప్రియ తీర్థ స్వామి అన్నారు. మైసూరు సరస్వతీపురంలో ఉన్న శ్రీకృష్ణధామంలో మహా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ భగవంతుడు శాంత కృపా దృష్టి మనపైన ఉండాలి, అందుకోసం ఆలయాలకు వెళ్లి పూజలు చేస్తామని చెప్పారు. మనం భగవంతున్ని ఎంత తలుచుకుంటే అంతగా బాధలు తగ్గిపోతాయని అన్నారు. ఈ సందర్భంగా వందలాది మంది హోమ పూజల్లో పాల్గొన్నారు.

లాడ్జీలో వ్యభిచారం గుట్టురట్టు

మైసూరు: వేశ్యావాటికి నిర్వహిస్తున్న లాడ్జ్ పైన దాడి చేసిన పోలీసులు దాడి చేసి ఇద్దరు యువతులను రక్షించి, ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ సంఘటన మైసూరు నగరంలోని విజయనగర ట్యాంక్ రోడ్డులో ఉన్న కరన్ రెసిడెన్సీ అనే లాడ్జిలో జరిగింది. ఇక్కడ పడుపు వృత్తి సాగుతోందని తెలిసి సిసిబి పోలీసులు, విజయనగ పోలీసులు కలిసి సోదాలు చేశారు. జార్ఖండ్, హుణసూరుకు చెందిన ఇద్దరు యువతులను నిర్వాహకుల చెర నుంచి కాపాడారు. ముగ్గురిని అరెస్టు చేశారు. ఆరు నెలల నుంచి ఈ లాడ్జిలో వేశ్యావాటిక నడుస్తోందని పోలీసులు తెలిపారు.

ఏ కేసునూ మూసేయం: హోం మంత్రి

శివాజీనగర: మేము ఏ కేసునూ మూసివేయం, సీఎం కూడా ఇదే మాట చెప్పారు అని హోం మంత్రి జీ.పరమేశ్వర్ తెలిపారు. సోమవారం సదాశివ నగర నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, ముడా ఇళ్ల స్థలాల కేసు మూత వేసేందుకు కుట్ర జరుగుతోందని బీజేపీ, జేడీఎస్ ఆరోపిస్తున్నాయి. సీఎం కావడానికి పోటీ పడుతున్నవారు ముడా కేసును వెలుగులోకి తెచ్చారని హెచ్‌డీ కుమారస్వామి చెప్పారనేది నాకు తెలియదన్నారు. ముడా కేసులో అంతర్గత తనిఖీ జరుగుతోంది. అందుచేత సిట్ అవసరం లేదన్నారు. రేణుకాస్వామి హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయడమైనది. సాక్ష్యాల సేకరణ జరుగుతోంది. చార్జ్‌షీటు వేస్తారు. ఈ కేసులో ఎవరినీ కాపాడాల్సిన అవసరం లేదు అని అన్నారు.

కోహ్లీ రెస్టారెంట్లపై కేసులు

యశవంతపుర: అవధికి మించి తెరిచి ఉంచినందుకు టీం ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ భాగస్వామ్యం ఉన్న వన్ 8 కమ్యూన్ రెస్టారెంట్‌తో పాటు మరో మూడు రెస్టారెంట్ల మేనేజర్లపై బెంగళూరు కబ్బన్ పార్క్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6న రాత్రి కబ్బన్‌పార్క్ పోలీసులు తనిఖీలు చేయగా, అవధి మీరినా పనిచేస్తున్నట్లు గుర్తించారు. కస్తూరిబా రోడ్డులోని వన్ 8 కమ్యూన్‌తో పాటు చర్చి స్ట్రీట్‌లోని ఎంపైర్, బ్రిగేడ్ రోడ్డులోని పాంజియో బార్ అండ్ రెస్టారెంట్ మేనేజర్లపై కేసులు నమోదు చేశారు.

నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నం



రవికుమార్‌ను రక్షించి తెస్తున్న దృశ్యం

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా కుమారధార నదిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించాడో వ్యక్తి. ఈ ఘటన కోడింబాళ గ్రామం పులిక్కుక్కులో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి జిల్లా మడకశిరకు చెందిన రవికుమార్ (40) బెంగళూరు మారతహళ్లిలో నివాసం ఉండేవాడు. షేర్ల మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయాడు, రూ. 2లక్షల వరకూ అప్పులు అయ్యాయి. ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. బెంగళూరు నుంచి కుక్కే సుబ్రహ్మణ్యకు వెళ్లి అక్కడ స్వామిని దర్శించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున తన బ్యాగును కడబ బస్టాండ్‌లో వదిలేసి నది వద్దకు వచ్చాడు. చేతిని కత్తితో కోసుకొని నదిలోకి దూకాడు. కానీ మధ్యలో పొదల్లో చిక్కుకుని ఆర్తనాదాలు చేయసాగాడు. స్థానికులు, పోలీసులు అతన్ని రక్షించి పుత్తూరు ఆస్పత్రిలో చేర్పించారు. అతని వద్ద మొబైల్‌ఫోన్, రూ. 10 వేల నగదు ఉంది.

ఒకే వ్యక్తికి 20 ముడా ఇళ్ల స్థలాలు

మైసూరు: ముఖ్యమంత్రి సిద్దరామయ్య సన్నిహితుడు, మైసూరువాసి హినకల్ పాపణ్ణ అనే వ్యక్తికి ముడా పరిధిలో కోట్ల రూపాయల విలువ చేసే 20 ఇంటి స్థలాలను ఇచ్చినట్లు తేలింది. ముడా అధ్యక్షుడు కె.మరిగౌడ సోమవారం మైసూరు జలదర్శిని అతిథి గృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని తెలిపారు. పాపణ్ణకు హినకల్‌లో ఉన్న 3.05 గుంటల స్థలాన్ని 1981లో ముడా స్వాధీనం చేసుకుంది. 2024 జూన్ నెల 12వ తేదీన అతనికి పరిహారం ఇచ్చినట్లు చెప్పారు. ఆ భూమికి బదులుగా విజయనగర వివిధ లేఔట్‌లలో 20 ఇంటి స్థలాలను అప్పగించారు. ఇలా ఒకే వ్యక్తికి ఇన్ని స్థలాలు ఇవ్వడం అనేక తప్పులు జరిగాయని అన్నారు. సీఎం సతీమణికి ముడా స్థలాలను ఇవ్వడంలో తప్పేమీ లేదని, చాలామంది రాజకీయ నాయకులు స్థలాలను తీసుకున్నారని తెలిపారు.

వరదలతో ఐదు వంతెనలు మునక

- పలు జిల్లాల్లో కొనసాగుతున్న భారీ వర్షాలు
- నదుల ఉగ్రరూపంతో స్తంభించిన రాకపోకలు



దూద్‌గంగా నది వరదనీటిలో మునిగిపోయిన రోడ్డు వంతెన



గుంటకతో విత్తనాలు నాటుతున్న రైతన్న

సాక్షి బళ్లారి: కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలతో పలు జిల్లాల్లో నదులు ఉగ్ర రూపం దాల్చాయి. మహారాష్ట్రలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బెళగావి జిల్లాలో కృష్ణానది పొంగిపొర్లుతోంది. వేదగంగా, దూద్‌గంగా నదుల్లో నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో ఐదు వంతెనలు జలావృతమయ్యాయి. మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో నిరంతరంగా కురుస్తున్న వర్షాల వల్ల బెళగావి జిల్లా చిక్కోడి ప్రాంతంలో ప్రవహిస్తున్న వేదగంగా, దూద్‌గంగా నదుల్లో వరదనీరు భారీ స్థాయిలో పెరగడంతో ఆయా గ్రామాల్లో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాంజరీ-భావన, మలిక్‌వాడ- దత్తవాడ ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. నిప్పాణి తాలూకాలో వేదగంగా నదిలో నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. ఈనేపథ్యంలో తాలూకాలోని కున్నూరు- భారవాడ ప్రాంతాలకు రాకపోకలు సాగే వంతెన కూడా నీటిలో మునిగిపోయింది.

దూద్‌గంగా నదికి పోటెత్తిన వరద

దూద్‌గంగా నదికి అడ్డంగా ఉన్న కరాదగ- భోజ్, హన్నరగి- భోజవాడి మధ్య రాకపోకలు జరిగే వంతెనలు నీటిలో మునిగిపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు వంతెనలపై పెద్ద ఎత్తున నీరు ప్రవహించడం వల్ల చుట్టుపక్కల 10 కిలోమీటర్లకు పైగా జనం రాకపోకలు నిలిచిపోయాయి. కృష్ణానదిలో పెద్ద ఎత్తున నీరు ప్రవహించడంతో బెళగావి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాలకు చెందిన ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వారం రోజులుగా పెద్ద ఎత్తున కొనసాగుతున్న రుతుపవనాలతో దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, ఉడిపి, బెళగావి, బీదర్, కలబుర్గి, యాదగిరి, చిక్కమగళూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. గదగ్, హావేరి, కొప్పళ, ధార్వాడ, రాయచూరు, బళ్లారి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధం

చిత్రదుర్గ, దావణగెరె, హాసన, కొడగు, మండ్య తదితర జిల్లాల్లో కూడా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్నారు. పూర్తిగా వచ్చిన మార్పులతో వాతావరణం చల్లబడిపోయింది. ముంగారు వర్షాలతో రైతన్నలు ఉత్సాహంగా సేద్యం పనుల్లో నిమగ్నులయ్యారు. మంగళూరు తాలూకాలో భారీ వర్షం కురవడంతో పీయూసీ విద్యార్థులకు సెలవు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలతో అక్కడక్కడ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ వర్షాల వల్ల జలాశయాల్లోకి నీటి ప్రవాహం పెరుగుతోంది. తుంగభద్ర డ్యాంలోకి కూడా ఇన్‌ఫ్లో 25 వేల క్యూసెక్కులకు పైగా కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం 21 టీఎంసీలకు చేరుకుంది. మొత్తం మీద వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ముంగారుకు సాగు నీటి సమస్య లేకుండా విత్తనసాగు ఊపందుకుంటోంది.



వర్షంలోనూ ఆందోళన : వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతను కోరుతూ సోమవారం శివమొగ్గలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు, చెత్త వాహనాల సిబ్బంది ప్రదర్శన

నకిలీ పత్రాలతో ఘరానా మోసం

- ఐదుగురిపై సీసీబీలో కేసు

యశవంతపుర: నకిలీ పత్రాలు సృష్టించి ఇంటి స్థలానికి బ్యాంకులో రూ. 2.32 కోట్ల రుణం తీసుకున్న ఐదుగురిపై సీసీబీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బెంగళూరు కేంద్ర కార్యాయం ఏజీఎం ఫిర్యాదు మేరకు శివణ్ణ, అచ్చుకుట్టిన్ పీ, మొహమ్మద్ ఫయాజ్, వీరభద్రప్ప, సైయద్ దాశీంపై కేసు నమోదైంది. బెంగళూరు ఉత్తర తాలూకా మల్లతహళ్లి గ్రామానికి చెందిన శివణ్ణ అనే వ్యక్తి స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి ఎస్‌బీఐలో అచ్చుకుట్టన్ రుణం కోసం దరఖాస్తు చేశాడు. దీనికి సంబంధించి 2023 జనవరిలో రూ.1.16 కోట్ల రుణం మంజూరైంది. అనంతరం బ్యాంకు అధికారులు తీసుకున్న రుణం చెల్లించాలని అచ్చుకుట్టిన్‌కు నోటీసులివ్వగా వాటిని స్వీకరించలేదు. అనుమానం వచ్చి బ్యాంక్ అధికారులు స్థలాన్ని పరిశీలించడానికి వెళ్లారు. ఆ స్థలం మరొకరి పేరుపై ఉన్నట్లు తేలింది. అదే స్థలానికి 2022 అక్టోబర్‌లో మొహమ్మద్ ఫైయాజ్ అదే ఎస్‌బీఐ నుంచి రూ.1.16 కోట్ల అప్పు తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. కొనుగోలు దారుడిగా సయ్యద్ దాశీం పేరు రికార్డ్‌ల్లో ఉంది. మరొకరి ఇంటి స్థలాన్ని ఇద్దరు వ్యక్తులు కలిసి రూ.2.32 కోట్లు అప్పుగా తీసుకుని బ్యాంకు భారీగా మోసగించారు. దీంతో సీసీబీ పోలీసులు కేసు నమోదు చేశారు.

డెంగీ నియంత్రణకు పకడ్బందీ చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ తుషార్

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో డెంగీ నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. సోమవారం పాలికె కేంద్ర కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన ప్రగతి పరిశీలనా సమావేశం అనంతరం తుషార్ మాట్లాడారు. డెంగీ నియంత్రణకు సీనియర్ వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎం, లింక్ వర్కర్స్, స్వయం సేవా సేవకులను నియమించామని, డెంగీ కేసులు హెచ్చుమీరుతున్న ప్రాంతాల్లో ఔషధాలు, పిచికారీ, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 3815 డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. పాలికె సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలను జాగృతం చేస్తున్నారని, ప్రజలు ఇళ్ల వద్ద దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటే నియంత్రణ సాధ్యమన్నారు. సమావేశంలో ప్రత్యేక కమిషనర్ మునీశ్ మౌద్గిల్, అధికారులు డాక్టర్ కే.హరీశ్ కుమార్, సురళ్కర్ వికాస్ కిశోర్, శివానంద్‌కల్కరే, ఆర్‌ఎల్.దీపక్, స్నేహల్, వినోత్‌ప్రియ, రమ్యా, ప్రీతిగెహ్లాట్ తదితరులు పాల్గొన్నారు.

- మబ్బులు.. వర్షం





సోమవారం బెంగళూరులో ఆకాశం దట్టంగా మేఘావృతమైంది. సాయంత్రం నుంచి అనేక ప్రాంతాలలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కెంపేగౌడ విమానాశ్రయం వద్ద కొడిగేహళ్లిలో జలమయమైన రహదారి

ముడా స్కాంలో సీఎంను రక్షిస్తున్నారు

- మాజీ సీఎం జగదీష్ శెట్టర్

హుబ్లీ: ముడా కుంభకోణం దర్యాప్తు సరైన దిశలో సాగడం లేదు. ముఖ్యమంత్రిని రక్షించేందుకు అంతా ప్రయత్నిస్తున్నారని బెళగావి ఎంపీ జగదీశ్ శెట్టర్ ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదివారం మైసూరులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్‌ఎస్ మహదేవప్ప విలేకరులతో మాట్లాడుతూ సీఎంను సమర్థిస్తూ కాగితపు పామును వదిలారన్నారు. ఇది సీఎంను రక్షించేందుకు పన్నిన వ్యూహం అన్నారు. ముడా స్కామ్‌లో వేరే పార్టీ నేతలు కూడా ఉన్నారన్నారు. ఇతరులు కూడా స్కామ్‌లో భాగస్వాములే అన్నారు. ఎమ్మెల్యేలందరూ కూడా స్కామ్‌లో ఉన్నారు. మంత్రి మహదేవప్ప చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కాంగ్రెస్ నేతల అవినీతి బండారం త్వరలోనే బయటపడుతుందన్నారు. ఈ స్కామ్ నుంచి సీఎంను రక్షించేందుకు ఆ పార్టీ నేతలు విలేకరుల సమావేశాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎటువంటి కారణంతోనైనా సీఎంను రక్షించే పని చేయరాదని హితవు చెప్పారు. మహదాయి పథకం ప్రారంభం కనకుంబి కేంద్ర బృందం పర్యటనపై స్పందించిన ఆయన ఈ బృందం వచ్చింది. పర్యావరణం, పులుల కారిడార్ నేపథ్యంలో పర్యటించి ఉంటే ఓకేనన్నారు. అయితే కేంద్రం నుంచి ఇలాంటి బృందాలు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి కదా? అని ఆయన నిలదీశారు.

మహిళా సబలీకరణకు పెద్ద పీట



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: మహిళా సశక్తత, సబలీకరణకు అధిక ప్రాధాన్యత నివ్వడంతో పాటు మహిళలను అధికంగా రోటరీ సంస్థలోకి చేర్చుకోవడం ద్వారా దేశంలోనే నెంబర్ వన్‌గా రోటరీ సంస్థను రూపుదిద్దుతామని కోలారు రోటరీ లేక్‌సైడ్ సంస్థాపక అధ్యక్షుడు ఎంవీఎస్ రావ్ తెలిపారు. సోమవారం ముళబాగిలు తాలూకాలోని దొడ్డహొన్నశెట్టి హళ్లి గ్రామ వికాస సంస్థలో నిర్వహించిన నూతన పదాధికారుల పదగ్రహణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. వచ్చే యేడాది కాలంలో వేయి కార్యక్రమాలను పూర్తి చేసే లక్ష్యం కలిగి ఉన్నట్లు తెలిపారు. విషేర్ హ్యాపీనెస్ సంస్థ పదాధికారులు రోటరీ కోలారు లేక్‌సైడ్‌లో చేరడంతో ఎంతో బలం వచ్చినట్లయిందన్నారు,. రోటరీకి ఎన్నికైన నూతన పదాధికారులు రోటరీ సంస్థను ఉత్తమంగా నిర్వహించుకుంటూ వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కోలారు లేక్‌సైడ్ నూతన అధ్యక్షుడు ఎంఎస్ గిరిజా, రోటరీ గవర్నర్ బీఆర్ శ్రీధర్, జిల్లా రోటరీ కార్యదర్శి ఎస్‌వీ సుధాకర్, రోటేరియన్ సరితా కుమారి, తిరుమురుగన్, అరివు శివప్ప తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

నాసిరకం ఆహార ధాన్యాలపై మండిపాటు



ఆహార ధాన్యాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: చిక్కతిరుపతి గ్రామ ప్రభుత్వ బాలుర విద్యార్థి నిలయాన్ని సోమవారం ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తనిఖీ చేశారు. హాస్టల్‌లో వినియోగిస్తున్న ఆహార పదార్థాలు నాసిరకంగా ఉండడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. హాస్టల్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలు సరిగా ఉండటం లేదని ఫిర్యాదులు రావడంతో జిల్లా సంక్షేమ శాఖ అధికారికి ఫోన్ చేసి హాస్టల్ వార్డెన్, వంట వారిని సస్పెండ్ చేయాలని సూచించారు. పిల్లలకు వండే ఆహార పదార్థాలు రుచి, శుచిగా లేకుంటే కఠిన చర్యలు తప్పవని వార్డెన్‌ను హెచ్చరించారు. తాలూకా సంక్షేమ శాఖ అధికారికి ఫోన్ చేసి మండిపడ్డారు. అవ్యవస్థను సరిచేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల హాజరు పుస్తకంలో నిత్యం 33 మంది పిల్లలు ఉన్నట్లు చూపగా హాస్టల్‌లో కేవలం ఏడుగురు పిల్లలు మాత్రమే ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. వంట మనిషి లక్ష్మణ్‌ను వెంటనే సస్పెండు చేయాలన్నారు.

కుంభకోణంపై సీబీఐ తనిఖీ చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ డిమాండ్

కోలారు: ముడా అక్రమాలపై తనిఖీని సీబీఐకి అప్పగించి ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ మాజీ ఎమ్మెల్సీ వైఏ నారాయణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. బీడీఏను తలదన్నేలా ముడాలో అక్రమాలు జరిగాయన్నారు. ఈ కేసులో సిద్దరామయ్య ఆయన ఇంటి స్థలం వదిలి పెట్టడానికి రూ.63 కోట్ల పరిహారం అడుగుతున్నారన్నారు. ముడా వ్యాప్తిలో ఎమ్మెల్యే కూడా సభ్యుడన్నారు. ఆ ప్రాంత ఎమ్మెల్యే అయిన సిద్దరామయ్యకు తెలియకుండా ఏమీ జరగదన్నారు. ముడా కుంభకోణంలో సిద్దరామయ్యకు నేరుగా పాత్ర ఉందని ఆరోపించారు.

ముడాలో ఎలాంటి అక్రమాలు జరగలేదంటున్న నగరాభివృద్ధి మంత్రి భైరతి సురేష్ హెలికాప్టర్‌లో ఎందుకు రికార్డులు తీసుకెళ్లారని ప్రశ్నించారు. మైసూరు జిల్లా కలెక్టర్‌ను ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించారు. వాల్మీకి మండలిలో రూ.187 కోట్ల నిధుల దుర్వినియోగంతో ఎస్టీ సముదాయానికి అన్యాయం జరిగిందన్నారు. ఇష్టారాజ్యంగా నిధులు డ్రా చేసి తెలంగాణ ఎన్నికలకు ఖర్చు చేశారని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, ప్రవీణ్‌గౌడ, కెంబోడి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులను ఆదుకుంటాం



ఉచిత బ్యాగు, లేఖన సామగ్రి అందించిన దృశ్యం

కోలారు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల విద్యా ప్రగతికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని బెంగళూరు మార్వాడి యువ మంచ్ సురేందర్ గోయల్ హామీ ఇచ్చారు. సోమవారం తాలూకా శిక్షక గెళెయర బళగ మనవి మేరకు తాయలూరు, బేతమంగల ఫిర్కాలోని పాఠశాలల్లో 135 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉచిత బ్యాగులు, లేఖన సామగ్రిని అందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఎంతో మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారు. సంస్థ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సౌకర్యాలను అందించడానికి సదా సిద్ధంగా ఉంటుందన్నారు. మార్వాడి మంచ్ స్నేహ కుమార్ జాజు, దాత సుశీల్ గోయల్, బళగ అధ్యక్షుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కూల్ బ్యాగుల పంపిణీ



స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేసిన దృశ్యం

బాగేపల్లి: పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని, దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత ఇంజినీర్ కృష్ణ అన్నారు. సోమవారం బాగేపల్లి తాలూకా తుంగేటిదిన్నె ప్రభుత్వ పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

13న కాంగ్రెస్ కార్యకర్తలతో సీఎం భేటీ

శివాజీనగర: ఈనెల 13న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కాంగ్రెస్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈనెల 6న జరగాల్సిన ఈ కార్యక్రమం వివిధ కారణాలతో వాయిదా పడింది. ఈనెల 13న ఉదయం 10 గంటలకు కేపీసీసీ భారత్ జోడో ఆడిటోరియం భవనంలో సీఎం కార్యకర్తలతో భేటీ కానున్నారు. ఆ రోజు పార్టీ కార్యకర్తలు, నాయకులు ముఖ్యమంత్రిని కలిసి పాలనాపర సమస్యలపై చర్చించవచ్చు. కార్యక్రమంలో పాల్గొనేవారు ముందుగా తమ పేరును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. గుగూల్ షీట్‌లో పూర్తి వివరాలు నమోదు చేసి పార్టీ కార్యాలయంలో సమర్పించాలి.

ఓటు బ్యాంకు రాజకీయాలు వద్దు

శివాజీనగర: కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ప్రజోపయోగ కార్యాలపై దృష్టి పెట్టలేదని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఆయన పంట పరిహారం నేటికి రైతులకు అందలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా రైతుల ఇబ్బందులపై మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. గత ఖరీఫ్, రబీలో నష్టపోయిన రైతులకు చిల్లిగవ్వ కూడా పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

ఏనుగుల దాడిలో టేకు చెట్ల నాశనం

మండ్య: మండ్య జిల్లా హలగూరు సమీపంలోని హెచ్ బసాపుర గ్రామంలో ఏనుగులు టేకు చెట్లను నాశనం చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. దాదాపు 12 చెట్లను ఏనుగులు కిందకు లాగి తొక్కి పడేశాయి. హెచ్ బసాపుర గ్రామానికి చెందిన ఆనంద్ 15 ఏళ్ల క్రితం 400 టేకు మొక్కలను తీసుకుని వచ్చి సాగు చేశాడు. పొలం అడవికి అతి సమీపంలో ఉండటంతో తరచూ ఏనుగులు వచ్చిన పంటలపై పడి నాశనం చేస్తున్నాయని, తాజా ఘటనతో రూ. లక్షల్లో నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

నడ్డాపై డీసీఎం ధ్వజం

శివాజీనగర: బీజేపీ ఎంపీ డాక్టర్ కే.సుధాకర్ కార్యకర్తలకు మద్యం పంపిణీ చేసిన విషయంపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా సమాధానం చెప్పాలని డీసీఎం డీ.కే.శివకుమార్ డిమాండ్ చేశారు. విధానసౌధలో సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, నెలమంగలలో బీజేపీ కార్యక్రమంలో మద్యం పంపిణీ చేసిన నేపథ్యంలో కేసు నమోదు చేసింది వేరే విషయం . అయితే బీజేపీ ప్రధాన నాయకులు ఇందుకు స్పష్టత ఇవ్వాలి. బీజేపీ ఇటువంటి సంస్కృతి గురించి స్థానిక బీజేపీ నాయకులకంటే జాతీయ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బావికెర గ్రామంలో బీజేపీ, జేడీఎస్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన నూతన ఎంపీ కే.సుధాకర్ అభినందన కార్యక్రమంలో మాంసాహార విందులో మద్యం పంపిణీ చేశారు. కార్యకర్తలు, ప్రజలు మద్యం బాటిళ్ల కోసం ఒకరిపై ఒకరు పడిన ఘటనకు సంబంధించి వీడియో వైరల్ అయింది. అధిక సంఖ్యలో యువకులతో మహిళలు, వృద్ధులు కూడా మద్యం బాటిళ్లను తీసుకొని మైదానంలోనే కూర్చోవటాన్ని వీడియోలో చూడవచ్చు.

లాటరీ విక్రేతల అరెస్ట్

కెలమంగలం: తమిళనాడు ప్రభుత్వం నిషేధించిన లాటరీ టికెట్లను విక్రయిస్తున్న ముగ్గురిని కెలమంగలం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు కెలమంగలం పట్టణ పంచాయతీలో లాటరీ టికెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో సోమవారం దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితులు స్థానికులు గణేష్ (22), చంద్రశేఖర్ (29), గోకుల్‌క్రిష్ణ అని తెలిసింది. వారు వినియోగిస్తున్న కారుతో పాటు 7 సెల్‌ఫోన్‌లు, లాటరీ టికెట్లు, రూ. 1.50 లక్షల నగదును స్వాధీనపరుచుకొన్నారు.

పరిషత్‌లో బీజేపీ నేత ఎవరో?

శివాజీనగర: మరో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఆరంభమవుతున్న నేపథ్యంలో విధానపరిషత్‌లో బీజేపీ పక్ష నేత పదవి భర్తీకి బీజేపీ ప్రయత్నాలు ఆరంభించింది. ఈ పదవిలోనున్న కోటా శ్రీనివాస పూజారి ఉడుపి-చిక్కమగళూరు ఎంపీగా ఎన్నిక కావడం తెలిసిందే. రేసులో సీటీ రవి, ఎన్.రవికుమార్ తదితరులు ఉన్నారు. మరో ఎమ్మెల్సీ అయితే తానే బీజేపీ పక్ష నేత అని ప్రచారం చేసుకుంటున్నారు.

108 అడుగుల బేతాళ విగ్రహం స్థాపన

కేజీఎఫ్: నగరంలో 108 అడుగుల బేతాళ విగ్రహాన్ని సోమవారం 10 మందికి పైగా అఘోరీల సమక్షంలో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా బేతాళ విగ్రహానికి కుంభాభిషేకం నిర్వహించారు. ముందుగా భద్రకాళి, కాళభైరవేశ్వర, ప్రత్యంగిరా, కాటేరమ్మ, కరికట్ట దేవతల ప్రతిష్టాపన, కుంభాభిషేకాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన చంద్రకాంత్ తనకు కలలో గ్రామంలో బేతాళ విగ్రహాన్ని స్థాపించాలని సూచించడంతో ఇల్లు విడిచి వెళ్లి అఘోరీలతో కలిసి వారితో విద్య నేర్చుకుని తిరిగి గ్రామానికి వచ్చి విగ్రహాన్ని స్థాపించారు. ప్రస్తుతం గ్రామంతో పాటు జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా, ఆంధ్ర, తమిళనాడులో చంద్రకాంత్‌కు శిష్య బృందం ఉన్నారు. బేతాళ విగ్రహ స్థాపనకు హాజరైన భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

డెంగీ, చికెన్‌గున్యాలపై జాగృతి జాతా



జాతాలో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: తాలూకాలోని లక్ష్మీపుర గ్రామంలో గ్రామ పంచాయతీ సహకారంతో ఆరోగ్య శాఖ అధికారులు సోమవారం డెంగీ, చికెన్ గున్యాలపై జాగృతి జాతాను నిర్వహించారు. జాతాను ప్రారంభించి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జబీవుల్లా మాట్లాడుతూ తీవ్ర జ్వరం, ఒళ్లు, కీళ్లనొప్పులు, తలనొప్పి, వాంతులు, వికారం, నోరు, ముక్కుల నుంచి, చర్మంపై అక్కడక్కడ రక్తస్రావం కనిపిస్తే తక్షణం వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. డెంగీని అరికట్టడానికి ముందు జాగ్రత్తగా నీటి తొట్టెలు, డ్రమ్ములు, బ్యారెళ్లు, ట్యాంకర్లను కనీసం వారానికోసారి శుభ్రం చేయాలన్నారు. టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఎయిర్ కూలర్, పూల కుండీలు, ఫైర్ బకెట్ తదితరాలను ప్రతి వారానికోసారి శుభ్రం చేసి దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదే సమయంలో డెంగీ, చికెన్ గున్యా నియంత్రణపై గ్రామస్తులకు కరపత్రాలను పంచారు.

డీ ఫార్మసీలో ర్యాంకు



పూజా

చింతామణి: 2022-23న జరిగిన డీ ఫార్మసీ పరీక్ష ఫలితాల్లో చింతామణి లక్ష్మీ విద్యాసంస్థల విద్యార్థిని పూజా రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించడంతో యాజమాన్యం ఆమెను సోమవారం సత్కరించింది. విద్యార్థిని శిడ్లఘట్ట తాలూకా దిబ్బురహళ్లి రోడ్డులో చిన్నపాటి హోటల్‌తో జీవనం సాగిస్తున్న బసవరాజ్, వనజ దంపతుల కుమార్తె. పూజా ఎంతో కష్టపడి ఉత్తమ ర్యాంకు సాధించిందని విద్యా సంస్థల అధినేత నరసింహా రెడ్డి కొనియాడారు.

మైసుగర్ కరెంటు బిల్లు మాఫీ?

శివాజీనగర: మండ్య మై సుగర్ చక్కెర కర్మాగారం విద్యుత్ బిల్లు బకాయిలను మాఫీ చేసే విషయమై పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. గత 25 సంవత్సరాల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించలేదు. రూ.52.25 కోట్లు బకాయిలు చెల్లించాలని చెస్కాం సంస్థ మైసుగర్‌కు నోటీస్ ఇచ్చింది. ఆ సంస్థ బిల్లులు చెల్లించే పరిస్థితిలో లేదు. దీంతో నాయకులు, రైతులు ఈ బిల్లుల మాఫీ కోసం వినతి చేశారు.

శ్మశానానికి దారివ్వరూ..



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన దృశ్యం

కేజీఎఫ్: శ్మశానానికి వెళ్లే దారిలో అక్రమణలను తొలగించి దారిని కల్పించాలని కోరుతూ తాలూకాలోని కాలువలహళ్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ చాలా ఏళ్లుగా గ్రామ సర్వే నెంబర్-181, 182, 189, 190లో కాలువలహళ్లి గ్రామ శ్మశానం, బెళగానకెరెకు వెళ్లే దారి రికార్డుల్లో ఉన్నా కొంతమంది అతిక్రమించుకుని దారి లేదంటున్నారన్నారు. దీంతో శ్మశానానికి మృతదేహాలను తీసుకు వెళ్లడం కష్టంగా ఉందన్నారు. అక్రమణలను తొలగించి శ్మశానానికి మృతదేహాల తరలింపునకు అనుకూలం కల్పించాలని తహసీల్దార్‌కు విన్నవించారు. వెంకటేష్, జయరామిరెడ్డి, యర్రప్ప, సుబ్రమణి తదితరులు ఉన్నారు.

జిల్లా ఎస్పీకి సన్మానం



సన్మానం అందుకుంటున్న ఎస్పీ నిఖిల్

కోలారు: జిల్లా ఎస్పీ నిఖిల్‌కుమార్‌ను దళిత సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమన్వయ సమితి సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో దళితులపై నిరంతరంగా జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టి రక్షణ కల్పించాలని కోరారు. కర్ణాటక హితరక్షణ వేదిక సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నారాయణస్వామి, కర్ణాటక దళిత నాగరిక సమితి రాష్ట్ర అధ్యక్షుడు పురహళ్లి జి.యల్లప్ప, నాగనాళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీగా బాధ్యతల స్వీకారం

రాయచూరు రూరల్: జిల్లా ఎస్పీ నిఖిల్ కోలారుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బెంగళూరు లోకాయుక్త ఎస్పీగా ఉన్న పుట్టమాదయ్య ఆదివారం అధికార బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీ శివకుమార్ చేతుల మీదుగా బాధ్యతలను అందుకున్నారు.

క్లుప్తంగా

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



పోస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: బెంగళూరు నగర జిల్లా కృష్ణరాజపురంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఇందులో నర్సింగ్ విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ సేవనం వల్ల కలిగే అనర్థాలు వివరించారు. ఆరోగ్యశాఖ వైద్యాధికారి డాక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ...డ్రగ్స్ సేవనం వల్ల జీవితాలు నాశనమవుతాయని, మత్తులో పడి విచక్షణ కోల్పోయి నేరాలు చేస్తారన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.

నిరంతర కృషితోనే లక్ష్య సాధన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ మంజునాథ్ తదితరులు

గౌరిబిదనూరు: నిరంతర కృషితోనే ఏదైనా సాధ్యమని మాగడి ఎస్ఐ మంజునాథ్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాలలో సాంఘిక శాస్త్రం, ఐక్యూఏసి సహకారంతో సమాజ అభివృద్ధిలో వృత్తి నిర్వహణ, సాంఘిక జవాబుదారి అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమం, డిగ్రీ చివరి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ...విద్యార్థి దశలో మొబైల్‌కు కొంచె దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్ చంద్ర దత్త, సాంఘిక శాస్త్రం ముఖ్యస్తులు డా అంజుళ, ఉపన్యాసకులు గిరిధర్ పాల్గొన్నారు.

స్కూటరిస్టు దుర్మరణం

మైసూరు: ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేస్తూ స్కూటరిస్టు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. నంజనగూడు పట్టణంలో స్థానికుడు చంద్రశేఖర్ ఐస్‌క్రీం వ్యాపారం చేస్తుంటాడు. స్కూటర్‌లో హోటల్‌కు ఐస్‌క్రీములను సరఫరా చేయడానికి వెళ్తూ హుల్లహళ్ళి రోడ్డులో ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయతి్నంచాడు. అయితే అదుపు తప్పి లారీని ఢీకొని కిందపడడంతో తీవ్ర గాయాలతో అక్కడే మరణించాడు. ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

తాగునీటి పైప్‌లో డ్రైనేజీ నీరు



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జ్యోతి గణేశ్

తుమకూరు: తుమకూరు నగరంలోని పాలికె పరిధి 30వ వార్డు విజయనగర లేఔట్‌లో గత కొన్ని రోజులుగా తాగునీటి పైప్‌లైన్‌లో డ్రైనేజీ నీరు కలిసి వస్తుంటాన్ని ఎమ్మెల్యే జ్యోతి గణేశ్ పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన సోమవారం ఆయా ప్రాంతాల్లోని నీటి సంప్‌లను స్వయంగా పరిశీలించారు. 30 వార్డులోని 20 ఇళ్లల్లోని నీటి సంప్‌లోకి డ్రైనేజీ నీరు కలిసి వస్తోందని, గుర్తించామని, డ్రైనేజీ పైప్ ఎక్కడ పగిలిందో చూడాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

యశవంతపుర: కుటుంబ కలహాలతో నర్సింగ్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జాళహళ్లి పరిధిలోని మదర్ థెరిసా కాలేజీలో చదువుతున్న దియా మండోల్ ఆత్మహత్య చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దియా కళాశాల హాస్టల్‌లో ఉంటుంది. ఇటీవల కుటుంబంలో ఏర్పడిన సమస్యలతో విరక్తి చెంది మూడు రోజుల క్రితం హాస్టల్ గదిలో ఉరి వేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మొక్కలు నాటిన సభ్యులు



మొక్కనాటి నీరు పోస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: పరిసరాల సంరక్షణతో పాటు అందరం ఆరోగ్యంగా ఉండటానికి ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని మంగమ్మపాళ్య కాంగ్రెస్ నాయకుడు జగదీష్‌గౌడ అన్నారు. సోమవారం నగరంలోని బొమ్మనహళ్లి పరిధి మంగమ్మపాళ్యలో ఉన్న మంగమ్మనపాళ్య చెరువు చుట్టు పక్కలతో పాటు అక్కడున్న ఉద్యానవనంలో కన్నడ మనసుగు సభ్యుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కలు నాటి వాటి సంరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కన్నడ మనసుగు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బెంగళూరులో వైఎస్సార్ జయంతి వేడుకల్లో అభిమానులు



బాణసవాడిలో వైస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మారతహళ్లిలో వైఎస్సార్ జయంతి కార్యక్రమం

సంక్షేమ సారథి వైఎస్సార్

ఆరోగ్యశ్రీ ప్రదాత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను బెంగళూరులో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఆ మహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు.

- జనహృదయ నేతకు ఘన నివాళి
- ఘనంగా వైఎస్సార్ జయంతి



థణిసంద్రలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అభిమానులు



పేదలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: పేదలతో పాటు రైతులకు, మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన మహా నాయకుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి అని అభిమాని కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మహానేత 75 జయంతి వేడుకల సందర్భంగా బెంగళూరు హెచ్ఎస్ఆర్ లేఔట్‌లోని అటల్‌బిహారి వాజ్‌పేయి క్రీడా మైదానం సమీపంలో ఉన్న కూల్ సర్కిల్లో యోగి వేమన విగ్రహం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పించి కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో మందికి ప్రాణదానం చేశారని, ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. వేడుకల్లో కలసపాడు మండలం, ఎగువ తంబళ్ళపల్లె వై.ఎస్ఆర్‌సీపీ ఎంపీటీసీ కొండా దామోదర్ రెడ్డి, హెచ్ఎస్ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి.వాసుదేవ రెడ్డి, కే. బ్రహ్మానందరెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, పిల్లారెడ్డి, తిరుమల శంకర్ రెడ్డి, గోపి, బీ.మోహన్‌కుమార్, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

బాణసవాడిలో...

బనశంకరి: డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి భావితరాల దార్శనికుడని సీపీ బ్రౌన్ సేవా సమితి అధ్యక్షుడు, వైస్సాఆర్‌సీపీనేత ఇడమకంటి లక్ష్మిరెడ్డి తెలిపారు. బాణసవాడిలో సీపీ బ్రౌన్‌సేవా సమితి అధ్యక్షుడు ఇడమకంటి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమల్లోకి తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకంతో లక్షలాది మంది ఉన్నత చదువులు చదివి నేడు ఐటీబీటీ కంపెనీల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జలయజ్ఞం పేరుతో అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిన అపరభగీరథుడుగా నిలిచారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ముఖ్యమంత్రిగా అందించిన సేవలు మరువలేమన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సాల్మాన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళులు

బనశంకరి: థణిసంద్రలో మహానేత, దివంగత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజంపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ అభిమానులు కే.సుధాకర్, రాజేశ్, ఆనంద్‌ల ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేసిన మహోన్నతనేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజలు గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.సుబ్రమణ్యం, సెల్వి, హేమా, నాగరాజు, చందన తదితరులు పాల్గొన్నారు.

మారతహళ్లిలో..

బనశంకరి: మారతహళ్లిలో దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి, వెంకటరెడ్డి, జగన్, శ్రీనివాసులు యాదవ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణంలో సోదాలు

తుమకూరు: అధికారుల నుంచి ఎటువంటి అనుమతి లేకుండా రసాయన మందులు విక్రయిస్తున్న దుకాణంపై వ్యవసాయ అధికారులు దాడి చేసి సీజ్ చేసిన ఘటన జిల్లాలోని గుబ్బి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలో ఎలాంటి అనుమతి లేకుండా పంటలకు పిచికారి చేసే మందులు విక్రయిస్తున్న ఓ ఆగ్రోటెక్ దుకాణంపై అధికారులు దాడి చేసి కీటక నాశిని మందులను స్వాధీనం దుకాణం సీజ్ చేశారు.

మద్యం మత్తులో వ్యక్తి దారుణ హత్య

కృష్ణరాజపురం: మద్యం మత్తులో వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన నగరంలోని కోణనకుంటె పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హతుడిని బాలాజీగా గుర్తించారు. ఇతను నేపాల్‌కు చెందిన కార్మికుడు. ఇక్కడ పని కోసం వచ్చి నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి మద్యం తాగారు. ఆ సమయంలో మద్యం మత్తులో జరిగిన గొడవలో బాలాజీని స్నేహితులు హత్య చేసినట్లు సమాచారం కోణనకుంటె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విష జ్వరాలపై జాగృతి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బనశంకరి: అంటురోగాలైన డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా పట్ల విద్యార్థులతో జాగృతి కార్యక్రమం చేపట్టారు. సోమవారం సంపంగిరామనగర బీబీఎంపీ పాఠశాల బాలలు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. జ్వరాల నియంత్రణ చర్యల గురించి నినాదాలు చేస్తూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. దోమలు పెరగకుండా అందరూ జాగ్రత్త వహించాలని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

తుమకూరు: తుమకూరు నగర సమీపంలో క్యాత్సంద్ర పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను దిలీప్, సంతోశ్, రంగనాథ్, పవన్, పవన్ కుమార్‌గా గుర్తించారు. వీరు విద్యా సంస్థల వద్ద గంజాయి విక్రయిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేశారు.

ఘనంగా జానపద సంబరాలు



సంబరాలు ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: కళలకు తల్లి వేరైన జానపద కళలను పరిచయం చేయడంలో శ్రీనివాస కళా సంఘం ఏర్పాటు చేసిన జానపద సంబరాలు చాలా అర్థపూర్వకంగా ఉన్నాయని కళాశ్రీ డాక్టర్. లక్ష్మణదాస్ అన్నారు. తుమకూరు తాలూకా స్వాందేనహళ్లి గ్రామంలో శ్రీ వినాయక సాంస్కృతిక కళా సంఘం బెజ్జిహళ్లి, శిరా సహకారంతో కన్నడ సాంస్కృతి శాఖ, తమకూరు వర్శిటీ అధ్యయన, పరిశోధన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంబరాల కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. తుమకూరు వర్సిటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వారా రాష్ట్రంలో వివిధ సమాజ కార్యక్రమాలతో పాటు జానపద సంబరాలు, సాంస్కృతిక కార్యక్రమాలను పరిచయం చేయడం జరిగిందన్నారు. జానపదం అంటేనే సంబరాల పండుగ అని అన్నారు. ప్రతి ఒక్కరూ కళల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు.

గురు పూజోత్సవంలో పాల్గొనండి



పోస్టర్లను విడుదల చేస్తున్న బలిజ నాయకులు

గౌరిబిదనూరు: ఈనెల19, 20, 21 తేదీలలో చింతామణి తాలూకా కైవారంలో జరగనున్న గురుపూజా, సంగీతోత్సవాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని నారాయణ తాత కృపకు పాత్రులు కావాలని బలిజ యువ గర్జన తాలూకా అధ్యక్షుడు జీఏ ప్రదీప్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయయంత్రం బలిజ యువ గర్జన కార్యాలయంలో జరిగిన పోస్టర్ల విడుదల కార్యక్రమంలో మాట్లాడుతూ... భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలలో సేవలందించాలన్నారు. ప్రధాన కార్యదర్శి హోటల్ రమేశ్ బాబు మాట్లాడుతూ... సంగీతోత్సవంలో దేశం నలుమూలలనుండి సంగీత కళాకారులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఛత్రం వెంకటాద్రి, అనిల్‌కుమార్, వేణుగోపాల్, ఆంజనేయులు, రవికుమార్, వెంకటేశ్, జీఆర్ రాజు, సుధాకర్, పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

సీసీ ఫుటేజీలో ఏటీఎం దొంగల ఆనవాళ్లు



సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం

యశవంతపుర: బెంగళూరు బెళ్లందూరు ఏటీఎంలో ఈ నెల 6న చోరీ జరిగింది. దొంగలు బెడ్‌షీట్ చుట్టుకుని ఏటీఎంలోకి చొరబడి రూ.16.56 లక్షలు నగదును దోచుకెళ్లారు. బెంగళూరు సమీపంలోని హోసూరు పరిధిలో ఈ ఘటన జరిగింది. దొంగలు ఏటీఎంలో అమర్చిన సీసీ కెమెరాలకు నల్లటి స్టిక్కర్ అంటించారు. అనంతరం గ్యాస్ కట్టర్‌ను ఉపయోగించి నగదు దోచుకెళ్లారు. ఓ దొంగ ఏటీఎంలోకి బెడ్‌షీట్ చుట్టుకుని వస్తున్న దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డైంది వీరు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని పోలీసులు అనుమానిస్తున్నారు.

కూలీకెళ్లి కరెంటు షాక్‌తో బాలుడు మృతి

క్రిష్ణగిరి: కుటుంబ పోషణకు చదువుకుంటూ, మరో వైపు కూలిపనులు చేస్తున్న బాలుడు కరెంటు షాక్‌తో మరణించాడు. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని వెంద్రవల్లి గ్రామానికి చెందిన లక్ష్మణ కొడుకు ఆనంద్ (17), తండ్రి గతంలో మృతి చెందడంతో తల్లి అంబిక పోషణలో ఉంటూ వచ్చాడు. తల్లి సంపాదన కుటుంబ పోషణకు చాలకపోవడంతో సెలవు రోజుల్లో ఆనంద్ కూలిపనులకెళ్లేవాడు. ఆదివారం ఉదయం అదే ప్రాంతానికి చెందిన రైతు పొలంలో నీరు పెట్టేందు కెళ్లగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగను గమనించక తొక్కడంతో కరెంటు షాక్‌తో మృతి చెందాడు. సాయంత్రమైనా కొడుకు ఇంటికి రాకపోవడంతో భయపడిన తల్లి పొలం వద్దకెళ్లి చూడగా బాలుడు శవంగా కనిపించాడు. పోచ్చంపల్లి పోలీసులు బాలుని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. కొడుకు మరణంతో తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని మొరపెట్టుకుంది.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి



ప్రజా సమస్యలను ఆలకిస్తున్న ఎమ్మెల్యే ప్రదీప్

చిక్కబళ్లాపురం: తాలూకా పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జనస్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. వివిధ సమస్యలకు సంబంధించి 32 వినతులు వచ్చాయని, వాటిని త్వరితగతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీసీ భాస్కర్, సబ్ కలెక్టర్ అశ్విన్, తహసీల్దార్ అనిల్, తాలూకా అధికారులు పాల్గొన్నారు.

మహిళలను వేధించిన పోకిరీలు



పోకిరీలను వీడియో తీస్తున్న దృశ్యం

యశవంతపుర: కారులో కుటుంబంతో వెళ్తున్న మహిళలను బైక్‌లో యువకులు వెంబడించి వేధించిన ఘటన బెంగళూరు నాగరభావి రింగ్‌రోడ్డులో అర్ధరాత్రి జరిగింది. కారు ముందు వీలింగ్ చేయటంతో పాటు కారులోని మహిళలను భయభ్రాంతులకు గురి చేశారు. ఘటనకు సంబంధించి బాధిత మహిళ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అర్ధరాత్రి కారులో వెళ్తుండగా రెండు బైకులపై యువకుల గుంపు ప్రమాదకరంగా వీలింగ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తించారని, మొబైల్‌ను లాక్కొవడానికి యత్నించారని అన్నారు. బెంగళూరు నగర పోలీసులు వెంటనే స్పందించి రంగంలోకి దిగారు.

మంగళూరులో చోరీ

మంగళూరు నగరంలోని కోడికల్ వివేకానంద నగరంలో దొంగలు పడ్డారు. శనివారం తెల్లవారుజామున ఓ ఇంటి కిటికి రాడ్లు తొలగించి బీరువాలో ఉన్న రూ. 10 వేల నగదు దోచుకెళ్లారు. మంగళూరు కోడికల్ వివేకానంద నగరకు చెందిన ప్రదీప్ ఇంటిలో ఈ చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హోసూరు వార్తలు..

బాలిక అపహరణ

హోసూరు: తమ కూతురిని కిడ్నాప్ చేశాడని తల్లిదండ్రులు డెంకణీకోట మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు అంచెట్టి తాలూకా సింగోట గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు అంతటా గాలించారు. స్థానికుల సమాచారం మేరకు అదే గ్రామానికి చెందిన కుమార్ (25) అనే యువకుడు బాలికను కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి అరెస్ట్

హోసూరు: హత్య కేసులో సాక్ష్యం చెప్పరాదని బెదిరించిన వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... హోసూరు కార్పొరేషన్ పరిధిలోని శానసంద్రం ప్రాంతానికి చెందిన రబీక్ (34) ఓ హత్య కేసులో సాక్షిగా ఉన్నాడు. రెండు రోజుల క్రితం అతన్ని ఫోన్ ద్వారా సంప్రదించిన పార్వతీనగర్‌కు చెందిన ఉస్మాన్ (34) నీవు సాక్ష్యం చెబుతున్న హత్య కేసు నా మిత్రుడిదని, కోర్టులో సాక్ష్యం మార్చి చెప్పాలని బెదిరించాడు. ఈ ఘటనపై భయపడిన రబీక్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ఉస్మాన్‌ను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న డ్రైవర్ అరెస్ట్

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి ప్రాంతం నుంచి ఆంధ్రకు రేషన్ బియ్యం తరలిస్తున్న డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... క్రిష్ణగిరి ప్రాంతం నుంచి ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు పెద్ద ఎత్తున రేషన్ బియ్యం తరలింపు జరుగుతోందని ఆహార భద్రతాశాఖ ఐజీ జోషి నిర్మల్‌కుమార్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు కోయంబత్తూరు డీఎస్పీ చంద్రశేఖర్, సేలం ఏఎస్పీ విజయ్‌కుమార్ నేతృత్వంలో క్రిష్ణగిరి సబ్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ ప్రకాష్ బృందం ఆదివారం సాయంత్రం తిరువణ్ణామలై రోడ్డుపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమంలో వచ్చిన ఓ వాహనాన్ని తనిఖీ చేయగా 1.5 టన్నులు రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేయగా చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతానికి చెందిన సతీష్ (25)గా గుర్తించారు. క్రిష్ణగిరి, తిరువణ్ణామలై తదితర ప్రాంతాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆంధ్రకు తరలిస్తున్నట్లు తెలిసింది. రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ శరయుకు ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. తాగునీరు, వృద్ధాప్యపెన్షన్, కుట్టుయంత్రాలు, ఇళ్లపట్టాలు, మురికి కాల్వల ఏర్పాటు, రోడ్ల వసతి, స్వయం ఉపాధి రుణాలు కోరుతూ 380 ఫిర్యాదులను అందజేశారు. పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా 31 మంది లబ్ధిదారులకు రూ. 9.49 లక్షల విలువ చేసే సంక్షేమ పథకాలను అందజేశారు. అధికారులు పన్నీర్ సెల్వం, రమేష్‌కుమార్, బాబు, మురుగేషన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికునిపై దాడి

హోసూరు: కార్మికునిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను ఉద్దనపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు ఉద్దనపల్లి సమీపంలోని సిగర్లపల్లి గ్రామానికి చెందిన సురేష్ (23) అదే ప్రాంతంలోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మిత్రుడు యువరాజ్ (19). మరో యువకుడు ముత్తు (23)కు పరిశ్రమలో పని ఇప్పించాలని సురేష్‌ను డిమాండ్ చేస్తూ వచ్చారు. పని ఇప్పించలేదని ఆదివారం సాయంత్రం గొడవ జరిగింది. యువరాజ్, ముత్తులు కలిసి సురేష్‌పై దాడి చేశారు. ఉద్దనపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్ట్ చేశారు.

బందిపోట్లతో బేజారు

- క్రిష్ణగిరి జిల్లాలో తరచూ భారీ దోపిడీలు
- ప్రజల్లో గుబులు గుబులు





హోసూరుకు దేశం నలుమూలల నుంచి రాకపోకలు పెరిగాయి, దోపిడీ దొంగల దాడులతో ప్రజల బెంబేలు

హోసూరు: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న క్రిష్ణగిరి జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా దొంగల బెడద ఎక్కువైంది. ప్రధానంగా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, ఏటీఎం కేంద్రాలపై దోపిడీలకు పాల్పడి పెద్ద ఎత్తున డబ్బులను దోచుకెళుతున్నారు. గత 2015న జిల్లా కేంద్రం క్రిష్ణగిరి జిల్లా కుందారపల్లి రామాపురం సమీపంలో నిర్వహిస్తున్న బరోడా బ్యాంకులో గుర్తు తెలియని దుండగులు దోపిడీకి పాల్పడి రూ. 12 కోట్ల విలువ చేసే బంగారు నగలను దోచుకెళ్లారు. ఈ ఘటనలో క్రిష్ణగిరి పోలీసులు ఉత్తరప్రదేశ్, బిహార్ ప్రాంతాలకు చెందిన ఘరానా దొంగలను అరెస్ట్ చేశారు. కానీ ఇంత వరకు వారి వద్ద నుంచి నగలు స్వాధీనపరుచుకోలేదు.

కొన్ని భారీ దోపిడీ సంఘటనలు

- 2020 అక్టోబర్ నెలలో సూళగిరి సమీపంలోని అళగుబావి వద్ద కోట్ల విలువ చేసే సెల్‌ఫోన్‌లను తరలిస్తున్న లారీని హైజాక్ చేసి సెల్‌ఫోన్‌లను దోచుకెళ్లారు. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన నిందితులను అరెస్ట్ చేశారు కాని సెల్‌ఫోన్‌లు పూర్తిగా స్వాధీనపరుచుకోలేదు.
- గత 2021న జనవరి 20వ తేదీ హోసూరులోని ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలో గుర్తు తెలియని దుండగులు తుపాకులతో వెళ్లి ఉద్యోగులను బెదిరించి రూ. 15 కోట్ల విలువ చేసే నగలను దోచుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి 7 మంది నిందితులను అరెస్టు చేసి 7 తుపాకులను సీజ్ చేసి, రూ. 15 కోట్ల విలువ చేసే నగలను స్వాధీనపరుచుకొన్నారు.
- ఇదిలా ఉండగా గత కొద్దిరోజుల క్రితం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలోని ఓ ఏటీఎం కేంద్రాన్ని బద్దలుకొట్టి రూ. 20 లక్షలు దోచుకెళ్లారు. హోసూరులో గత వారం రోజులుగా రెండు ఏటిఎం కేంద్రాల్లో దోపిడీకి పాల్పడి ఓ ఏటీఎం కేంద్రంలో రూ. 14 లక్షలు దోచుకెళ్లారు. ఇవి కాకుండా నిత్యం చిన్నా చితకా దొంగతనాలు సాధారణం.

తక్షణం అరికట్టాలి

వరుస దోపిడీలతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఏ సమయంలో దోపిడీదొంగలు చొరబడి తమ డబ్బు, నగలను ఎత్తుకెళ్తారోనని ప్రజలు భయపడుతున్నారు. పోలీసులు కఠిన చర్యలు చేపట్టి దొంగలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు.

స్పోర్ట్స్



భారత ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ పదవికి 291 దరఖాస్తులు

ఖాళీగా ఉన్న భారత సీనియర్ పురుషుల హెడ్ కోచ్ పదవి కోసం 291 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ జాబితాలో భారత జట్టు మాజీ సభ్యుడు, గతంలో మోహన్ బగాన్ క్లబ్, ఈస్ట్ బెంగాల్ క్లబ్ జట్లకు కోచ్‌గా ఉన్న స్టాన్లీ రొజారియో... నార్త్ ఈస్ట్ యునైటెడ్ క్లబ్ అసిస్టెంట్ కోచ్ నౌషాద్ మూసా కూడా ఉన్నారు. 64 ఏళ్ల రొజారియో సర్వీసెస్‌తో తన కోచింగ్ కెరీర్‌ను మొదలుపెట్టి 2006 నుంచి 2008 వరకు టీమిండియాకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించారు. ఈ నెలాఖరుకు కొత్త కోచ్‌ను నియమిస్తారు.

తొలి విజయం కోసం...



అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో భాగంగా మయన్మార్ జట్టుతో భారత జట్టు రెండు మ్యాచ్‌లు ఆడనుంది. యాంగూన్‌లో నేడు జరిగే తొలి మ్యాచ్‌లో ఆశాలతా దేవి సారథ్యంలో భారత్ బరిలోకి దిగనుంది. తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ కూడా టీమిండియాకు ప్రాతినిధ్యం వహించనుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 67వ స్థానంలో ఉన్న భారత జట్టు ఇప్పటివరకు ఐదుసార్లు మయన్మార్ జట్టుతో తలపడినా ఒక్కసారీ విజయం సాధించలేదు. నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిన టీమిండియా ఒక మ్యాచ్‌ను మాత్రం 'డ్రా' చేసుకుంది.



ఎమ్మా నవారో


కోకో గాఫ్

కోకో గాఫ్ పరాజయం

ఎమ్మా నవారో సంచలన విజయం

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో మరో సంచలనం నమోదైంది. మహిళల సింగిల్స్ విభాగంలో ఇప్పటికే ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) ఇంటిముఖం పట్టగా... తాజాగా ప్రపంచ రెండో ర్యాంకర్, రెండో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) కూడా ఈ జాబితాలో చేరింది. గత ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన 20 ఏళ్ల కోకో గాఫ్‌కు వింబుల్డన్ టోర్నీ మరోసారి కలిసిరాలేదు. ఐదో ప్రయత్నంలోనూ ఆమె ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేదు. అమెరికాకే చెందిన 23 ఏళ్ల ఎమ్మా నవారో ధాటికి కోకో గాఫ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. 74 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 17వ ర్యాంకర్ ఎమ్మా నవారో 6-4, 6-3తో కోకో గాఫ్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. నెట్ వద్దకు దూసుకొచ్చిన 9 సార్లూ పాయింట్లు నెగ్గిన నవారో ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6-3, 3-0తో కలిన్‌స్కాయా (రష్యా; గాయంతో రెండో సెట్ మధ్యలో వైదొలిగింది)పై... 13వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) 6-2, 6-3తో పుతింత్‌సెవా (కజకిస్తాన్)పై... స్వితోలినా (ఉక్రెయిన్) 6-2, 6-1తో జిన్‌యు వాంగ్ (చైనా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.


జ్వెరెవ్

నాలుగో సీడ్ జ్వెరెవ్‌కు షాక్

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. 13వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 3 గంటల 29 నిమిషాల్లో 4-6, 6-7 (4/7), 6-4, 7-6 (7/3), 6-3తో జ్వెరెవ్‌పై సంచలన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఎనిమిదో ప్రయత్నంలోనూ జ్వెరెవ్ వింబుల్డన్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమించలేకపోయాడు. ఇటలీ ప్లేయర్ లొరెంజో ముసెట్టి తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తు, 98 కేజీల బరువున్న పెరికార్డ్ (ఫ్రాన్స్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ముసెట్టి 4-6, 6-3, 6-3, 6-2తో గెలిచాడు.

పతాకధారిగా సింధు

పారిస్ ఒలింపిక్స్‌లో భారత బృందాన్ని ముందుండి నడిపించనున్న స్టార్ షట్లర్

న్యూఢిల్లీ: వరుసగా మూడో ఒలింపిక్స్‌లోనూ పతకంపై గురి పెట్టిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు గొప్ప గౌరవం లభించింది. పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొనే భారత క్రీడాకారుల బృందానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సింధు నేతృత్వం వహించనుంది. విశ్వ క్రీడల్లో పతాకధారిగా వ్యవహరించనున్న సింధు భారత బృందాన్ని ముందుండి నడిపించనుంది. మరో ఫ్లాగ్ బేరర్‌గా తమిళనాడుకు చెందిన దిగ్గజ టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్ ఆచంట శరత్ కమల్ వ్యవహరిస్తాడు. ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న 41 ఏళ్ల శరత్‌ను పతాకధారిగా గత మార్చి నెలలోనే భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్ జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి.

విశ్వ క్రీడా వేదికపై లింగ సమానత్వం ఉండాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ 2020 టోక్యో ఒలింపిక్స్ నుంచి ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయా దేశాలు పురుష ఫ్లాగ్ బేరర్‌తోపాటు ఒక మహిళా ఫ్లాగ్ బేరర్‌కు కూడా అవకాశం ఇవ్వాలనే నిబంధనను అమల్లోకి తెచ్చింది. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ నుంచి హాకీ ప్లేయర్ మన్‌ప్రీత్ సింగ్, మహిళా బాక్సర్ మేరీకోమ్ పతాకధారులుగా వ్యవహరించారు. వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు నెగ్గిన ఏకైక భారత మహిళా క్రీడాకారిణిగా గుర్తింపు పొందిన 29 ఏళ్ల సింధు 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో ఫ్లాగ్ బేరర్‌గా గౌరవం పొందింది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన సింధు, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం కై వసం చేసుకుంది. పారిస్ క్రీడల్లోనూ సింధు పతకం సాధిస్తే ఒలింపిక్స్ చరిత్రలో మూడు వ్యక్తిగత పతకాలు నెగ్గిన ఏకైక భారతీయ ప్లేయర్‌గా సింధు రికార్డు సృష్టిస్తుంది. సింధు కంటే ముందు రెజ్లర్ సుశీల్ కుమార్ మాత్రమే ఒలింపిక్స్‌లో రెండు వ్యక్తిగత పతకాలుసాధించాడు.

చెఫ్ డి మిషన్‌గా గగన్ నారంగ్



మరోవైపు పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత క్రీడాకారుల బృందానికి చెఫ్ డి మిషన్‌గా తెలంగాణ షూటర్ గగన్ నారంగ్ వ్యవహరిస్తాడు. ముందుగా మేరీ కోమ్‌ను చెఫ్ డి మిషన్‌గా ప్రకటించినా వ్యక్తిగత కారణాలరీత్యా ఈ బాధ్యతలు తీసుకోలేనని ఆమె ప్రకటించింది. దాంతో గగన్ నారంగ్‌కు చెఫ్ డి మిషన్ బాధ్యతలు అప్పగిస్తున్నామని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపింది. చెఫ్ డి మిషన్ హోదాలో గగన్ ఒలింపిక్స్‌లో పాల్గొనే మొత్తం భారత క్రీడాకారుల వ్యవహారాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. 41 ఏళ్ల గగన్ నారంగ్ 2012 లండన్ ఒలింపిక్స్‌లో పురుషుల షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించాడు.



4 భారత్ తరఫున ఒలింపిక్స్ క్రీడల్లో ఫ్లాగ్ బేరర్‌గా వ్యవహరించనున్న నాలుగో మహిళా క్రీడాకారిణిగా పీవీ సింధు గుర్తింపు పొందనుంది. గతంలో ఈ ఘనత షైనీ విల్సన్, అంజూ బాబీ జార్జి, మేరీకోమ్‌లకు మాత్రమే దక్కింది. అథ్లెట్ షైనీ విల్సన్ 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌లో... లాంగ్‌జంపర్ అంజూ బాబీ జార్జి 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో... బాక్సర్ మేరీకోమ్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ఫ్లాగ్ బేరర్స్‌గా ఉన్నారు.



ఫైనల్ బెర్త్ ఎవరిదో!

- నేడు 'యూరో' తొలి సెమీఫైనల్లో స్పెయిన్‌తో ఫ్రాన్స్ 'ఢీ'
- అర్ధరాత్రి గం. 12:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మ్యూనిక్: ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలిచి జోరు మీదున్న స్పెయిన్... నిలకడలేమితో సతమతమవుతున్న ఫ్రాన్స్... 'యూరో' కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఫైనల్లో చోటు కోసం నేడు తొలి సెమీఫైనల్లో 'ఢీ'కొననున్నాయి. సెమీఫైనల్ చేరే క్రమంలో స్పెయిన్ 11 గోల్స్ చేయగా... ఫ్రాన్స్ మూడు గోల్స్ సాధించింది. 'యూరో' టోర్నీ చరిత్రలో ఈ రెండు జట్ల మధ్య ఆరు మ్యాచ్‌లు జరిగాయి. నాలుగు సార్లు ఫ్రాన్స్ గెలుపొందగా...ఒక మ్యాచ్ 'డ్రా'గా ముగిసి, ఒక మ్యాచ్‌లో స్పెయిన్ నెగ్గింది.

శ్రీలంక హెడ్ కోచ్‌గా జయసూర్య



కొలంబో: తన క్రికెట్ కెరీర్‌లో ఇప్పటికే జాతీయ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా... చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించిన శ్రీలంక మాజీ స్టార్ సనత్ జయసూర్య మరో కొత్త పాత్రలో కనిపించనున్నాడు. ఇటీవల కాలంలో ఆశించిన విజయాలు అందుకోలేకపోతున్న శ్రీలంక పురుషుల జట్టుకు తాత్కాలిక హెడ్ కోచ్‌గా 55 ఏళ్ల సనత్ జయసూర్యను నియమించారు. ఈనెలాఖరులో స్వదేశంలో భారత జట్టుతో జరిగే మూడు టి20, మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ నుంచి జయసూర్య హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తాడు. అనంతరం ఆగస్టు-సెప్టెంబర్‌లలో ఇంగ్లండ్‌లో జరిగే సిరీస్ వరకు అతను ఈ పదవిలో ఉంటాడు. గత నెలలో అమెరికా-వెస్టిండీస్‌లలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో హెడ్ కోచ్ క్రిస్ సిల్వర్‌వుడ్ పర్యవేక్షణలో శ్రీలంక జట్టు లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. దాంతో సిల్వర్‌వుడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మెగా ఈవెంట్ సందర్భంగా లంక జట్టుకు జయసూర్య క్రికెట్ కన్సల్టెంట్‌గా పని చేశాడు. జయసూర్య 1989 నుంచి 2011 మధ్యకాలంలో శ్రీలంక జట్టు తరఫున 110 టెస్టులు ఆడి 6973 పరుగులు... 445 వన్డేలు ఆడి 13430 పరుగులు... 31 టి20 మ్యాచ్‌లు ఆడి 629 పరుగులు సాధించాడు. అంతేకాకుండా మూడు ఫార్మాట్‌లలో కలిపి మొత్తం 440 వికెట్లు కూడా పడగొట్టాడు. 1996 వన్డే ప్రపంచకప్ టైటిల్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన జయసూర్య 2010 నుంచి 2015 వరకు శ్రీలంక పార్లమెంట్ సభ్యుడిగా వ్యవహరించాడు.

గ్లోబల్ చెస్ లీగ్‌లో అశ్విన్

అమెరికన్ గ్యాంబిట్స్ జట్టుకు సహ యజమానిగా భారత క్రికెటర్



న్యూఢిల్లీ: భారత సీనియర్ స్టార్ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ చెస్‌లో అడుగు పెట్టాడు. గ్లోబల్ చెస్ లీగ్‌లో ఈసారి కొత్తగా చేరిన అమెరికన్ గ్యాంబిట్స్ జట్టుకు అశ్విన్ సహ యజమానిగా ఉన్నాడు. గత ఏడాది పోటీపడిన చింగారీ గల్ఫ్ టైటాన్స్ జట్టు స్థానంలో కొత్తగా అమెరికన్ గ్యాంబిట్స్ జట్టు వచ్చింది. టెక్ మహీంద్రా, అంతర్జాతీయ చెస్ సమాఖ్యసంయుక్త ఆధ్వర్యంలో గత ఏడాది దుబాయ్‌లో తొలి గ్లోబల్ చెస్ లీగ్ జరిగింది. ఈ ఏడాది టోర్నీకి లండన్ నగరం వేదిక కానుంది. అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు ఆరు జట్ల మధ్య గ్లోబల్ చెస్ లీగ్ రెండో ఎడిషన్ జరగనుంది.

సమం కోసం చివరి పోరు

- నేడు దక్షిణాఫ్రికాతో భారత మహిళల టి20 మ్యాచ్
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



చెన్నై: దక్షిణాఫ్రికా జట్టుపై వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి... ఏకైక టెస్టులోనూ ఘనవిజయం సాధించిన భారత మహిళల జట్టుకు టి20 సిరీస్ కలిసి రాలేదు. తొలి మ్యాచ్‌లో 12 పరుగుల తేడాతో ఓడిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి రెండో టి20లో విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు వరుణుడు అవకాశం ఇవ్వలేదు. దాంతో రెండో టి20 ఫలితం తేలకుండానే ముగిసింది. ఈ నేపథ్యంలో నేడు జరిగే చివరిదైన మూడో టి20లో గెలిచి సిరీస్‌ను 1-1తో సమం చేయాలని టీమిండియా పట్టుదలతో ఉంది. అయితే మంగళవారం కూడా వర్ష సూచన ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత బౌలర్లు రాణించలేకపోయారు. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే చివరి మ్యాచ్‌లో భారత బౌలర్ల నుంచి కట్టుదిట్టమైన బౌలింగ్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఆశిస్తోంది.

సినిమా


మహేశ్‌బాబు

భారతీయుడు సందేశం సమాజానికి చేరాలి - కమల్‌హాసన్


శంకర్, కమల్‌హాసన్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్

''ప్రపంచంలో జనాభా పెరుగుతున్న కొద్దీ కరప్షన్ పెరిగిపోతోంది. లంచాల నిర్మూలనకు మనం గట్టిగా ప్రయత్నించడం లేదు. ఈ అంశాలతో రూపొందిన చిత్రం 'భారతీయుడు 2'. ఈ సినిమాలోని సందేశం సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరాలి'' అని కమల్‌హాసన్ అన్నారు. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా నటించిన చిత్రం 'భారతీయుడు 2'. సిద్ధార్థ్, బాబీ సింహా, రకుల్‌ప్రీత్ సింగ్ ఇతర పాత్రల్లో నటించారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగులో 'భారతీయుడు 2', తమిళంలో 'ఇండియన్ 2', హిందీలో 'హిందుస్తానీ 2' పేరుతో ఈ నెల 12న విడుదల కానుంది. తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ లక్ష్మి మూవీస్ విడుదల చేస్తున్నాయి. సోమవారం జరిగిన సమావేశంలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''నా కెరీర్ ఆరంభంలో తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో సినిమాలు చేసినా సరైన హిట్టు పడలేదు. తెలుగులో నాకు 'మరోచరిత్ర, ఆకలి రాజ్యం, సాగర సంగమం, స్వాతి ముత్యం' వంటి ఎన్నో హిట్స్ వచ్చాయి. తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ని చేశారు. బాలచందర్‌గారు, విశ్వనాథ్‌గారు నన్నెంతో ప్రోత్సహించారు'' అన్నారు. ''భారతీయుడు'కి సీక్వెల్ తీయాలని ముందు అనుకోలేదు. అయితే కరప్షన్ వార్తలు చదివినప్పుడు నాకు సేనాపతి గుర్తుకు వచ్చేవాడు. ఆ ఆలోచనతో 'భారతీయుడు 2' తీశాను'' అన్నారు శంకర్. ''వినోదం, సందేశంతో తీసే సినిమాలు అద్భుతంగా ఉంటాయి. 'భారతీయుడు'ని తెలుగులో భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు నిర్మాత సురేష్‌బాబు.

విలన్‌గా కూడా..?

మహేశ్‌బాబు విలన్ పాత్రలో కనిపిస్తే ఎలా ఉంటారు? అనే చర్చ జరుగుతోంది. ఈ చర్చకు కారణం లేకపోలేదు. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మహేశ్ రెండు పాత్రల్లో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఒకటి హీరో పాత్ర అన్నది కన్ఫార్మ్. రెండోది విలన్ అని సమాచారం. కాగా విలన్ పాత్రకు మలయాళ నటుడు పృథ్వీరాజ్‌ని అనుకున్నారనే వార్త వచ్చింది. ఆ తర్వాత విక్రమ్ పేరు వినిపించింది. అయితే ఈ రెండు పాత్రలనూ మహేశ్‌బాబుతోనే చేయించాలని రాజమౌళి అనుకుంటున్నారట. ఆఫ్రికాలోని అమేజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ సినిమాలో మహేశ్ కొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఈ మధ్య కండలు తిరిగిన దేహం, కాస్త లెంగ్తీ హెయిర్, గడ్డంతో కొత్తగా కనిపిస్తున్నారు మహేశ్. రాజమౌళి సినిమా కోసమే ఇలా మేకోవర్ అయ్యారని సమాచారం. త్వరలో ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభించాలని అనుకుంటున్నారు. మరి... ఈ సినిమాలో మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారా? అదే నిజమైతే హీరో... విలన్‌గానా? లేక రెండు పాజిటివ్ క్యారెక్టర్సా? అనేది తెలియాల్సి ఉంది.

శ్రీలంకలో ఫైట్



ఫైట్ చేయడానికి ఇండియా నుంచి శ్రీలంక వెళ్లారు విజయ్ దేవరకొండ. అయితే ఇది సినిమా ఫైట్. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ని శ్రీలంకలో ప్లాన్ చేసింది యూనిట్. ఈ చిత్రీకరణలో పాల్గొనడానికే విజయ్ దేవరకొండ శ్రీలంక వెళ్లారు. అక్కడ ఓ భారీ రిస్కీ ఫైట్‌ని చిత్రీకరించనున్నారని సమాచారం. దాదాపు ఇరవై రోజుల పాటు శ్రీలంక షెడ్యూల్ జరుగుతుందట. స్పై థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారు.

విజయ్ దేవరకొండ

దేవసేన శోభ


మోహన్‌బాబు, మనోజ్, మౌనిక

హీరో మంచు మనోజ్, మౌనిక దంపతుల కుమార్తె నామకరణం జరిగింది. ఏప్రిల్ 13న మౌనిక పాపకి జన్మనిచ్చారు. తమ కుమార్తెకు దేవసేన శోభ ఎంఎం అంటూ నామకరణం చేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు మనోజ్. ''ఆ పరమేశ్వరుడి భక్తులమైన మేము సాక్షాత్తు శివుని తనయుడైన సుబ్రహ్మణ్య స్వామి సతీమణి దేవసేన పేరును మా పాపకు పెట్టుకున్నాం. మా అత్త గారు దివంగత శోభా నాగిరెడ్డిగారి పేరు నుంచి శోభ పేరును తీసుకున్నాం. ఇప్పటికే ఎంఎం పులి అనే ముద్దు పేరు ద్వారా మా బిడ్డ అందరికీ బాగా తెలుసు. ఇవన్నీ కలిపి దేవసేన శోభ ఎంఎం అని నామకరణం చేశాం. మా జీవితంలో అండగా ఉంటూ మాకు కొండంత బలంగా నిలుస్తున్న మా తల్లిదండ్రులు నిర్మలా దేవి, మోహన్‌బాబు, మా అత్తమామలు శోభ, నాగిరెడ్డిల ఆశీస్సులు మాకెప్పుడూ ఉంటాయి. ప్రతి విషయంలో నాకు తోడుగా ఉంటున్న మా అక్క లక్ష్మికి ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు మనోజ్.

పవర్‌ఫుల్ పోలీస్

ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటించిన చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహించారు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ నిర్మించిన ఈ సినిమా నుంచి ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్.


'షణ్ముఖ' పోస్టర్

ఈ సందర్భంగా షణ్ముగం సాప్పని మాట్లాడుతూ– ''డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రం 'షణ్ముఖ'. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందించాం. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా ఆది నటించారు. ఈ మూవీ తన కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. 'కేజీఎఫ్, సలార్' చిత్రాలకు తన సంగీతంతో ప్రాణం పోసిన రవి బస్రూర్ ఈ చిత్రానికి అద్భుతమైన మ్యూజిక్‌ను అందించారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ మూవీని అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.

నా సభ్యత్వం పునరుద్ధరించాలి - హేమ


మంచు విష్ణు, హేమ

బెంగళూరులో మే 19న జరిగిన రేవ్ పార్టీ కేసులో నటి హేమ అరెస్టు కావడం, ఆ తర్వాత బెయిల్‌పై విడుదల కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) హేమ ప్రాథమిక సభ్యత్వాన్ని సస్పెండ్ చేసింది. కాగా తన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలంటూ తాజాగా హేమ ఓ లేఖ రాశారు. ఈ లేఖని 'మా' వ్యవస్థాపకుడు చిరంజీవికి పంపడంతో పాటు ప్రస్తుత 'మా' అధ్యక్షుడు మంచు విష్ణుకి స్వయంగా అందించారు. ''దాదాపు పదేళ్ల పాటు నేను 'మా'లో సభ్యురాలిగా ఉన్నాను. నెలరోజుల క్రితం జరిగిన ఒక రేవ్ పార్టీలో నేను పాల్గొని, మత్తు పదార్థాలు తీసుకున్నానని నాపై దుష్ప్రచారం చేశారు. దీంతో నా కుటుంబ సభ్యులకు తీవ్రమైన వేదన మిగిలింది. నాపై వచ్చిన ఆరోపణలతో 'మా' సభ్యత్వాన్ని సస్పెండ్ చేశారు. ఈ నిర్ణయం నాలో అంతులేని ఆవేదనను కలిగించింది. 'మా' బైలాస్ ప్రకారం ముందుగా నాకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలి. నా వివరణలో లోపాలు ఉంటే నాపై చర్యలు తీసుకోవాలి. ఎలాంటి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం తగదు. నా సస్పెన్షన్‌ను ఎత్తివేసి నా సభ్యత్వాన్ని పునరుద్ధరించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు నాపై కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు. దానివల్ల నేను ఇబ్బందులపాలవుతున్నాను. వాటినుంచి రక్షించాల్సిన బాధ్యత 'మా'పై ఉంది'' అని ఆ లేఖలో పేర్కొన్నారు హేమ. ఆమె లేఖపై 'మా' ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రవి సిరోర్, నివిష్కా పాటిల్ జంటగా ఎస్‌జీఆర్ దర్శకత్వం వహించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఎవరు ఎందుకు..?'. జి. వెంకటేశ్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను దివంగత నటులు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ– ''వెంకటేశ్ రెడ్డి ఎప్పటి నుంచో ప్రభాస్ అభిమానిగా ఉన్నారు. ఆయన నిర్మాతగా మారడం సంతోషంగా ఉంది. ప్రభాస్ ఫ్యాన్స్ నుంచి ఇంకా దర్శకులు, నిర్మాతలు, యాక్టర్స్ రావాలి'' అన్నారు. ''మంచి ఎమోషనల్ ఫ్యామిలీ సబ్జెక్ట్ ఇది'' అన్నారు వెంకటేశ్ రెడ్డి. ''మంచి ఫ్యామిలీ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో మూడు పాటలు నేనే రాశాను. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు ఎస్‌జీఆర్. ఈ సినిమాకు సహ–నిర్మాతలు: పీడీఆర్ ప్రసాద్ రెడ్డి, కె. వినయ్ రెడ్డి.


శ్యామలాదేవి, వెంకటేశ్ రెడ్డి

భాస్కర్ డేట్ ఫిక్స్


దుల్కర్ సల్మాన్

భాస్కర్‌గా దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో కనిపించనున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. మీనాక్షి చౌదరి కథానాయిక. 1980–90ల కాలంలో అసాధారణ స్థాయికి చేరుకున్న ఒక సాధారణ బ్యాంక్ క్యాషియర్ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సెప్టెంబర్ 7న 'లక్కీ భాస్కర్'ని రిలీజ్ చేయనున్నట్లు సోమవారం యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. ''ముంబైలోని బ్యాంకులో పని చేసే క్యాషియర్‌గా కనిపిస్తారు దుల్కర్. నాటి ముంబై నగరాన్ని, భారీ బ్యాంకు సెట్‌ని హైదరాబాద్‌లో రూపొందించాం. భాస్కర్ అసాధారణ ప్రయాణంలో ప్రేక్షకులు లీనమైపోతారు'' అని యూనిట్ పేర్కొంది.

చతుర్.. వితుర్

అనసూయ భరద్వాజ్, సాయికుమార్, వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, శ్రీకాంత్ అయ్యంగార్, శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. జయశంకర్ దర్శకత్వం వహించారు. ఆర్‌వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మించిన 'అరి' త్వరలో విడుదల కానుంది. కాగా ఈ సినిమాలో చతుర్, వితుర్ అనే పండితుల పాత్రల్లో శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర నటించారు. వారి క్యారెక్టర్స్ ఫస్ట్ లుక్‌ను సోమవారం చిత్రబృందం విడుదల చేసింది.


శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
36	3
79,960	24,321

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,401	△	49
డోజోన్స్	39,341	▽	35
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,193	▽	10
డాక్స్	18,472	▽	3
షాంఘై	2,922	▽	27
నికాయ్	40,781	▽	132

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	72,746
బంగారం (99.5 స్వచ్ఛత)	72,455
వెండి (కిలో)	91,733

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.06	84.08
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.44	107.80
€	యూరో	ఎస్‌బీఐ	89.27	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.30	57.28
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

డిస్కౌంట్ల షికారు!

కార్ల కంపెనీల ఆఫర్ల 'వర్షం'
- భారీగా ధరల తగ్గింపు...
- ఆకర్షించే ఎక్స్చేంజ్ స్కీమ్‌లు
- రాత్రి వరకు షోరూమ్‌లు బార్లా
- సేల్స్ పెంచుకునే వ్యూహాలు



వానాకాలం వచ్చేసింది. దీనికి తోడు కార్ల కంపెనీల ఆఫర్ల వర్షం కూడా మొదలైపోయింది. అయితే, ఈ ఏడాది డిస్కౌంట్ల మోత మరింతగా మోగుతోంది. సార్వత్రిక ఎన్నికలు, మండుటెండల దెబ్బకు వేసవి సీజన్‌లో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవు. షోరూమ్‌లకు కస్టమర్ల రాక కూడా భారీగా తగ్గిపోయింది. మరోపక్క, వర్షాకాలంలో విక్రయాల తగ్గుదల కూడా పరిపాటే. ఈ పరిస్థితిని మార్చేందుకు, ఏదో రకంగా విక్రయాలు పెంచుకునేందుకు కంపెనీలు పలురకాల వ్యూహాలను అమలు చేస్తున్నాయి. భారీ డిస్కౌంట్ ధరలతో ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా ప్రారంభ స్థాయి మోడళ్లపై ఎక్కువ డిస్కౌంట్‌లు ఆఫర్ చేస్తున్నాయి. పాత కార్ల ఎక్స్చేంజ్‌పై మంచి ధర, అదనపు బోనస్, బహుమతులను కూడా అందిస్తున్నాయి.

బలహీన సీజన్...

పండుగలు పెద్దగా లేకపోవడంతో పాటు, వర్షాలు ఎప్పుడు పడతాయో ఊహించని పరిస్థితులు ఉంటాయి. దీంతో కస్టమర్లు ఈ సీజన్‌లో కొనుగోళ్ల ప్రణాళికలను వాయిదా వేసుకుని.. దసరా, దీపావళి సమయాల్లో కొనుగోళ్లకు మొగ్గుచూపిస్తుంటారు. అందుకే ఏటా వర్షాకాలంలో అమ్మకాలు పెంచుకునేందుకు దేశవ్యాప్తంగా డీలర్లు డిస్కౌంట్లు, ఇతరత్రా స్కీమ్‌లను అమలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పలు మోడల్ కార్లపై రూ.20 వేల నుంచి రూ.4 లక్షల వరకు తగ్గింపు ఆఫర్లు అమల్లో ఉన్నాయి. ముఖ్యంగా గతేడాది వర్షాకాలం కంటే ఈ ఏడాది డిస్కౌంట్లు కూడా పెరిగాయి. వేసవిలో విక్రయాలు తగ్గడంతో డీలర్ల వద్ద వాహన నిల్వలు పేరుకుపోయాయి. వీటిని తగ్గించుకోవాలంటే డీలర్లు విక్రయాలు పెంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

డబుల్ బెనిఫిట్...

డిమాండ్ పెంచేందుకు కార్ల కంపెనీలు.. స్టాక్‌ను తగ్గించుకునేందుకు డీలర్ల స్థాయిలోనూ డిస్కౌంట్ ఆఫర్లు నడుస్తున్నాయి. 'గతేడాది ఇదే సీజన్‌లో కొన్ని కార్ల మోడళ్లకు కొరత నెలకొంది. వెయిటింగ్ వ్యవధి కూడా పెరిగింది. కానీ, ఈ ఏడాది చాలా మోడళ్ల డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయి. ఇదే కస్టమర్లకు ఆఫర్లకు కారణం' అని ఫాడా ప్రెసిడెంట్ మనీష్‌రాజ్ సింఘానియా తెలిపారు. మారుతీ ఆల్టో కే10పై రూ.40 వేలు, ఎస్-ప్రెస్సో, వ్యాగన్‌ఆర్‌పై రూ.25,000-30,000, స్విఫ్ట్ మోడళ్లపై రూ.15,000-20,000 వరకు తగ్గింపు ఆఫర్లు నడుస్తున్నాయి. బాలెనో పెట్రోల్ ఎంటీ వెర్షన్‌పై రూ.35 వేలు, పెట్రోల్ ఏజీఎస్ వెర్షన్‌పై రూ.40 వేల వరకు, ఎక్స్ఎల్6 పెట్రోల్ వేరియంట్‌పై 20 వేలు, సీఎన్‌జీ వేరియంట్‌పై రూ.15 వేల వరకు తగ్గింపు లభిస్తోంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఉచిత విదేశీ ట్రిప్..!

'హోండా మ్యాజికల్ మాన్సూన్' పేరుతో హోండా కార్స్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. అన్ని కార్లపై బహుమతులు, ఇతర ప్రయోజనాలను ఇందులో భాగంగా అందిస్తోంది. ముఖ్యంగా జూలై నెలలో కొనుగోలుదారుల నుంచి విజేతలను ఎంపిక చేసి, వారికి స్విట్జర్లాండ్ ఉచిత పర్యటన, రూ.75,000 వరకు నగదు బహుమతులను ఆఫర్ చేస్తోంది. హోండా కారు కొనుగోలుపై ఈ పరిమిత కాల ఆఫర్ తమ డీలర్లందరి వద్దా అందుబాటులో ఉన్నట్టు హోండా కార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ తెలిపారు.





బ్లాక్‌స్టోన్ చేతికి హల్దీరామ్స్!

- మెజారిటీ వాటా కొనుగోలుకు రెడీ
- కంపెనీ విలువ రూ. 70,000 కోట్లుగా అంచనా

న్యూఢిల్లీ: స్నాక్స్ తయారీ దిగ్గజం హల్దీరామ్స్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకి ప్రయివేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఇప్పటికే ప్రారంభించిన చర్చలు తుది దశకు చేరినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, సింగపూర్ సంస్థ జీఐసీతో జత కట్టిన బ్లాక్‌స్టోన్ కొద్ది నెలలుగా హల్దీరామ్స్ ప్రమోటర్లు అగర్వాల్ కుటుంబంతో చర్చలు నిర్వహిస్తున్నట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. అయితే బిజినెస్ విలువ విషయంలో అంగీకారం కుదరకపోవడంతో చర్చలు నిలిచిపోయాయి. కాగా.. స్నాక్స్ విభాగంలో దేశీయంగా ప్రధాన కంపెనీగా నిలుస్తున్న హల్దీరామ్స్‌లో నియంత్రిత వాటాను సొంతం చేసుకునేందుకు బ్లాక్‌స్టోన్ ఇంక్ ప్రస్తుతం చర్చల్లో ఇటీవల పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ఒక అంచనా ప్రకారం రూ. 70,000 కోట్ల విలువలో హల్దీరామ్స్ కొనుగోలుకి డీల్ కుదిరే వీలున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

76%పై కన్ను

హల్దీరామ్స్‌లో 76 శాతం వాటా కొనుగోలుపై బ్లాక్‌స్టోన్ కన్సార్షియం కన్నేసినట్లు తెలుస్తోంది. అయితే అగర్వాల్ కుటుంబం భారీ వాటా విక్రయానికి సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా కంపెనీ విలువ నిర్ధారణలోనూ అంగీకారం కుదరనట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రమోటర్లలో కొంతమంది 51 శాతం వాటా విక్రయానికి మాత్రమే ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశాయి. ఒకవేళ బ్లాక్‌స్టోన్‌తో ఒప్పందం కుదిరితే దేశీయంగా అతిపెద్ద పీఈ డీల్‌గా చరిత్ర సృష్టించే వీలున్నట్లు పేర్కొన్నాయి. చర్చలు ఏక్షణమైనా విఫలమైతే ఇతర ప్రత్యామ్నాయాలను సైతం అగర్వాల్ కుటుంబం సిద్ధం చేసుకుంటున్నట్లు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే పబ్లిక్ ఇష్యూకి సైతం తెరతీసే యోచనలో ఉన్నట్లు తెలియజేశాయి. అగర్వాల్ కుటుంబం ఢిల్లీ, నాగ్‌పూర్ బ్రాంచీల ఎఫ్ఎంసీజీ బిజినెస్‌ను విలీనం చేసే ప్రణాళికల్లో ఉంది. హల్దీరామ్ స్నాక్స్ పీవీటీ లిమిటెడ్, హల్దీరామ్ ఫుడ్స్ ఇంటర్నేషనల్ పీవీటీ లిమిటెడ్ విలీనం ద్వారా హల్దీరామ్ స్నాక్ ఫుడ్స్ పీవీటీ లిమిటెడ్‌గా ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీలో ఢిల్లీ బ్రాంచ్ 56 శాతం, నాగ్‌పూర్ బ్రాంచ్ 44 శాతం చొప్పున వాటాను తీసుకోనున్నాయి.

కాంపిటీషన్ కమిషన్ అనుమతి

విలీనానికి ఇప్పటికే కాంపిటీషన్ కమిషన్ అనుమతించింది. బ్లాక్‌స్టోన్ కన్సార్షియం 8–8.5 బిలియన్ డాలర్ల విలువను మదింపు చేయగా.. అగర్వాల్ కుటుంబం 12 బిలియన్ డాలర్లను ఆశిస్తోంది. కాగా, హల్దీరామ్స్‌లో వాటాకు బెయిన్ అండ్ కంపెనీ, టిమాసెక్ హోల్డింగ్స్ సైతం బిడ్స్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

మెర్సిడెస్ ఈవీ @ 66 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ భారత మార్కెట్లో ఈక్యూఏ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఆవిష్కరించింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.66 లక్షలు. కంపెనీ నుంచి చిన్న, అందుబాటు ధరలో లభించే ఎలక్ట్రిక్ వెహికల్ ఇదే. 70.5 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 560 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 8.6 సెకన్లలో అందుకుంటుంది. గరిష్ట వేగం గంటకు 160 కిలోమీటర్లు. ఏడు ఎయిర్‌బ్యాగ్స్ ఏర్పాటు చేశారు. జీఎల్‌ఏ ప్లాట్‌ఫామ్‌పై రూపుదిద్దుకున్న ఈ కాంపాక్ట్ క్రాస్‌ఓవర్ మెర్సిడెస్ నుంచి భారత్‌లో నాల్గవ బ్యాటరీ ఎలక్ట్రిక్ కారు. 2024 చివరినాటికి మరో రెండు ఈవీలు రానున్నాయి. తొలిసారిగా లగ్జరీ కార్ల కొనుగోలుదారులను ఆకర్షించడానికి ఎలక్ట్రిక్ ఎంట్రీ-లెవల్ మోడళ్లను కంపెనీ పరిచయం చేస్తోందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు.

హెచ్‌సీఎల్ రోష్నీ నాడార్‌కు ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రాను .. ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారంతో గౌరవించింది. వ్యాపార, పర్యావరణ అనుకూల రంగాల్లో చేస్తున్న కృషికి గాను ఆమెకు ప్రతిష్టాత్మకమైన 'షెవాలీర్ డి లా లెజియన్ డి హానర్' ('నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్') లభించినట్లు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పురస్కారాన్ని అందుకోవడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, భారత్ .. ఫ్రాన్స్ మధ్య పటిష్టమైన భాగస్వామ్యానికి ఇది నిదర్శనమని రోష్నీ తెలిపారు. తమకు కీలక మార్కెట్లలో ఒకటైన ఫ్రాన్స్‌లో కార్యకలాపాలను మరింతగా విస్తరించనున్నామని ఆమె పేర్కొన్నారు.

సూచీలకు స్వల్ప నష్టాలు

- గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ
- మెటల్, ఫార్మా షేర్లలో అమ్మకాలు



ముంబై: స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే అంశాలేవీ లేకపోవడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఆసియా మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు స్థిరీకరణలో భాగంగా రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. చివరికి సెన్సెక్స్ 36 పాయింట్లు నష్టపోయి 79,960 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 265 పాయింట్లు పతనమై 79,732 వద్ద కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ మూడు పాయింట్లు నష్టపోయి 24,321 వద్ద నిలిచింది. కన్జూమర్ డ్యూరబుల్స్, మెటల్, టెలికం, సర్వీసెస్, ఫార్మా, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. పేటీఎంను 100 బిలియన్ డాలర్ల సంస్థగా తీర్చిదిద్దడమే తన ఆశయమని వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ వ్యాఖ్యలతో కంపెనీ షేరు 8% పెరిగి రూ.472 వద్ద స్థిరపడింది.

జూలై 14 వరకే జోయాలుక్కాస్ ఆఫర్

హైదరాబాద్: బంగారం, వజ్రాలు, ప్రెషస్, వెండి ఆభరణాల మజూరీ చార్జీలపై ఫ్లాట్ 50% తగ్గింపు 'అతుల్యమైన జ్యువెలరీ సేల్' ఆఫర్ జూలై 14న ముగుస్తుందని జోయాలుక్కాస్ తెలిపింది. ఈ జూన్‌లో ప్రకటించిన ఈ ఆఫర్ ఎంతోమంది దృష్టిని ఆకర్షించిందని పేర్కొంది. కేవలం కొన్ని రోజులే ఉండటంతో ప్రతి ఒక్కరూ ఆఫర్‌ను ఉపయోగించుకోవాలని కంపెనీ ఎండీ జోయ్ అలుక్కాస్ కోరారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

4 కంపెనీల ఐపీవోలకు ఓకే	ద్విచక్ర వాహన విక్రయాల జోరు

భవిత


- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ టెట్ జూలై-2024



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన పాఠశాల విద్యాశాఖ.. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్ జూలై-2024)నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పేపర్-1 ఏ ఎస్‌జీటీ టీచర్లకు, పేపర్-1 బీ ప్రత్యేక విద్య ఎస్‌జీటీ టీచర్లకు,పేపర్-2 ఏ స్కూల్ అసిస్టెంట్లకు, పేపర్-2 బీ ప్రత్యేక విద్య స్కూల్ అసిస్టెంట్లకు పరీక్ష నిర్వహిస్తారు. ట్రెన్డ్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లకు ప్రత్యేకంగా ఇంగ్లిష్ భాష నైపుణ్య పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు 1 నుంచి 5వ తరగతుల బోధనకు పేపర్-1(ఎ, బి), 6 నుంచి 8వ తరగతుల బోధనకు పేపర్-2 (ఎ, బి)లో అర్హత సాధించాల్సి ఉంటుంది. టెట్ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు ఉంటుంది. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.

» **అర్హత:** పేపర్‌ను బట్టి ఇంటర్మీడియట్, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీతో పాటు డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ లేదా తత్సమానం ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం చివరి ఏడాది చదివే అభ్యర్థులు అర్హులే.
» **పరీక్ష విధానం:** పేపర్-1 ఏ, పేపర్-1 బీ ఐదు విభాగాల్లో 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్-2 ఏ, పేపర్-2 బీ నాలుగు విభాగాల్లో మొత్తం 150 ప్రశ్నలకు-150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) ఉంటుంది. రోజుకు రెండు సెషన్లలో ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.08.2024.
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది:** 22.09.2024 నుంచి ప్రారంభం
» **పరీక్షల తేదీలు:** 03.10.2024 నుంచి 20.08.2024 వరకు
» **వెబ్‌సైట్:** https://aptet.apcfss.in

టీఎస్ సెట్-2024

ఉస్మానియా యూనివర్సిటీ.. తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీఎస్ సెట్)కు నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత పరీక్షగా టీఎస్ సెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

» **సబ్జెక్టులు:** జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్-అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, జర్నలిజం-మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, హిందీ, హిస్టరీ, లా, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ,ఎంఎస్సీ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ, ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ). రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
» **పరీక్ష కేంద్రాలు:** ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్, రంగారెడ్డి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆలస్య రుసుము రూ.2000 + రిజిస్ట్రేషన్ ఫీజుతో దరఖాస్తులకు చివరితేది:**16.07.2024
» **ఆలస్య రుసుము రూ.3000 రిజిస్ట్రేషన్ ఫీజుతో దరఖాస్తులకు చివరితేది:**26.07.2024
» **దరఖాస్తులో మార్పులకు అవకాశం:** 28.07.2024, 29.07.2024.
» **హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్ ప్రారంభం:**20.08.2024
» **పరీక్ష తేదీలు:** 28.08.2024, 29.08.2024, 30.08.2024, 31.08.2024.
» **వెబ్‌సైట్:** http://telanganaset.org

పదితో పదిలమైన కొలువు

» ఎంటీఎస్, హవాల్దార్ పోస్టులకు ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» మొత్తం 8,326 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» పే లెవల్-1తో ప్రారంభ వేతన శ్రేణి

పదో తరగతి మొదలు ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణుల వరకూ.. ప్రభుత్వ ఉద్యోగం ప్రతి ఒక్కరి స్వప్నం! అందులోనూ కేంద్ర ప్రభుత్వ కొలువుల పట్ల క్రేజ్ మాటల్లో చెప్పలేనిది!! పదో తరగతి అర్హతతోనే వివిధ పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో.. మొత్తం 8,326 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ-ఎంటీఎస్(మల్టీ టాస్కింగ్ స్టాఫ్), హవాల్దార్ నోటిఫికేషన్-2024 వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



భారీ సంఖ్యలో పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్-ఎంటీఎస్, హవాల్దార్-2024 నోటిఫికేషన్ ద్వారా.. కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో భారీ సంఖ్యలో పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. మొత్తం 4,887 మల్టీ టాస్కింగ్ (నాన్-టెక్నికల్)పోస్టులను;సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ),సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ (సీబీఎన్) విభాగాల్లో 3,439 హవాల్దార్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

తెలుగు రాష్ట్రాల్లో 242 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. ఎంటీఎస్, హవాల్దార్ నోటిఫికేషన్‌లో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 61 ఎంటీఎస్ పోస్టులు, విశాఖపట్నం సీజీఎస్‌టీలో 60 హవాల్దార్ పోస్టులు ఉన్నాయి. తెలంగాణలో 63 ఎంటీఎస్, హైదరాబాద్ సీజీఎస్‌టీ 58 హవాల్దార్ ఖాళీలను భర్తీ చేయనున్నారు. మొత్తంగా 242 పోస్టులను ఏపీ, తెలంగాణకు కేటాయించారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమకు ఆసక్తి ఉన్న రీజియన్, పోస్టులను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులు తమ రీజియన్‌తో సంబంధం లేకుండా.. దేశంలో ఎక్కడైనా పని చేయాల్సిన విధంగా సర్వీస్ నిబంధనలు ఉంటాయి.

అర్హతలు

2024,ఆగస్ట్ 1 నాటికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి. **వయసు:**ఎంటీఎస్ పోస్టులకు 18-25 ఏళ్లు, హవాల్దార్ పోస్టులకు, అదే విధంగా పలు శాఖల్లోని ఎంటీఎస్ పోస్టులకు 18-27 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు,పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 10 ఏళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్‌సీ ఎంటీఎస్, హవాల్దార్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో భాగంగా మూడు దశల్లో అభ్యర్థుల ప్రతిభను పరిశీలిస్తారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఎంటీఎస్ పోస్టులకు కేవలం రాత పరీక్ష ఉంటుంది. హవాల్దార్ పోస్టులకు మాత్రం ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారు.

రెండు సెషన్లలో రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియ తొలిదశలో నిర్వహించే రాత పరీక్ష రెండు సెషన్లుగా 270మార్కులకు ఉంటుంది. సెషన్-1లో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ 20 ప్రశ్నలు-60 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ 20 ప్రశ్నలు-60 మార్కులకు; అదేవిధంగా సెషన్-2లో జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు-75 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-75 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరుగుతుంది. ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సెషన్‌కు కేటాయించిన సమయం 45 నిమిషాలు. రెండో సెషన్‌లో మాత్రం నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది.

పీఈటీ, పీఎస్‌టీ

- రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. హవాల్దార్ పోస్టుల అభ్యర్థులకు మలి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లను నిర్వహిస్తారు.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా నడక పరీక్ష ఉంటుంది. ఇందులో పురుష అభ్యర్థులు 1,600 మీటర్లను 15 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు ఒక కిలో మీటర్ దూరాన్ని 20 నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.
- **ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో.. హవాల్దార్ పోస్టుల అభ్యర్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుష అభ్యర్థులు కనీసం 157.5 సెం.మీ ఎత్తు ఉండాలి. ఛాతీ విస్తీర్ణం 81 సెం.మీ ఉండాలి. శ్వాస తీసుకున్నప్పుడు అయిదు సెంటీమీటర్లు విస్తరించాలి.
- మహిళా అభ్యర్థులు కనీసం 152 సెం.మీ ఎత్తు ఉండాలి.

కనీస అర్హత మార్కులు

రాత పరీక్ష నుంచి అభ్యర్థులను తదుపరి దశకు ఎంపిక చేసే క్రమంలో కనీస అర్హత మార్కుల నిబంధన విధించారు. ప్రతి సెషన్‌లో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 25 శాతం మార్కులు; ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20 శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది. అదే విధంగా సెషన్-1లో కనీస అర్హత మార్కులు సాధిస్తేనే..సెషన్-2 పేపర్ల మూల్యాంకన చేస్తారు. సెషన్-2లో పొందిన ప్రతిభ ఆధారంగానే తుది జాబితా రూపొందిస్తారు.

ప్రారంభ వేతనం

ఎంపికైన అభ్యర్థులకు ప్రారంభంలోనే పే లెవల్-1తో రూ.18,000-రూ.56,900 వేతన శ్రేణిలో నెల వేతనం అందుకోవచ్చు. బేసిక్ పేతో పాటు ఇతర అలవెన్సులు కూడా లభిస్తాయి. దీంతో పాటు అర్హతలు పెంచుకుంటూ సంబంధిత డిపార్ట్‌మెంట్‌లు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణతతో ఆయా శాఖల్లో సెక్షన్ ఆఫీసర్, సూపరింటెండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూలై 31
- **ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు చివరి తేదీ:** 01.08.2024
- **దరఖాస్తుల సవరణకు అవకాశం:** ఆగస్టు 16, 17 తేదీల్లో
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీ:**అక్టోబర్/నవంబర్‌లో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:**www.ssc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

న్యూమరికల్, మ్యాథమెటికల్ ఎబిలిటీ

ఇందులో రాణించడానికి అర్థమెటిక్‌తోపాటు ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. నంబర్ సిస్టమ్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, పర్సంటేజెస్, రేషియోస్, అల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, లీనియర్ ఈక్వేషన్స్, టాంజెంట్స్ వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై పట్టు సాధించాలి.

రీజనింగ్ ఎబిలిటీ

సింబల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిలేషన్ షిప్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, సిమాటిక్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వెన్ డయాగ్రమ్స్, డ్రాయింగ్ ఇన్ఫరెన్సెస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ప్రత్యేక దృష్టితో చదవాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో ఏర్పడిన కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపైనా పట్టు సాధించాలి. సీహెచ్ఎస్ఎల్ అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌ను కీలకంగా భావించాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. స్టాక్ జీకేలో.. చరిత్ర-ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు-వాటి తీర్మానాలు, అవార్డులు-విజేతలు వంటి సమాచారాన్ని ఔపోసన పట్టాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

అభ్యర్థులు గ్రామర్‌పై పట్టు సాధించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్ మొదలు ప్యాసేజ్ కాంప్రహెన్షన్ వరకూ.. అన్ని రకాల గ్రామర్ అంశాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా యాక్టివ్ అండ్ పాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, సినానిమ్స్, యాంటానిమ్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై పట్టు సాధించాలి.

రివిజన్, మాక్ టెస్ట్‌లు

అభ్యర్థులు నిరంతరం పునశ్చరణ కొనసాగించాలి. నమూనా పరీక్షలు, మాక్ టెస్ట్‌లకు హాజరవ్వాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో.. అర్థమెటిక్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ఇందుకోసం పదో తరగతి స్థాయిలోని గణిత పుస్తకాలతో తమ ప్రిపరేషన్ ప్రారంభించాలి. వాటిద్వారా ముందుగా కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత అప్లికేషన్ దృక్పథంతో ప్రిపరేషన్, ప్రాక్టీస్ చేయాలి.

31 వరకు ఇంటర్ ప్రవేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని మేనేజ్‌మెంట్లలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలు ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతాయని ఇంటర్ బోర్డు డైరెక్టర్ నిధి మీనా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫేజ్–3 ప్రవేశాలను నిర్దేశించిన తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

'సెంచూరియన్'లో బీఎఫ్‌సీ కోర్సుకు ఐకార్ ఆమోదం

పర్లాకిమిడి: ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీలో ఇటీవల ప్రవేశపెట్టిన బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్(బీఎఫ్‌సీ) డిగ్రీ కోర్సుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐకార్) ఆమోదం తెలిపినట్లు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డీఎన్ రావు తెలిపారు. యూనివర్సిటీలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెంచూరియన్ క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ ఫిషరీస్‌లో పూర్తిస్థాయి శాఖలు, పరిశోధన ఫార్మ్ తోపాటు 22 చేపల చెరువులున్నాయని తెలిపారు. వీసీ ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్, డీన్ డాక్టర్ అనితాపాత్రో పాల్గొన్నారు.

ద.మ.రైల్వే డీజీఎంగా ఉదయనాథ్

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా కోట్ల ఉదయనాథ్ సోమవారం రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసెస్ 2012 బ్యాచ్‌కు చెందినవారు. ఉదయనాథ్ స్వస్థలం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. రైల్వేలో ఆర్థిక నిర్వహణ, అకౌంటెన్సీలో అపారమైన అనుభవం ఉంది. ఈ నియామకానికి ముందు, దక్షిణ మధ్య రైల్వేలోని కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్‌లో డిప్యూటీ ఫైనాన్షియల్ అడ్వైజర్, చీఫ్ అకౌంట్స్ అధికారిగా పనిచేశారు. పదేళ్లుగా సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో కీలక విధులు నిర్వహించారు.

'ఎంఈవో–2 పోస్టుకు పేరు మార్చాలి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎంఈవో–2 పోస్టుకు మండల పరిషత్ విద్యాశాఖ అధికారిగా పేరు మార్చాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. వీరికి మండల పరిషత్‌లోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల జీతాల చెల్లింపు, తనిఖీ అధికారాలు, శాఖాపరమైన అన్ని అధికారాలను బదలాయించాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.


సంక్షేమం.. సాధికారత

▶ మొదటి పేజీ తరువాయి

కనిపిస్తోందని తెలిపింది. వైఎస్ జగన్ ప్రభుత్వం మహిళలు, పిల్లల విద్య, ఆరోగ్యంతో పాటు సాధికారత దిశగా సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేసినట్లు నివేదిక విశ్లేషించింది.

▶ ఏపీలో గత ప్రభుత్వం అమలు చేసిన కొన్ని పథకాలను రీసెర్చ్ నివేదిక వ్యయంతో సహా ప్రముఖంగా ప్రస్తావించింది. ఏటా 47 లక్షల మంది పిల్లలకు జగనన్న విద్యా కానుక కింద యూనిఫాం, బ్యాగ్, బూట్లు, పాఠ్యపుస్తకాలు తదితరాలను ఉచితంగా అందచేశారని పేర్కొంది. జగనన్న అమ్మ ఒడి కింద పిల్లల తల్లుల ఖాతాల్లో పారదర్శకంగా నగదు జమ చేశారని, ఇవన్నీ మహిళలు, పిల్లల విద్యతో ముడిపడి రూపొందించిన సంక్షేమ పథకాలని తెలిపింది. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అర్హత కలిగిన ప్రతి మహిళకూ వైఎస్సార్ చేయూత పథకాన్ని అందించారని, పేద మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా దీన్ని రూపొందించారని వెల్లడించింది. జగనన్న గోరుముద్ద ద్వారా సుమారు 43 లక్షల మంది స్కూలు పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించారని, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాలను నివారించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారని ప్రశంసించింది. పొదుపు సంఘాల మహిళల (ఎస్‌హెచ్‌జీ) సాధికారతే లక్ష్యంగా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేశారని ఎస్‌బీఐ నివేదిక తెలిపింది. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత లక్ష్యంగా రూపొందించిన ఈ పథకాలు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొంది.

▶ ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో సగటు వార్షిక రెవెన్యూ రాబడులు 12 శాతం వృద్ధి నమోదు కాగా అందులో 11 శాతం మేర సంక్షేమ పథకాలకు వ్యయం చేసినట్లు రీసెర్చ్ నివేదిక తెలిపింది. మహారాష్ట్రలో గత ఐదేళ్లలో సగటు వార్షిక రెవెన్యూ రాబడులు 10 శాతం వృద్ధి చెందగా అందులో 11 శాతం సంక్షేమ పథకాలకు వ్యయం చేశారు. ఒడిశాలో ఐదేళ్లలో సగటు వార్షిక రెవెన్యూ రాబడుల్లో వృద్ధి 13 శాతం కాగా అందులో 8.10 శాతం సంక్షేమ పథకాలకు వ్యయం చేసినట్లు తెలిపింది. కేరళలో గత ఐదేళ్లలో సగటు వార్షిక రెవెన్యూ రాబడుల వృద్ధి 8 శాతం నమోదు కాగా అందులో 8 శాతం సంక్షేమ పథకాలకు వ్యయం చేశారు. కర్నాటక, పశ్చిమ బెంగాల్‌లో సగటు వార్షిక రెవెన్యూ రాబడుల వృద్ధి కంటే సంక్షేమ పథకాలకు కేటాయింపులు ఎక్కువగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. కర్నాటకలో సగటు వార్షిక రెవెన్యూ రాబడుల వృద్ధి 8 శాతం ఉండగా పథకాలకు కేటాయింపులు 15 శాతం ఉంది. పశ్చిమ బెంగాల్‌లో సగటు వార్షిక రెవెన్యూ రాబడుల వృద్ధి 8 శాతం ఉండగా పథకాలకు కేటాయింపులు 10 శాతంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.



ఏపీలో గత ఐదేళ్లలో అమలైన కొన్ని పథకాలు, బడ్జెట్ కేటాయింపులు, ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం

టెట్ వాయిదా

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఈ నెల రెండో తేదీన విడుదల చేసిన షెడ్యూల్‌లో ప్రభుత్వం మార్పులు చేసింది. అభ్యర్థులు ఆగస్టు 3 వరకు ఫీజు చెల్లించవచ్చని కమిషనర్ సురేశ్ కుమార్ తెలిపారు. పరీక్షలు అక్టోబర్ 3 నుంచి 20 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫలితాలను నవంబర్ 2న వెల్లడించనున్నారు. ఈ మేరకు సోమవారం పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తి వివరాలకు https://cse.ap.gov.in/ లో చూడొచ్చని తెలిపింది.

మారిన టెట్ షెడ్యూల్ ఇదీ..

- ఫీజులు చెల్లించేందుకు గడువు: 03–08–2024
- ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించేందుకు గడువు: 03/08/2024
- ఆన్‌లైన్‌లో మాక్ టెస్ట్ నిర్వహణ: 19/09/2024 నుంచి..
- హాల్‌టికెట్ల డౌన్‌లోడ్: 22/09/2024 నుంచి
- పరీక్షల నిర్వహణ: 03/10/2024 నుంచి 20/10/2024 వరకు
- ప్రాథమిక 'కీ': 04/10/2024 నుంచి
- 'కీ'పై అభ్యంతరాల స్వీకరణ: 05/10/2024 నుంచి 21/10/2024 వరకు
- ఫైనల్ 'కీ' విడుదల: 27/10/2024
- టెట్ ఫలితాల వెల్లడి: 02/11/2024

ఉన్నత విద్యలో వింతపోకడ!

- వీసీలు లేకుండానే పాలకమండలి సమావేశాలు
- విశ్వవిద్యాలయాల్లో టీడీపీ సర్కార్ విష సంస్కృతి

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలకు సంబంధించి వీసీలు లేకుండానే సోమవారం పాలకమండలి సమావేశాలు నిర్వహించారు. ఈ భేటీల్లో అనుబంధ కళాశాలల అఫిలియేషన్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. కాగా పాలకమండలి సమావేశం వీసీ అధ్యక్షతన నిర్వహించాలని విశ్వవిద్యాలయాల చట్టంలోనే ఉంది. అయితే టీడీపీ ప్రభుత్వం వీసీలతో రాజీనామాలు చేయించడంతో వర్సిటీల్లో పాలన గాడితప్పింది. పాలకమండలి సభ్యులు లేకుండా, కోరం లేకుండా కేవలం ఎక్స్ అఫీషియో సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. సాంకేతికంగా వీసీ అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరగకపోతే దానికి ఆమోదం లభించదు. దీంతో అధికారులు రాజీనామా చేసిన వీసీల పీఏలకు ఫోన్ చేసి వీసీలను వర్చువల్‌గా పాల్గొనాలని కోరారు. తమతో బలవంతంగా రాజీనామా చేయించారని, దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా మళ్లీ పాలకమండలి సమావేశాల్లో పాల్గొనడం ఏంటని వారు నిలదీసినట్టు తెలిసింది. కళాశాలల అఫిలియేషన్ ప్రక్రియకు సంబంధించిన అంశమని అధికారులు వివరించడంతో కొంతమంది వీసీలు పాల్గొన్నారు.

నేడు, రేపు మోస్తరు వానలు

సాక్షి, విశాఖపట్నం: కళింగపట్నం మీదుగా ఆగ్నేయంగా మధ్య బంగాళాఖాతంలో రుతుపవన ద్రోణి ఏర్పడింది. ఇది సముద్రమట్టానికి 3.1 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉంది. అదేవిధంగా దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది ప్రస్తుతం ఉత్తరాంధ్ర తీరంలో సముద్ర మట్టానికి 3.1 కి.మీ నుంచి 7.6 కి.మీ మధ్యలో విస్తరించి నైరుతి వైపు వంగి ఉంది. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో మంగళవారం, బుధవారం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. రాయలసీమలో పలుచోట్ల మోస్తరు వానలు పడే అవకాశాలున్నాయి.

ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్టు నోటిఫికేషన్ ఇవ్వొద్దు

- ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం
- అనర్హత వేటుపై హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్సీ జంగా



సాక్షి, అమరావతి: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నానంటూ వైఎస్సార్‌సీపీ విప్ లేళ్ల అప్పిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ జూన్ 15న జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి హైకోర్టును ఆశ్రయించారు. మండలి చైర్మన్ ఉత్తర్వులను కొట్టేసి, తనను శాసనమండలి సభ్యుడిగా కొనసాగేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్సీగా మండలి సమావేశాలకు హాజరయ్యేలా కూడా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. స్థానిక సంస్థల కోటా కింద తన స్థానం ఖాళీ అయినట్టు పేర్కొంటూ ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎన్నికల కమిషన్‌ను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి సోమవారం విచారణ జరిపారు. పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రవి ఆ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్టు పేర్కొంటూ నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని శాసనమండలి కార్యదర్శి, ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో మండలి చైర్మన్, విప్ అప్పిరెడ్డిలను ఆదేశించారు. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేశారు.

స్టడీ సర్కిల్స్‌లో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వాలి

సీఎం చంద్రబాబుకు కేవీపీఎస్ లేఖ

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ జ్యోతిబాపూలే స్టడీ సర్కిల్స్ ద్వారా దళిత, గిరిజన, మైనారిటీ నిరుద్యోగ యువతకు డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి సోమవారం రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఏలూరులో సొంత భవనాలున్నాయని, వాటితో పాటు ప్రతి జిల్లాలోను స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఏటా శిక్షణకు సంబంధించిన క్యాలెండర్ ప్రకటించాలని, నాణ్యతను పెంచే ప్యానల్ ఆఫ్ ఫ్యాకల్టీని ఏర్పాటు చేయాలని, స్టడీ సర్కిల్స్‌కి ప్రతి జిల్లాలో సొంత భవనాలు ఏర్పాటు చేసి పుస్తకాలతో కూడిన లైబ్రరీ సమకూర్చాలని, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల ద్వారా ఎంపిక చేసి స్టైఫండ్ ఇవ్వాలని కోరారు.

కొబ్బరికి నిబంధనల కొర్రీ



- రేపటి నుంచి కొనుగోలు కేంద్రాలు
- నాఫెడ్ వస్తున్నా పెరగని ధర
- స్థానిక కొబ్బరి కొంటేనే రైతులకు మేలు

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: కొబ్బరి కొనుగోలుకు సోమవారం నుంచి నాఫెడ్ కేంద్రాలు తెరుచుకోనున్నాయి. ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారంటే సహజంగా బహిరంగ మార్కెట్‌లో కొబ్బరి ఉత్పత్తుల ధరలు పెరగడం పరిపాటి. ఈ సారి మాత్రం ఆ పరిస్థితి లేదు. స్థానిక కొబ్బరిని నిబంధనల పేరుతో కొనుగోలు చేయకపోవడమే దీనికి కారణం. ఇదే అవకాశంగా దళారులు ఇతర రాష్ట్రాల నుంచి కొబ్బరి తేవడంతో ఇక్కడి మార్కెట్లో ధరల పెరుగుదల లేకుండా పోయింది.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. సగటున ఎకరాకు 7 వేల కొబ్బరికాయలు చొప్పున 126 కోట్ల కాయలు దిగుబడిగా వస్తోందని అంచనా. వస్తున్న కొబ్బరిలో 80 శాతం కాయ రూపంలో నేరుగా ఎగుమతి అవుతుంది. గతంలో స్థానికంగా ఎండు కొబ్బరి తయారీ (కొత్త కొబ్బరి, మిల్లింగ్ కోప్రా) ఉత్పత్తి చేసేవారు. తరువాత కాలంలో నల్లి తెగులు, తెల్లదోమ వంటి కారణాలతో దిగుబడి లేకపోవడంతోపాటు కాయ సైజు తగ్గిపోయింది. అప్పటి నుంచి స్థానిక ఎండు కొబ్బరికి ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గింది. దీంతో స్థానిక వ్యాపారులు, రైతులు ఎండు కొబ్బరి తయారీని పూర్తిగా నిలిపివేశారు. కేవలం ఆలయాల వద్ద భక్తులు కొట్టే కొబ్బరి చిప్పల నుంచి మాత్రమే ఎండు కొబ్బరి తయారు చేస్తున్నారు. అది కూడా చాలా తక్కువ మొత్తంలోనే. ఇది ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రోజుకు టన్ను కూడా ఉండదని రైతులు చెబుతున్నారు.

కొనుగోలు చేయకే ఇబ్బంది

కొబ్బరి ధర తగ్గినప్పుడు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్) ద్వారా ఎండు కొబ్బరి మిల్లింగ్ కోప్రాను కొనుగోలు చేస్తూ ఉంటారు. ఇక్కడ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు కొంటారు. ప్రస్తుత కొనుగోలు ధర క్వింటాలు రూ.11,160. ఇదే సమయంలో అంబాజీపేట మార్కెట్‌లో ధర రూ.9,500 మాత్రమే ఉంది. నాఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తారనే నమ్మకం ఉంటే ఎండు కొబ్బరి ధర బహిరంగ మార్కెట్‌లో పెరగాల్సి ఉన్నా కదలిక లేకుండా పోయింది. ఎండు కొబ్బరి తయారైతే ఆ ప్రభావం వల్ల పచ్చి, కురిడీ కొబ్బరి ధరలు సైతం పెరుగుతాయి. కానీ స్థానికంగా కొనుగోలు చేసే అవకాశం లేనందున కొబ్బరి ధరలు పెరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా మిల్లింగ్ కోప్రా తక్కువగా ఉండడం, పైగా నాఫెడ్ కొనుగోలు కోసం విధించిన నిబంధనలకు సరిపడే విధంగా ఉత్పత్తి జరగకపోవడంతో 2020–21, 2021–22లో కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోలు జరగలేదు. కానీ గత ఏడాది మాత్రం ఏకంగా 40,359 క్వింటాళ్ల కొబ్బరి కొనుగోలు చేశారు. రైతులు ఇక్కడ కొబ్బరి నేరుగా విక్రయించే అవకాశం లేదు. ఈ నిబంధనలకు అనుగుణంగా స్థానికంగా కొబ్బరి ఉత్పత్తి చాలా తక్కువ ఉంది. స్థానికంగా ఎండు కొబ్బరిని ఉత్పత్తి చేయడంతో పాటు నాఫెడ్‌లో కొనుగోలు చేస్తేనే మిగిలిన కొబ్బరి ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశముంది. ఇది జరగాలంటే స్థానిక ఉత్పత్తులను నాఫెడ్ కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలి. ఇక్కడి వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నాఫెడ్ నిబంధనలను సడలించాలని రైతులు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే..

సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు 8న నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో ప్రారంభిస్తాం. కొబ్బరి విక్రయించే రైతులు తమ రిజిస్ట్రేషన్లను ఆర్బీకేల్లో గత నెల 19 నుంచే చేసుకున్నారు. వారి నుంచి మాత్రమే కొబ్బరిని కొనుగోలు చేస్తాం. నాఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో బాల్‌కోప్రా క్వింటాలుకు రూ.12 వేలు, మిల్లింగ్ కోప్రాను రూ.11,160గా ధర నిర్ణయించాం. నెలలో ఎకరానికి రెండు బస్తాల కొబ్బరిని అనుమతిస్తాం. ఈ కొనుగోలు కేంద్రం సెప్టెంబర్ వరకూ కొనసాగిస్తాం. అనంతరం అధికారుల ఆదేశాల మేరకు నిర్వహణ ఉంటుంది. నాఫెడ్ కేంద్రం ప్రారంభానికి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నాఫెడ్, ఆయిల్ ఫెడ్ అధికారులు హాజరవుతారు.

– యు.సుధాకరరావు, ఆయిల్ ఫెడ్ మేనేజర్,
గణపతి వీరరాఘవులు, కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్


మహాప్రసాదం స్వామీ



సత్యదేవుని నూతన నమూనా ఆలయం వద్ద ప్రసాదం కౌంటర్



గత మార్చి 16న ప్రసాద విక్రయాలు లాంఛనంగా ప్రారంభించిన నాటి దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ



ఆ రోజుల్లో అధికం

- ఆషాఢం ఆరంభం
- లోవకు పెరగనున్న భక్తుల తాకిడి
- సత్యదేవుని ప్రసాదానికి రానున్న గిరాకీ
- ఆదివారాల్లో లక్ష ప్యాకెట్ల వరకూ విక్రయాలు!
- తొలి పావంచా, పాత, కొత్త నమూనా ఆలయాల వద్ద అమ్మకాలు
- అన్నవరం దేవస్థానానికి రూ.కోటి ఆదాయం వచ్చే అవకాశం

అన్నవరం: ఆషాఢ మాసం ప్రారంభమైంది. ఈ మాసమంతా జగన్మాత దర్శనాలకు, పూజలకు భక్తులు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూంటారు. సమస్త జీవరాశికీ క్షుద్బాధను తీరుస్తున్న ఆ తల్లిని ఆదివారాలు, ఇతర ముఖ్య పర్వదినాల్లో రకరకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించి తమ భక్తిని చాటుకుంటారు. ఆ జగజ్జనని వెలసిన క్షేత్రాల్లో తుని మండలం లోవ కొత్తూరులోని తలుపులమ్మ అమ్మవారి ఆలయం ఉమ్మడి తూర్పు గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆషాఢ మాసం ప్రారంభమైందంటే చాలు.. ఇక్కడికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తూంటారు. పలువురు కార్లు, వ్యాన్లు, ఇతర వాహనాల్లో కూడా ఆ తల్లిని దర్శించుకుంటారు. ఏటా ఆషాఢంలో తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో వస్తున్న భక్తులతో అటు లోవ దేవస్థానానికి దండిగా ఆదాయం వస్తూండగా.. ఇటు అన్నవరం దేవస్థానానికి కూడా కాసుల వర్షం కురుస్తోంది.

ఆషాఢంలోనే ఎందుకంటే..

అన్నవరం దేవస్థానానికి ఆషాఢంలో అధికంగా ఆదాయం రావడానికి సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులే కారణమని అనుకుంటే పొరపాటే. వాస్తవానికి ఆషాఢంలో ఏకాదశి, పౌర్ణమి వంటి పర్వదినాలు, శని, ఆదివారాలు మినహా సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య తక్కువగా ఉంటుంది. కానీ, తలుపులమ్మ తల్లి దర్శనానికి మాత్రం రాజమహేంద్రవరం, కాకినాడతో పాటు కోనసీమ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు వెళ్తూంటారు. వీరందరూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి తిరుగు ప్రయాణమై, అన్నవరం మీదుగా స్వస్థలాలకు వెళ్తూంటారు. ఈ క్రమంలో చాలా మంది అన్నవరంలో తప్పనిసరిగా ఆగి, సత్యదేవుని ప్రసాదాలు కొనుగోలు చేస్తూంటారు. దీంతో అన్నవరం దేవస్థానానికి ఆషాఢంలో పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోంది.

ఆ రోజుల్లో అధికం

తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి ఆది, మంగళ, గురు, శుక్రవారాల్లో భక్తులు అధికంగా వెళ్తూంటారు. ఒక్క ఆదివారం నాడే సుమారు 50 వేల నుంచి లక్ష మంది వరకూ భక్తులు లోవ దేవస్థానానికి వెళ్తారు. వారిలో అధిక శాతం మంది తిరుగు ప్రయాణంలో సత్యదేవుని ప్రసాదాలు కొనుగోలు చేస్తారు. ఒక్క ఆదివారం నాడే సుమారు 50 వేల నుంచి లక్ష ప్రసాదాల ప్యాకెట్ల విక్రయాలు జరుగుతాయి. ఒక్కో ప్రసాదం ప్యాకెట్ విలువ రూ.20. దీని ప్రకారం ఆషాఢ మాసంలో నాలుగు ఆదివారాలు కలిపితే సుమారు రూ.60 లక్షల ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగిలిన రోజుల్లో ప్రసాద విక్రయాల ద్వారా మరో రూ.40 లక్షలు వచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

భక్తుల రద్దీని తట్టుకునేలా..

- స్వామివారి ప్రసాదానికి డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో అన్నవరం దేవస్థానం అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది.
- అన్నవరం బైపాస్ రోడ్డు వద్ద ఉన్న స్వామివారి పాత నమూనా ఆలయం వద్ద, రత్నగిరి మెట్ల మార్గంలో తొలి పావంచా వద్ద ఉన్న ప్రసాద విక్రయ స్టాల్స్‌లో పెద్ద ఎత్తున ప్రసాదాలు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు.
- రత్నగిరి తొలి పావంచా వద్ద, జాతీయ రహదారిపై విశాఖపట్నం వైపు వెళ్లే మార్గంలోని పాత నమూనా ఆలయం వద్ద అదనంగా మూడేసి చొప్పున కౌంటర్లు ఏర్పాటు చేశారు.
- జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో నిర్మించిన కొత్త నమూనా ఆలయం వద్ద కూడా రెండు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ శనివారం నుంచి ప్రసాదాలు విక్రయిస్తున్నారు. ఇక్కడ ప్రసాదం విక్రయాలను గత మార్చి నెలలో అప్పటి దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ లాంఛనంగా ప్రారంభించారు. ఆ తరువాత ప్రసాదం విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రసాదం కౌంటర్‌లో క్యూ లైన్లు, ఇతర పెండింగ్ పనులు పూర్తి చేశారు.
- ఆదివారం నాడు భక్తులకు విక్రయించేందుకు గాను నమూనా ఆలయం కౌంటర్ వద్ద 20 వేలు, తొలి పావంచా కౌంటర్ వద్ద 30 వేలు, రత్నగిరి కౌంటర్ల వద్ద 30 వేలు, కొత్త నమూనా ఆలయం వద్ద 20 వేల చొప్పున మొత్తం లక్ష ప్రసాదం ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నట్లు ఆ విభాగం అధికారులు తెలిపారు.

తలుపులమ్మ ఆషాఢ మాసోత్సవాలు ఆరంభం



తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు ఆరంభమయ్యాయి. ప్రధానార్చకులు, వేద పండితులు అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆగస్టు ఐదో తేదీ వరకూ ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆదివారం వివిధ రకాల మట్టిగాజులతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పిస్తామని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, లోవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. అమ్మవారిని దర్శించేందుకు వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా తుని రూరల్ సీఐ, ఎస్సైలను కోరామని చెప్పారు. దేవస్థానం నుంచి మరో 20 మంది ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించామన్నారు. కొండ పైన, దిగువన రెండు పోలీసు అవుట్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకోనున్నామన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాలను సిద్ధం చేశామని చెప్పారు. అపరిశుభ్రత నెలకొనకుండా ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఐదు లక్షల లీటర్ల నీటి నిల్వలను అందుబాటులో ఉంచామని, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాల్సిందిగా పీహెచ్‌సీ అధికారులను కోరామని వివరించారు. సమస్యలను గుర్తించి, అవసరమైన సదుపాయాలను రెండో ఆదివారం కల్పిస్తామని ఈఓ విశ్వనాథరాజు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

రోడ్డు మరమ్మతు చేపట్టరూ



వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నేతలు

రాయచూరు రూరల్: తాలూకాలోని గిల్లేసూగూరు–గాణదాళ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పంచాయతీ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి ఆయన మాట్లాడారు. రోడ్డుకు పీస్ వర్క్ పనులు చేసి చేతులు దులుపుకున్నారని, పూర్తి స్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఇంజినీర్ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు.

నీట్‌లో అక్రమాలపై విచారణకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో సింగిల్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు రమేష్ మాట్లాడారు. నీట్ శిక్షణ, కోచింగ్, పరీక్షల విషయంలో అధిక ప్రమాణంలో జరిగిన అవ్యవహారంపై పూర్తి స్థాయి న్యాయమూర్తితో విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ

హుబ్లీ: ఇక్కడి నాగశెట్టి కొప్పలో ఇంటికి వేసిన తాళాన్ని పగలకొట్టి లోనికి వెళ్లిన దొంగలు రూ.1.46 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదును శనివారం చోరీ చేశారు. జతిన్ మిషే అనే వ్యక్తి ఇంట్లో ఈ చోరీ జరిగింది. తాళం పగలగొట్టి లోనికి వెళ్లిన దొంగలు బెడ్రూంలోని అల్మారా లాకర్, ఇతర గూడుల్లో పెట్టిన లాక్‌లను రాడుతో తొలగించి చోరీకి పాల్పడ్డారు. వాటిలో ఉన్న రూ.71 వేల విలువ చేసే 21 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.75 వేల నగదు చోరీ చేసి పరారైనట్లు కేశ్వాపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. హుబ్లీలోని అదరగుంచి తగ్గినకేరి ప్లాట్‌లో నవీన్ అనే వ్యక్తి ఇంట్లో వెనుక కిటికీలను విరిచి లోనికి వెళ్లిన దొంగలు ఆ ఇంట్లో ఉన్న రూ.1.45 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, మొబైల్‌ను చోరీ చేశారు. ఘటనపై హుబ్లీ గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జనరిక్ ఔషధ దుకాణంలో చోరీ

- తాళం పగలగొట్టి రూ.18 వేలు నగదు దోచుకెళ్లిన దుండగులు



మందుల షాపులో పరిశీలిస్తున్న పోలీసులు

బళ్లారి రూరల్: విమ్స్ ఆవరణలోని ముఖద్వారం పక్కన ఉన్న జనరిక్ ఔషధ కేంద్రం తాళం పగలగొట్టి దుండగులు నగదు చోరీ చేసిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. జనరిక్ ఔషధ కేంద్రం నిర్వాహకులు తెలిపిన వివరాలు.. శనివారం మందులు అమ్మిన సొమ్ము రూ: 18,116 వచ్చింది. ఆదివారం సెలవు కావడంతో డబ్బును ఒక కవర్‌లో ఉంచి డ్రాలో పెట్టి తాళాలు వేసుకుని వెళ్లారు. సోమవారం ఉదయం షాపు తెరవడానికి వెళ్లగా షెట్టర్ తాళం పగులగొట్టి ఉంది. షెట్టర్ రాడ్‌లు తొలగించారు. అనుమానంతో లోపలికి వెళ్లి పరిశీలిస్తే డ్రాలో పెట్టిన డబ్బు లేదు. దుండగులు వెనుక వైపు డోరు నుంచి పరారైనట్లు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో కౌల్‌బజార్ పోలీసులు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకొన్నారు.

బస్సుపాస్‌ల కోసం విద్యార్థుల క్యూ



పాతబస్టాండులో కౌంటర్ వద్ద బస్సుపాస్‌ల కోసం గుమికూడిన విద్యార్థులు

బళ్లారి రూరల్: కేఎస్‌ఆర్‌టీసీ రాయితీ ధరతో విద్యార్థులకు బస్సు పాస్‌లను అందజేస్తోంది. ఇందుకోసం విద్యార్థులు తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పల్లెల నుంచి పట్టణాలకు వచ్చి చదువుకునే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. అయితే ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థులు, గత ఏడాది విద్యార్థులు బళ్లారి పాత బస్టాండులో బస్సుపాస్‌ల కోసం క్యూ కట్టారు. ఉన్న రెండు కౌంటర్ల వద్ద విద్యార్థులు పెద్దసంఖ్యలో గుమికూడారు.

వరదలతో ఐదు వంతెనలు మునక

- పలు జిల్లాల్లో కొనసాగుతున్న భారీ వర్షాలు
- నదుల ఉగ్రరూపంతో స్తంభించిన రాకపోకలు



దూద్‌గంగా నది వరదనీటిలో మునిగిపోయిన రోడ్డు వంతెన



గుంటకతో విత్తనాలు నాటుతున్న రైతన్న

సాక్షి బళ్లారి: కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలతో పలు జిల్లాల్లో నదులు ఉగ్రరూపం దాల్చాయి. మహారాష్ట్రలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బెళగావి జిల్లాలో కృష్ణానది పొంగిపొర్లుతోంది. వేదగంగా, దూద్‌గంగా నదుల్లో నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో ఐదు వంతెనలు జలావృతమయ్యాయి. మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో నిరంతరంగా కురుస్తున్న వర్షాల వల్ల బెళగావి జిల్లా చిక్కోడి ప్రాంతంలో ప్రవహిస్తున్న వేదగంగా, దూద్‌గంగా నదుల్లో వరదనీరు భారీ స్థాయిలో పెరగడంతో ఆయా గ్రామాల్లో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాంజరీ–భావన, మలిక్‌వాడ– దత్తవాడ ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. నిప్పాణి తాలూకాలో వేదగంగా నదిలో నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. ఈనేపథ్యంలో తాలూకాలోని కున్నూరు– భారవాడ ప్రాంతాలకు రాకపోకలు సాగే వంతెన కూడా నీటిలో మునిగిపోయింది.

దూద్‌గంగా నదికి పోటెత్తిన వరద

దూద్‌గంగా నదికి అడ్డంగా ఉన్న కరాదగ– భోజ్, హున్నరగి– భోజవాడి మధ్య రాకపోకలు జరిగే వంతెన నీటిలో మునిగిపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు వంతెనలపై పెద్ద ఎత్తున నీరు ప్రవహించడం వల్ల చుట్టుపక్కల 10 కిలోమీటర్లకు పైగా జనం రాకపోకలు నిలిచిపోయాయి. కృష్ణానదిలో పెద్ద ఎత్తున నీరు ప్రవహించడంతో బెళగావి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాలకు చెందిన ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వారం రోజులుగా పెద్ద ఎత్తున కొనసాగుతున్న రుతుపవనాలతో దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, ఉడిపి, బెళగావి, బీదర్, కలబుర్గి, యాదగిరి, చిక్కమగళూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. గదగ్, హావేరి, కొప్పళ, ధార్వాడ, రాయచూరు, బళ్లారి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధం

చిత్రదుర్గ, దావణగెరె, హాసన, కొడగు, మండ్య తదితర జిల్లాల్లో కూడా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్నారు. పూర్తిగా వచ్చిన మార్పులతో వాతావరణం చల్లబడిపోయింది. ముంగారు వర్షాలతో రైతన్నలు ఉత్సాహంగా సేద్యం పనుల్లో నిమగ్నులయ్యారు. మంగళూరు తాలూకాలో భారీ వర్షం కురవడంతో పీయూసీ విద్యార్థులకు సెలవు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలతో అక్కడక్కడ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ వర్షాల వల్ల జలాశయాల్లోకి నీటి ప్రవాహం పెరుగుతోంది. తుంగభద్ర డ్యాంలోకి కూడా ఇన్‌ఫ్లో 25 వేల క్యూసెక్కులకు పైగా కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం 21 టీఎంసీలకు చేరుకుంది. మొత్తం మీద వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ముంగారుకు సాగు నీటి సమస్య లేకుండా విత్తనసాగు ఊపందుకుంటోంది.

యువతితో మాట్లాడినందుకు విద్యార్థిపై దాడి

- వీడియో వైరల్, ఐదుగురి అరెస్ట్

హుబ్లీ: స్కూల్ విద్యార్థిపై యువకుల గుంపు దాడి చేసిన ఘటనకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు హుబ్లీ ధార్వాడ పోలీస్ కమిషనర్ ఎస్.శశికుమార్ తెలిపారు. అశోక్‌నగర పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూల్ విద్యార్థితో ఐదారు మంది యువకుల గుంపు ఘర్షణ పడి దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో పాఠశాలలు, కళాశాలలు, ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకున్నామని కమిషనర్ తెలిపారు. ఘటనకు సంబంధించి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశోక్‌నగర్ స్టేషన్ సీఐ నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభమైంది. దాడి చేసిన యువకుల వివరాలు సేకరించారు. యువతితో మాట్లాడిన విషయానికి సంబంధించి యువకుల మధ్య వాగ్వాదం పెరిగి దాడి జరిగింది. దాడి చేసిన యువకులు హుబ్లీలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన నలుగురు యువకులపై సంబంధిత చట్టం మేరకు, ప్యారామెడికల్ కళాశాల విద్యార్థి అయిన మరో నిందితుడు చాళుక్య నగర్ ఫ్రాన్సిస్ డమిపై చట్టరీత్య చర్యలు తీసుకున్నామన్నారు. అంతేగాక సంబంధిత విద్యార్థులు చదువుకునే పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించామన్నారు. ఇక ముందు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనకుండా విద్యార్థులను మందలించి తగిన రీతిలో కౌన్సిలింగ్ చేశామన్నారు. ముఖ్యంగా జంట నగరాల పరిధిలోని అన్ని విద్యా సంస్థల లోపల, బయట ఆవరణలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. విద్యా సంస్థల పరిధిలో ఎటువంటి అసాంఘిక ఘటనలు జరిగినా ఆ విద్యా సంస్థ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు తక్షణమే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు లేదా 112 సహాయవాణి నెంబర్‌కు ఫోన్ చేయాలని కమిషనర్ తెలిపారు.

ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరం



శిబిరంలో పాల్గొన్న పాత్రికేయులు

రాయచూరు రూరల్: నగరంలోని పాత్రికేయులకు ఉచిత ఆరోగ్య చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం పాత్రికేయుల భవనంలో విలేఖర్లకు బీపీ, సుగర్, కంటి నేత్ర చికిత్స శిబిరాలను తాలూకా ఆరోగ్య అధికారి ప్రజ్వల్ కుమార్ ప్రారంభించారు. పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు చెన్నబసవ, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో 70 మందికి చికిత్స నిర్వహించారు.

జిల్లా ఎస్పీగా బాధ్యతల స్వీకారం



చార్జి స్వీకరించిన పుట్టమాదయ్య

రాయచూరు రూరల్: జిల్లా ఎస్పీ నిఖిల్ కోలారుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బెంగళూరు లోకాయుక్త ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పుట్టమాదయ్య ఆదివారం అధికార బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీ శివకుమార్ చేతుల మీదుగా బాధ్యతలను అందుకున్నారు. అనంతరం జిల్లాలోని డీఎస్పీ, సీఐ, సీఎస్ఐలతో సమావేశం జరిపారు.

108 అడుగుల విగ్రహం స్థాపన

కేజీఎఫ్: నగరంలో 108 అడుగుల బేతాళ విగ్రహాన్ని సోమవారం 10 మందికి పైగా అఘోరీల సమక్షంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా బేతాళ విగ్రహానికి కుంభాభిషేకం నిర్వహించారు. ముందుగా భద్రకాళి, కాళభైరవేశ్వర, ప్రత్యంగిరా, కాటేరమ్మ, కరికట్ట దేవతల ప్రతిష్ఠాపన, కుంభాభిషేకాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన చంద్రకాంత్ తనకు కలలో గ్రామంలో బేతాళ విగ్రహాన్ని స్థాపించాలని సూచించడంతో ఇల్లు విడిచి వెళ్లి అఘోరీలతో కలిసి వారితో విద్య నేర్చుకుని తిరిగి గ్రామానికి వచ్చి విగ్రహాన్ని స్థాపించారు. ప్రస్తుతం గ్రామంతో పాటు జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా, ఆంధ్ర, తమిళనాడులో చంద్రకాంత్‌కు శిష్య బృందం ఉన్నారు. బేతాళ విగ్రహ స్థాపనకు హాజరైన భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

డెంగీ, చికెన్‌గున్యాలపై జాగృతి జాతా

శ్రీనివాసపురం: తాలూకాలోని లక్ష్మీపుర గ్రామంలో గ్రామ పంచాయతీ సహకారంతో ఆరోగ్య శాఖ అధికారులు సోమవారం డెంగీ, చికెన్ గున్యాలపై జాగృతి జాతాను నిర్వహించారు. జాతాను ప్రారంభించి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జబీవుల్లా మాట్లాడుతూ తీవ్ర జ్వరం, ఒళ్లు, కీళ్లనొప్పులు, తలనొప్పి, వాంతులు, వికారం, నోరు, ముక్కుల నుంచి, చర్మంపై అక్కడక్కడ రక్తస్రావం కనిపిస్తే తక్షణం వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. డెంగీని అరికట్టడానికి ముందు జాగ్రత్తగా నీటి తొట్టెలు, డ్రమ్ములు, బ్యారెళ్లు, ట్యాంకర్లను కనీసం వారానికోసారి శుభ్రం చేయాలన్నారు. ఈసందర్భంగా గ్రామస్తులకు కరపత్రాలను పంచారు.

పర్యావరణ రక్షణపై జాగృతికి సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పచ్చని చెట్లు నాటి దేశం, పరిసరాల సంరక్షణకు రాజేంద్ర గంజ్ యువత నడుం బిగించింది. సోమవారం ఏపీఎంసీ వద్ద గంజ్ యువత సంచాలకుడు నరసరెడ్డి మాట్లాడారు. భవిష్యత్తులో మానవుడు గాలి, వానల కోసం ఇబ్బందులు పడకుండా ఉండాలంటూ రాయచూరు నుంచి తిరుపతికి సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

పచ్చదనంతో పర్యావరణాన్ని సంరక్షిద్దాం



కార్యక్రమం ప్రారంభిస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పచ్చని చెట్లను నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని సుల్తాన్‌పుర మఠాధిపతి శంభు సోమనాథ శివాచార్య స్వామీజీ పేర్కొన్నారు. సోమవారం దేవదుర్గ తాలూకాసుల్తానపుర మఠంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో వానలు కురవడానికి ప్రతి ఇంటి ముందు చెట్లు పెంచి పరిసరాలను సంరక్షించాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు ప్రభు లింగనగౌడ, కార్యదర్శి హనుమంతు నాయక్, అశోక్ అంతరగంగిలున్నారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షురాలు రేణుకమ్మ మాట్లాడారు. వంట చేసే వారికి ఆహార సామగ్రిని సరఫరా చేసే అవకాశం కల్పించాలన్నారు. వేతన బకాయిలు చెల్లించాలని, వేసవి సెలవుల్లో లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారికి గౌరవధనం చెల్లించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ముడా స్కాంలో సీఎంను రక్షిస్తున్నారు

- మాజీ సీఎం జగదీష్ శెట్టర్

హుబ్లీ: ముడా కుంభకోణం దర్యాప్తు సరైన దిశలో సాగడం లేదు. ముఖ్యమంత్రిని రక్షించేందుకు అంతా ప్రయత్నిస్తున్నారని బెళగావి ఎంపీ జగదీశ్ శెట్టర్ ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదివారం మైసూరులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్‌ఎస్ మహదేవప్ప విలేకరులతో మాట్లాడుతూ సీఎంను సమర్థిస్తూ కాగితపు పామును వదిలారన్నారు. ఇది సీఎంను రక్షించేందుకు పన్నిన వ్యూహం అన్నారు. ముడా స్కామ్‌లో వేరే పార్టీ నేతలు కూడా ఉన్నారన్నారు. ఇతరులు కూడా స్కామ్‌లో భాగస్వాములే అన్నారు. ఎమ్మెల్యేలందరూ కూడా స్కామ్‌లో ఉన్నారు. మంత్రి మహదేవప్ప చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కాంగ్రెస్ నేతల అవినీతి బండారం త్వరలోనే బయటపడుతుందన్నారు. ఈ స్కామ్ నుంచి సీఎంను రక్షించేందుకు ఆ పార్టీ నేతలు విలేకరుల సమావేశాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎటువంటి కారణంతోనైనా సీఎంను రక్షించే పని చేయరాదని హితవు చెప్పారు. మహదాయి పథకం ప్రారంభం కనకుంబి కేంద్ర బృందం పర్యటనపై స్పందించిన ఆయన ఈ బృందం వచ్చింది. పర్యావరణం, పులుల కారిడార్ నేపథ్యంలో పర్యటించి ఉంటే ఓకే నన్నారు. అయితే కేంద్రం నుంచి ఇలాంటి బృందాలు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి కదా? అని ఆయన నిలదీశారు.

పోషణ్ అభియాన్‌కు శ్రీకారం



ప్రారంభిస్తున్న ఏడీసీ దురుగేష్ తదితరులు

రాయచూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ మహత్తర పథకంతో రాయచూరు, యాదగిరి జిల్లాల్లో ఐదింటిలో వంద శాతం ఫలితాలను సాధించామని అదనపు జిల్లాధికారి దురుగేష్ పేర్కొన్నారు. సోమవారం జెడ్పీ సభాభవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంపూర్ణ పోషణ్ అభియాన్‌కు శ్రీకారం చుట్టి మాట్లాడారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, సాంఘీక భద్రత, పోషణ్ అభియాన్‌లో వంద శాతం ఫలితాలు సాధించామన్నారు. సెప్టెంబర్ వరకు ఐదు అంశాలపై పూర్తి స్థాయిలో మరింత అభివృద్ధిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో జెడ్పీ ఉప కార్యదర్శి శశికాంత శివపురె, జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్ర బాబు, జిల్లా విద్యాశాఖాధికారి బడిగేర, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి చేతన్ కుమార్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవికలున్నారు.

కోలారు వార్తలు...

నాసిరకం ఆహార ధాన్యాలపై మండిపాటు



ఆహార ధాన్యాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: చిక్కతిరుపతి గ్రామ ప్రభుత్వ బాలుర విద్యార్థి నిలయాన్ని సోమవారం ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తనిఖీ చేశారు. హాస్టల్‌లో వినియోగిస్తున్న ఆహార పదార్థాలు నాసిరకంగా ఉండడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. హాస్టల్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలు సరిగా ఉండటం లేదని ఫిర్యాదులు రావడంతో జిల్లా సంక్షేమ శాఖ అధికారికి ఫోన్ చేసి హాస్టల్ వార్డెన్, వంట వారిని సస్పెండ్ చేయాలని సూచించారు. పిల్లలకు వండే ఆహార పదార్థాలు రుచి, శుచిగా లేకుంటే కఠిన చర్యలు తప్పవని వార్డెన్‌ను హెచ్చరించారు. తాలూకా సంక్షేమ శాఖ అధికారికి ఫోన్ చేసి మండిపడ్డారు. అవ్యవస్థను సరిచేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల హాజరు పుస్తకంలో నిత్యం 33 మంది పిల్లలు ఉన్నట్లు చూపగా హాస్టల్‌లో కేవలం ఏడుగురు పిల్లలు మాత్రమే ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. వంట మనిషి లక్ష్మణ్‌ను వెంటనే సస్పెండు చేయాలన్నారు.

కుంభకోణంపై సీబీఐ తనిఖీ చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ డిమాండ్

కోలారు: ముడా అక్రమాలపై తనిఖీని సీబీఐకి అప్పగించి ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ మాజీ ఎమ్మెల్సీ వైఏ నారాయణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. బీడీఏను తలదన్నేలా ముడాలో అక్రమాలు జరిగాయన్నారు. ఈ కేసులో సిద్దరామయ్య ఆయన ఇంటి స్థలం వదిలి పెట్టడానికి రూ.63 కోట్ల పరిహారం అడుగుతున్నారన్నారు. ముడా వ్యాప్తిలో ఎమ్మెల్యే కూడా సభ్యుడన్నారు. ఆ ప్రాంత ఎమ్మెల్యే అయిన సిద్దరామయ్యకు తెలియకుండా ఏమీ జరగదన్నారు. ముడా కుంభకోణంలో సిద్దరామయ్యకు నేరుగా పాత్ర ఉందని ఆరోపించారు.

ముడాలో ఎలాంటి అక్రమాలు జరగలేదంటున్న నగరాభివృద్ధి మంత్రి భైరతి సురేష్ హెలికాప్టర్‌లో ఎందుకు రికార్డులు తీసుకెళ్లారని ప్రశ్నించారు. మైసూరు జిల్లా కలెక్టర్‌ను ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించారు. వాల్మీకి మండలిలో రూ.187 కోట్ల నిధుల దుర్వినియోగంతో ఎస్టీ సముదాయానికి అన్యాయం జరిగిందన్నారు. ఇష్టారాజ్యంగా నిధులు డ్రా చేసి తెలంగాణ ఎన్నికలకు ఖర్చు చేశారని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, ప్రవీణ్‌గౌడ, కెంబోడి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులను ఆదుకుంటాం



ఉచిత బ్యాగు, లేఖన సామగ్రి అందించిన దృశ్యం

కోలారు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల విద్యా ప్రగతికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని బెంగళూరు మార్వాడి యువ మంచ్ సురేందర్ గోయల్ హామీ ఇచ్చారు. సోమవారం తాలూకా శిక్షక గెళెయర బళగ మనవి మేరకు తాయలూరు, బేతమంగల ఫిర్కాలోని పాఠశాలల్లో 135 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉచిత బ్యాగులు, లేఖన సామగ్రిని అందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఎంతో మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారు. సంస్థ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సౌకర్యాలను అందించడానికి సదా సిద్ధంగా ఉంటుందన్నారు. మార్వాడి మంచ్ స్నేహ కుమార్ జాజు, దాత సుశీల్ గోయల్, బళగ అధ్యక్షుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

50 మంది రౌడీలపై కేసుల నమోదు

హుబ్లీ: జంట నగరాల్లోని పోలీసులు ఇక్కడి కేశ్వాపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఏరియా డామినేషన్‌పై చర్యలు తీసుకొని 20 మంది రౌడీషీటర్లతో పాటు మొత్తం 50 మందిపై కేపీ యాక్ట్ కింద కేసులు దాఖలు చేసి హెచ్చరించారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుండటంపై స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీస్ కమిషనర్ శశికుమార్ మార్గదర్శకత్వంలో డీసీపీలతో కూడిన బృందం ఆదివారం ఆకస్మిక కార్యాచరణ నిర్వహించింది. ఈ క్రమంలో కేశ్వాపుర స్టేషన్ పరిధిలో 20 మంది రౌడీషీటర్లు, ఖాళీ స్థలాల్లో రోడ్డు పక్కన కూర్చుని మద్యం తాగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న 45 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కొందరిపై కేపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు. మిగతా వారికి హెచ్చరికలు జారీ చేసి వదిలి పెట్టారు. అలాగే వారి తల్లిదండ్రులకు కూడా తమ పిల్లలకు తగిన విధంగా హితవు చెప్పాలని సూచించారు. ఈ కార్యాచరణ నిరంతరంగా సాగుతుందని పోలీసు వర్గాలు తెలిపాయి.

ఉన్నతాధికారి మృతి



మహ్మద్ యూసఫ్(ఫైల్)

రాయచూరు రూరల్: జిల్లాలో 25 ఏళ్లకు పైగా జెడ్పీ ఉప కార్యదర్శిగా, ఉన్నతాధికారిగా విధులు నిర్వహించిన మహ్మద్ యూసఫ్(60) గుండెపోటుతో మరణించారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం బెంగళూరులోని నివాసంలో తుదిశ్వాస వదిలారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా యలియూరు వాస్తవ్యుడైన మహ్మద్ యూసఫ్ ఉద్యోగ జీవితమంతా రాయచూరు జిల్లాలోనే గడిపారు. మాన్విలో వివాహం చేసుకున్నారు. మాన్వి టీపీ అధికారిగా, జెడ్పీ ఉప కార్యదర్శిగా పని చేశారు. ఏడాది క్రితం పదోన్నతిపై బెంగళూరు వెళ్లారు. ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయాల్సి ఉండగా మరణించారు. ఆయన మృతిపై అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

ఫసల్ బీమా సొమ్ము విడుదలకు డిమాండ్



వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలో వ్యవసాయ శాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం నిధులు తమకు విడుదల చేయడం లేదని రైతులు ఆరోపించారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో దేవదుర్గ తాలూకా పలకన మరడి, వందలి గ్రామాల రైతులు బీమా పథకంలో చేరినా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవిక, అసిస్టెంట్ డైరెక్టర్లు భారీ ఎత్తున అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పట్టాలకు కాదని భూములు లేని వారి బ్యాంక్ ఖాతాల్లోకి ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం డబ్బులు పడ్డాయన్నారు. తమకు పరిహారం అందించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

శ్మశానానికి దారివ్వరూ..



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన దృశ్యం

కేజీఎఫ్: శ్మశానానికి వెళ్లే దారిలో ఆక్రమణలను తొలగించి దారిని కల్పించాలని కోరుతూ తాలూకాలోని కాలువలహళ్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ చాలా ఏళ్లుగా గ్రామ సర్వే నెంబర్–181, 182, 189, 190లో కాలువలహళ్లి గ్రామ శ్మశానం, బెళగానకెరెకు వెళ్లే దారి రికార్డుల్లో ఉన్నా కొంతమంది అతిక్రమించుకుని దారి లేదంటున్నారన్నారు. దీంతో శ్మశానానికి మృతదేహాలను తీసుకు వెళ్లడం కష్టంగా ఉందన్నారు. ఆక్రమణలను తొలగించి శ్మశానానికి మృతదేహాల తరలింపునకు అనుకూలం కల్పించాలని తహసీల్దార్‌కు విన్నవించారు. వెంకటేష్, జయరామిరెడ్డి, యర్రప్ప, సుబ్రమణి తదితరులు ఉన్నారు.

జిల్లా ఎస్పీకి సన్మానం



సన్మానం అందుకుంటున్న ఎస్పీ నిఖిల్

కోలారు: జిల్లా ఎస్పీ నిఖిల్‌కుమార్‌ను దళిత సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమన్వయ సమితి సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో దళితులపై నిరంతరంగా జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టి రక్షణ కల్పించాలని కోరారు. కర్ణాటక హితరక్షణ వేదిక సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నారాయణస్వామి, కర్ణాటక దళిత నాగరిక సమితి రాష్ట్ర అధ్యక్షుడు పురహళ్లి జి.యల్లప్ప, నాగనాళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.